ANDHRA BHOOMI

SECUNDERABAD ANDHRA PRADESH
Phone: Editorial — 74083
Office — 72244

Regd. A-399

THE POPULAR TELUGU DAILY PUBLISHED FROM THE CAPITAL

ఆంధ్రభూమి

ఎడిటర్ : గోరాశాస్త్రి

110887

ఆంధ్రభూమి చందా రేట్లు

		ఏజంటు ద్వారా	పోస్టు ద్వారా	విమానం ద్వారా
సంవత్సరానికి	రు.	27-00	28-00	36-00
అర్ధ సంవత్సరానికి	రు.	14-00	15-00	19-00
మూడు నెలలకు	రు.	7-00	8-00	10-00

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ
రజతోత్సవము మరియు మహాసభ
10-11 మే 1964 తేదీలలో వైశ్య విద్యార్థి వసతి గృహము కాచిగూడ స్టేషన్ రోడ్ హైదరాబాద్ లో జరుగును.
కె. సి. గుప్త
ఆహ్వానసంఘ గౌరవప్రధాన కార్యదర్శి

సంపుటి 4 : సంచిక 212 * సికింద్రాబాద్ 6-5-1964 బుధవారం * 6 పేజీలు : 7 నయాపైసలు

రాజమన్నారు అధ్యక్షతన నాల్గవ ఆర్థికసంఘం నియామకం

ఉత్పత్తి, వాడకం, ఎగుమతులపై రాష్ట్రాల కేంద్ర పన్నుల ప్రభావంకూడా పరిశీలించాలని ఆదేశం

న్యూఢిల్లీ, మే 5 (పి. టి. ఐ.)

మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ పి. వి. రాజమన్నారు అధ్యక్షుడుగా నాలుగవ ఆర్థికసంఘాన్ని (ఫైనాన్స్ కమిషన్) నియమించారు.

రాజ్యాంగం నిర్దేశించినట్లు రెండు అంశాలే కాక, మరో ఐదు అంశాలను కూడా పరిశీలించి నివేదికను సమర్పించాలని ఆర్థిక సంఘాన్ని కోరారు.

ఆర్థిక సంఘం అదనంగా పరిశీలించే అంశాలలో ఒకటి రాష్ట్రాలకు ఇచ్చే సహాయానికి సంబంధించినది. రాజ్యాంగం 275 నిబంధన ప్రకారం, అవసరంలో ఉన్న రాష్ట్రాలకు కేంద్రం ఆర్థిక సహాయం చేయడం గురించి సంఘం పరిశీలిస్తుంది.

వనరులు లేక ఉత్పత్తుల వాడకం పైన, ఉత్పత్తి పైన, ఎగుమతుల పైన రాష్ట్రాలు విధించే అమ్మకం పన్ను, కేంద్రం వేసే ఎక్సైజ్ సుంకం ప్రభావాన్ని పరిశీలించాలనీ, కేంద్రం విధించే పన్నులలో రాష్ట్రాల వాటాకు సంబంధించి ఏవైనా మార్పులు అవసరమైతే సూచించాలనీ సంఘాన్ని కోరారు. ఒకానొక పరిమితిని మించి రాష్ట్రాలు విధించే అమ్మకం పన్నుల దృష్ట్యా కేంద్ర సుంకాల ద్వారా లభించే ఆదాయాలలో రాష్ట్రాలకు ఇవ్వ వలసిన వాటా సర్దుబాట్లను గురించి ఆర్థికసంఘం సిఫార్సు చేయవలసి ఉంటుంది.

రాజ్యాంగంలోని 280 నిబంధన ప్రకారం ఆర్థిక సంఘాన్ని నియమిస్తూ రాష్ట్రపతి జారీచేసిన ఉత్తర్వును ఆర్థిక మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి నేడు పార్లమెంటు ఉభయ సభలలోనూ సమర్పించారు.

1966-67 సంవత్సరానికి బడ్జెట్ను తయారు చేయడానికి కొంత వ్యవధి ముందుగా సంఘం నివేదికను సమర్పిస్తుంది.

ఆర్థికసంఘం సభ్యుల పేర్లివి:

1. ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి శ్రీ మోహన్‌లాల్ గౌతమ 2. రిజర్వు బ్యాంకు మాజీ డిప్యూటీ గవర్నర్ శ్రీ డి. జి. కార్వే 3. పశ్చిమ బెంగాల్ విద్యాశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ భాభతోష్ దత్తా 4. ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ పి.సి. మాథూ

ఆర్థిక సంఘాలు మామూలుగా పరిశీలించే రెండు అంశాలు ఇవి:

1. పన్నుల రూపేణా లభించే నికరాదాయంలో కేంద్ర, రాష్ట్రాల వాటాల నిర్ణయం.
2. కేంద్రం రాష్ట్రాలకు సహాయంగా ఇచ్చే మొత్తాల నిర్ణయం.

రాష్ట్రపతి అదనంగా పరిశీలించమని కోరిన ఐదు అంశాలివి:

1. అవసరంలో ఉన్న రాష్ట్రాలకు రాజ్యాంగంలోని 275 సూత్రం ప్రకారం ఇచ్చే సహాయాన్ని నిర్ణయించడం. ఇలా నిర్ణయంగైకొనడంలో ఆర్థిక సంఘం కొన్ని విషయాలను దృష్టిలో పెట్టుకొనవలసి ఉంటుంది. నాలుగవ ప్రణాళికలో రాష్ట్రాల ఆదాయాన్ని, తదితర అంశాలను కమిషన్ దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు గైకొంటుంది
2. ఎస్టేట్ డ్యూటీ ద్వారా లభించే ఆదాయంలో రాష్ట్రాలకు ఎంతెంత ఇవ్వాలనే విషయాన్ని నిర్ణయించవలసి ఉంటుంది
3. రైలుచార్జీలపై విధించిఉండే పన్నులకు మారుగా రాష్ట్రాలకు చెందవలసిన గ్రాంట్లను నిర్ణయించడం
4. వస్త్రాలు, చక్కెర, పొగాకుపై రాష్ట్రాల అమ్మకం పన్నుకు మారుగా విధించిన అదనపు సుంకాలద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాలకు పంచడంలో మార్పులు
5. వనరుల లేక వస్తువుల ఉత్పత్తి వినియోగం ఎగుమతులపై రాష్ట్రాలు విధించే అమ్మకంపన్ను, కేంద్రం విధించే సుంకాల ప్రభావం పరిశీలన.

1966-67 నుండి 1970-71 వరకు అంటే నాలుగవ పంచవర్ష ప్రణాళికా కాలంలో అనుసరించదగిన విధానాన్ని ఆర్థికసంఘం సూచిస్తుంది.

370 నిబంధనను రద్దు చెయ్యాలని ఆచార్య ఘోష్ ఉద్ఘాటన

తెనాలి, మే 5 (పి. టి. ఐ.)

కాశ్మీర్ ను భారతదేశంలో పూర్తిగా లీనం చేయాలని తన పార్టీ కోరుతున్న కోరికను జనసంఘ్ అధ్యక్షులు ఆచార్య దేవ ప్రసాద్ ఘోష్ ఇక్కడ పునరుద్ఘాటించారు.

జనసంఘ్ స్థానికశాఖ ఆధ్వర్యాన మొన్న ఇక్కడ జరిగిన సభలో శ్రీ ఘోష్ ప్రసంగిస్తూ కాశ్మీర్ వ్యవహారంలో కొత్తగా ఎదురవుతున్న చిక్కులు, సమస్యలను ప్రస్తావించి కాశ్మీర్ కు ప్రత్యేక అర్హతల కల్పించే 370 నిబంధనను భారతరాజ్యాంగంనుండి వెంటనే తొలగించి కాశ్మీర్ ను భారత దేశంలో విలీనం చేయాలని జనసంఘ్ కోరుతున్నదన్నారు. జనసంఘ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు శ్రీ జూపూడి యజ్ఞనారాయణ సభకు అధ్యక్షత వహించారు. రాష్ట్ర శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ టి. రామాచార్యులు, ఆచార్యదేవ ప్రసాద్ ఘోష్‌కు స్వాగతం చెప్పారు.

శ్రీ హిమవంతరావు వందనసమర్పణ చేసారు.

శ్రీ ఘోష్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ గోపాలరావు ఠాకూర్, డివిజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీ కొల్లిపర్ల వెంకటేశ్వర్లులతో కలిసి నెల్లూరు నుండి ఇక్కడకు రాగా తెనాలి రైల్వే స్టేషన్‌లో స్థానిక జనసంఘ్ ప్రముఖులు ఘనస్వాగతమిచ్చారు.

ఉమ్మడిజాబితాలో విద్యారంగం చేర్చాలని అభ్యర్థన

న్యూఢిల్లీ, మే 5

భారత రాజ్యాంగంలో 7వ షెడ్యూలులో ఉమ్మడి జాబితాలో విద్యారంగాన్ని చేర్చే విషయమై చాలా రాష్ట్రాలు అభిప్రాయాలు తెలియజేశాయని కేంద్ర విద్యాశాఖ ఉపమంత్రి, శ్రీ భక్తదర్శన్ నేడు రాజ్యసభలో శ్రీ సీతారాం జయపురియా అడిగినప్రశ్నకు సమాధానంచెప్పారు. ఉన్నత విద్యకు సంబంధించి రాజ్యాంగంలో గల నిబంధనలను పరిశీలించేందుకు కేంద్రవిద్యా మంత్రిత్వశాఖ నియమించిన పార్లమెంటు సభ్యుల సంఘం జారీచేసిన ప్రశ్నావళికి సమాధానంగా యీ లేఖలు వచ్చాయనీ, యీ సమాధానాలు యిప్పుడు పరిశీలించ బడుతున్నాయనీ కూడా ఆయన తెలియజేశారు.



రాష్ట్ర గవర్నర్ గా శ్రీ పట్టం థానుపిళ్లైచేత రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. చంద్రారెడ్డి ప్రమాణస్వీకారం చేయించినప్పటి దృశ్యం

కాశ్మీర్ సమస్యాపరిష్కారమార్గంపై రాజాజీ, అబ్దుల్లా ఏకాభిప్రాయం

మద్రాస్, మే 5 (పి. టి. ఐ.)

కాశ్మీర్ వివాద పరిష్కారానికి అనుసరించవలసిన మార్గంపై తనకు, శ్రీ రాజగోపాలాచారికి మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్టు షేక్ అబ్దుల్లా నేడు ఇక్కడ తెలిపారు.

అయితే ఆ మార్గమేమిటో వెల్లడించడానికి మాత్రం ఆయన నిరాకరించారు. దానిపై ప్రధానితో చర్చించకముందు వెల్లడించడంఅనుచితంకాగలదనిఆయన అన్నారు

భారత, పాకిస్తాన్‌లలో ఏదేశానికి విజయం సాధించామనే భావం కలగకుండాను, అదే సమయంలో కాశ్మీర్ ప్రజలకు గౌరవం చేకూర్చేదిగానూ, గౌరవ ప్రతిష్ఠలకు అనుగుణంగానూ ఈ మార్గం ఉండగలదని తాను అభిప్రాయపడుతున్నట్లు ఆయన తెలిపారు.

"కల్కి గార్డెన్స్" వద్ద శ్రీ రాజగోపాలాచారితో షేక్ అబ్దుల్లా నేటి ఉదయం 200 నిమిషాల సేపు చర్చలు జరిపారు. అబ్దుల్లాకు సన్నిహితుడైన మీర్జాఅఫ్జల్ బేగ్ కూడా ఈ చర్చలలో పాల్గొన్నారు.

ఈ సమావేశం పూర్తి అయిన అనంతరం పత్రికా విలేకరులకు షేక్ అబ్దుల్లా ఒక ప్రకటన చదివి వినిపించారు.

"పరస్పరం కుశల ప్రశ్నలు" వేసుకున్న అనంతరం రాజాజీతో ఎట్టి దాపరికం లేకుండా తాను చర్చలు జరిపాననీ, తమతో ఆయన పూర్తిగా అంగీకరించారనీ అబ్దుల్లా అన్నారు.

తాను ఢిల్లీ వెళుతున్నాననీ, ప్రధానితోటి, ఇతర నాయకులతోటి చర్చలు జరుపుతాననీ ఆయన అన్నారు. భారత, పాకిస్తాన్‌లు మిత్రదేశాలుగా ఉండని పక్షంలో ఇరు దేశాలూ నాశనమవుతాయనీ, అదే జరిగితే కాశ్మీర్ తనకు తాను రక్షించుకోజాలదనీ షేక్ అబ్దుల్లా అన్నారు.

"వినోబాతో చర్చలు ఫలప్రదం"

నాగపూర్ నుండి నేటి ఉదయం షేక్ అబ్దుల్లా ఇక్కడకు వచ్చారు. విమానాశ్రయం వద్ద పత్రికా విలేకరులతో ప్రసంగిస్తూ, కాశ్మీర్ సమస్యపరిష్కారానికి ఏ మార్గాన్ని రూపొందించినా భారత, పాకిస్తాన్, కాశ్మీర్ లకు ఆమోదయోగ్యంగా ఉండాలని ఆయన అన్నారు. వివాదంలో పాకిస్తాన్ కూడా ఒక పార్టీ అయినందువల్ల దానిని విస్మరించరాదని ఆయన అన్నారు. వినోబాతో తాను జరిపిన చర్చలు "ఫలప్రద"మయాయని ఆయన అన్నారు.

శ్రీ రాజగోపాలాచారితో చర్చలు జరపనున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆయన తండ్రివంటి వాడనీ, ఆయన సలహా తీసుకోవడానికి వెళుతున్నాననీ అబ్దుల్లా అన్నారు.

భారత, పాకిస్తాన్‌ల మధ్య సామరస్యాన్ని సాధించడానికి అనుసరించవలసిన మార్గాలను అన్వేషించడమే తమ ప్రధాన కర్తవ్యమని ఆయన అన్నారు.

భారతదేశంలో కాశ్మీర్ ను విలీనం చేయడంవల్ల పరిస్థితిని పాకిస్తాన్ [illegible] కల్పించినదనాట నిజంకాదా అని ఒక విలేకరి ప్రశ్నించారు. "ప్రతి ఒక్కరూ తప్పులు చేశారు. ఆ తప్పు పాకిస్తాన్ చేయకుండా ఉన్నట్టుంటే బహుశా పరిస్థితి మరోక విధంగా ఉండేది."

మతాతీతమైన విధానానుసరణ అనే ఆదర్శం ప్రాతిపదికపై కాశ్మీర్ లో ఒక ఉద్యమం ఆవిర్భవించినదనీ, భారత్ కాశ్మీర్ విలీనీకరణకు అది కూడా కొంతవరకూ కారణమని ఆయన అన్నారు.

ఆమోద యోగ్యమైన విధంగా కాశ్మీర్ సమస్యను పరిష్కరించుకోవడానికి ప్లెబిసైట్ తోడ్పడగలదా అని ప్రశ్నించగా ఆయన ఇలా సమాధానమిచ్చారు: "నా ఆలోచనా రీతి ప్లెబిసైట్ తోనే ఆగిపోదు. కాశ్మీర్ ప్రజల అభిమతానికీ, భారత-పాకిస్తాన్‌ల మధ్య సామరస్య సాధనకూ అనుగుణంగా ఉండే ఏ మార్గాన్ని అనుసరించినా నాకు ఇష్టమే."

మతానికి అతీతంగా ఉండే ఆదర్శాన్ని మీరు పూర్తిగా సమర్థించారా అని ప్రశ్నించగా, కాశ్మీర్ లో శాంతియుత పరిస్థితి కొనసాగడానికి అంతకంటె మరోమార్గం లేదని ఆయన సమాధానమిచ్చారు

పాకిస్తాన్ వెళ్ళే అవకాశం ఉన్నదా అని ప్రశ్నించగా, తాను ఖచ్చితంగా చెప్పజాలననీ, నిర్దిష్టమైన సంకల్పం ఏదీ లేదనీ, తాను ముందుగా ఒక స్పష్టమైన నిర్ణయానికి రావాలని ఆయన సమాధానమిచ్చారు.

కాశ్మీర్ కు ఆర్థిక సహాయం అందజేయడం ఇండియా ఔదార్యమేనని ఆయన ఒప్పుకున్నప్పటికీ, దానిని ఉపయోగించే రీతిపట్ల ఆయన విమర్శించారు.

భవిష్యత్తులో ఏమిచేయాలని భావిస్తున్నారని ప్రశ్నించగా ఆయన ఇలా సమాధానమిచ్చారు: "కాశ్మీర్ రాజకీయాలలో ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తున్నాను. పాలనారంగంగురించిమీరు అడిగి ఉన్నట్టయితే దానిలో తిరిగి ప్రవేశించాలనే వాంఛ లేదు. ఆ కోర్కె ఏనాడో తీరిపోయింది".

కాశ్మీర్ కు వినోబాభావేను ఆహ్వానించాననీ, కానీ ఆయన రావడానికి ఆరునెలలు పట్టవచ్చుననీ అబ్దుల్లా అన్నారు.

ప్రధానితో మళ్ళీ చర్చలు జరుపుతారా అని ప్రశ్నించగా "ఎందుకు జరపకూడదు? నేను ఆయన అతిథిని" అని షేక్ అబ్దుల్లా సమాధానమిచ్చారు.

జనసంఘం వలంటీర్ల నిరసన ప్రదర్శన

తనకు ఆతిథ్యమిస్తున్న శ్రీ టి. సదాశివంతో పాటు విమానాశ్రయం నుండి అబ్దుల్లా బయటకు రాగానే సుమారు 50 మంది జనసంఘం వలంటీర్లు ప్రదర్శన [illegible] "370 ఆర్టికల్ ను రద్దు చేయాలి" అని వారు నినాదాలు చేసారు.

విమానాశ్రయంవద్ద పోలీస్ బందోబస్తు బాగా ఏర్పాటు చేసారు.

జయప్రకాశ్ కు హాని కలగకుండా రక్షణ: హోంమంత్రి హామీ

న్యూఢిల్లీ, మే 5 (పి. టి. ఐ)

శ్రీ జయప్రకాశనారాయణ్ కు హాని కలుగుతుందని ప్రభుత్వానికి తెలిసినా లేక శ్రీ నారాయణ్ అలా భావించినా ఆయనను రక్షించడానికి ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తుందని హోంమంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా నేడు రాజ్యసభలో ప్రకటించారు.

తనకు హానికలుగుతుందని శ్రీ జయప్రకాశనారాయణ్ అనుకోలేదని శ్రీ నందా అన్నారు.

నెహ్రూకు ఆచార్య భావే సలహా

వార్ధా, మే 5

షేక్ అబ్దుల్లా ద్వారా ప్రధాని నెహ్రూకు పంపిన ఒక సందేశంలో ఆచార్య వినోబాభావే శ్రీ నెహ్రూను ఎక్కువ విశ్రాంతి తీసుకోవాలని, ఎండకు దూరంగా ఉండాలని సలహా ఇచ్చారు,

నెహ్రూగారికి ఏమైనా సందేశం పంపుతారా అని తమ సమావేశం ముగిసిన తర్వాత షేక్ అబ్దుల్లా ప్రశ్నించగా ఆచార్యభావే పైవిధంగా అన్నారు. "నేను మీతో చెప్పిన విషయాలన్నీ ఆయనకు చెప్పండి. ఎక్కువ విశ్రాంతి తీసుకోవాలని ఎండనుండి దూరంగా ఉండాలని చెప్పండి,

సోమాలియాలో భారత ముస్లిం ప్రతినిధివర్గం

న్యూఢిల్లీ, మే 4

ఆఫ్రికా, పశ్చిమాసియాలలో కర్నల్ బి. హెచ్. జైదీ నాయకత్వాన పర్యటిస్తున్న భారత ముస్లిం ప్రతినిధివర్గానికి సోమాలియా ప్రజలు హార్దిక స్వాగతమిచ్చారు. ఈ ప్రతినిధి వర్గసభ్యులు సోమాలియా రాజధాని. మొగదిష్యోకు ఏప్రిల్ 27వ తేదీన వచ్చారు. వీరు సోమాలీ రిపబ్లిక్ అధ్యక్షులు, శ్రీ అబ్దుల్ రషీద్ ఉస్మాన్‌నూ, ప్రధాన మంత్రి శ్రీ అబ్దుల్ రషీద్ అలీ షర్మార్కేనూ, విదేశాంగమంత్రి, శ్రీ అబ్దుల్లాహీఇస్సా మహమ్మద్‌నూ, యితర కేబినెట్ మంత్రులూ, సర్వసేనాని జనరల్ దౌదీనూ కలుసుకున్నారు.

మహేంద్రరాజు ఖాట్మండు ప్రయాణం

వాల్మీకినగర్ మే 5 (పి. టి. ఐ)

మహేంద్రరాజు నేటి ఉదయం ఖాట్మండుకు బైల్దేరి వెళ్లారు. గండక్ బరాజ్ శంకుస్థాపన ఉత్సవంలో పాల్గొనడానికి గాను మహేంద్ర ఇక్కడికి వచ్చారు.

భారత ప్రధాని నెహ్రూ బీహార్ గవర్నర్ శ్రీ అనంతశయనం అయ్యంగారు, ముఖ్యమంత్రి శ్రీ సహాయ్ శ్రీమతి ఇందిరా గాంధీ తదితరులు రాజుకు వీడ్కోలు చెప్పారు.

ప్రధాని నెహ్రూ ప్రభృతులుకూడా నేటి ఉదయం ఇక్కడి నుండి ఢిల్లీకి బైల్దేరి వెళ్లారు.

ప్రధాని నెహ్రూ ఢిల్లీకి తిరిగి రాక

న్యూఢిల్లీ, మే 5 (పి.టి ఐ.)

ప్రధాని నెహ్రూ భైసాలోటాన్ నుండి నేడు ఢిల్లీకి తిరిగి వచ్చారు.

అవసరమైతే గరిష్ఠ ధరల నిర్ణయం

ఆహార ధాన్యాల పరిస్థితిని ప్రభుత్వం జాగ్రతగా గమనిస్తున్నదని స్వరణ్ సింగ్ ప్రకటన

న్యూఢిల్లీ, మే 5 (పి టి ఐ)

ధాన్యం ధరల పరిస్థితిని ప్రభుత్వం జాగ్రత్తతో గమనిస్తున్నట్టు లోక్ సభలో ఆహార వ్యవసాయ శాఖల మంత్రి శ్రీ స్వరణ్ సింగ్ నేడు వెల్లడించారు. అవసరమైతే గరిష్ఠ ధరలు విధించడానికి వెనుకాడడముండదన్నారాయన

ఆయన శ్రీ హెచ్. సి మథూర్ అడిగిన ప్రశ్నకు తెలిపిన జవాబులో ఈ విషయాలను పేర్కొన్నారు. కొన్ని రాష్ట్రాలలో కంట్రోల్లు విధించినప్పటికి కొత్త పంటలు వచ్చిన కారణాన అక్కడ ధాన్యం ధరలు ఇటీవల పడిపోయినవా అని, ఆహార వస్తువుల లైసెన్సుల ఉత్తర్వు అనుకూలమైన ఫలితాలనిచ్చిందా అని శ్రీ మథూర్ సభలో ప్రశ్నించారు.

కొత్త లైసెన్సుల ఉత్తర్వు దృష్ట్యా వాణిజ్య రంగంలో ప్రతికూల వాతావరణ మేర్పడగలదని ఊహించినదేనని కేంద్ర మంత్రి శ్రీ స్వరణ్ సింగ్ తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషి ఫలితంగా కేంద్ర ప్రభుత్వం వాణిజ్య ప్రతినిధుల మధ్య జరిగిన సంప్రతింపుల దృష్ట్యా వృత్తిరీత్యా తాము ఒక రకమైన క్రమశిక్షణతో వ్యవహరించాలన్న విషయాన్ని వర్తకులు ఇప్పుడు గుర్తించారన్నారాయన.

వర్తక ప్రతినిధులు నేడు తమను మరో సారి కలుసుకొన్నారని, ఉత్పత్తిదారుడు, వినియోగదారుల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని కొన్ని క్రమ [illegible] వారు పూర్తిగా గుర్తించినట్టు మంత్రి శ్రీ స్వరణ్ సింగ్ పేర్కొన్నారు. ప్రభుత్వం అమలుపరచ సంకల్పించిన చర్యలకు వారు సహకరించగలరని విశ్వసిస్తున్నామన్నారాయన.

శ్రీ ఎస్. యం. బెనర్జీ రాజస్థాన్‌లో మినహా మిగతా చోట్ల ధాన్యం ధరలు పెరిగిన మాట వాస్తవమేనా అని అడిగిన ప్రశ్నకు శ్రీ స్వరణ్ సింగ్ లేదనిజవాబు చెబుతూ గోధుమ ధరలు తగ్గినట్టు ప్రభుత్వానికి తెలియ వచ్చిందన్నారు ధరల పెరుగుదలను నిరోధించడానికై రవాణాను అదుపు చేయుట, లైసెన్సు ఉత్తర్వు అమలు మొదలైన అంశాలను ప్రభుత్వం అమలు పరచిందని ఆయన వివరించారు.

ప్రభుత్వం క్రమబద్ధమైన చర్యలను తీసుకొన సంకల్పించిన కారణాన కలకత్తాలోని మిల్లుల యజమానులు తమ మిల్లులను మూసివేయడం జరిగిందా అని శ్రీ ఇంద్రజిత్ గుప్త ప్రశ్నించగా, ఈ సందర్భంలో ప్రభుత్వానికి సమాచారం అందలేదని అయితే దీనిని గురించి దర్యాప్తు జరుగగలదని కేంద్ర ఆహార మంత్రి తెలిపారు.

'పార్టీ విచ్ఛిన్నానికి చైనాయే కారణం'

తమిళనాడ్ కమ్యూనిస్ట్ నాయకుని విమర్శ

మదురై, మే 5 (పి. టి. ఐ.)

కమ్యూనిస్టుపార్టీ నుండి విడిపడి ప్రత్యేక పార్టీని ఏర్పాటు చేయడానికి శ్రీ పి. రామమూర్తి ఆయన సహచరులూ త్వరితగతిన యత్నాలు కొనసాగిస్తుండడంచూస్తే పెకింగ్, బెజిల్, సింహళం, ఆస్ట్రేలియాలలోను ఇటువంటి వైఖరి కలవారు చేస్తున్న యత్నాలవలెనే ఉన్నాయని జాతీయ సమితి సభ్యుడు శ్రీ కుమారమంగళం నిన్న అన్నారు.

[illegible] పార్టీ నుండి చీలిపోయి వ్యవచ్ఛిన్నమైన విప్లవకారులు ప్రత్యేక పార్టీలను ఏర్పాటు చేయవలసిందిగా చైనా, ఇండొనీషియా కమ్యూనిస్టుపార్టీలు విజ్ఞప్తి చేసిన అనంతరమే ప్రపంచమంతటా ఈ "పద్ధతి" తలెత్తినదని పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ఆయన అన్నారు.

సమష్టి వైఖరికి అనుగుణంగానే ఆయన వర్తిస్తున్నట్టు దీనివల్ల ఎవరైనా నిర్ణయించుకోవచ్చునని ఆయన అన్నారు.

శ్రీ రామమూర్తి, ఆయన సహచరులూ ఈ పద్ధతిని ఏవిధంగా అనుసరిస్తున్నదీ గత కొన్ని నెలలుగా వారు గైకొన్న చర్యలను పరిశీలిస్తే స్పష్టమవుతుందని శ్రీ కుమారమంగళం అన్నారు.

ఇటీవల ఢిల్లీలో జరిగినపార్టీ సమావేశంలో వారు ప్రవర్తించిన తీరు చూస్తే, ప్రత్యేక పార్టీని ఏర్పాటు చేయాలని జాతీయసమితి సమావేశానికి పూర్వమే వారు నిర్ణయించుకొన్నట్టు తేటతెల్లమవుతున్నదని ఆయనఅన్నారు

తన విధానాన్ని వైఖరిని అధిక మెజారిటీతో జాతీయ సమితి త్రోసిపుచ్చినప్పుడు "పార్టీ సభ్యులలో మాకింకా మెజారిటీ ఉన్నదని" శ్రీ రామమూర్తి చెప్పుకొన్నందువల్ల ప్రయోజనంలేదని ఆయన అన్నారు.

తమిళనాడులోని జిల్లా సమితులలో ఎక్కువ భాగం తమనే సమర్థిస్తున్నవని శ్రీ రామమూర్తి వాదించినప్పటికీ, మదురై జిల్లా సమితితప్ప వారిని సమర్థించిన జిల్లాసమితిఏదీలేకపోగా జాతీయ సమితినే సమర్థించాయని శ్రీ కుమారమంగళం అన్నారు.

కువైట్ సేనాధిపతి పర్యటన కార్యక్రమం

హైదరాబాద్, మే 5

కువైట్ సేనాధిపతి పర్యటన కార్యక్రమంలో మార్పులు చేయబడినాయి. మార్పు చేయబడిన కార్యక్రమంప్రకారం. కువైట్ సేనాధిపతి, మే 8 శుక్రవారం సాయంత్రం 6-45 గంటలకు విమానంలో ఇండోర్ నుంచి సికింద్రాబాద్ చేరుకుంటారు మే 9 శనివారంనాడు ఆయన ఇ. ఎం. ఇ. పాఠశాలనూ, భారత వైమానికదళ స్థావరాలనూ దర్శిస్తారు. మే 10, ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆయన సికిందరాబాద్ నుంచి విమానంలో కోయంబత్తూరు వెళ్ళుతారు.

కేంద్ర ప్రభుత్వోద్యోగుల కరువుభత్యం హెచ్చింపుపై పదిరోజులలో ప్రకటన

న్యూఢిల్లీ, మే 4

కేంద్ర ప్రభుత్వోద్యోగుల కరువు భత్యం హెచ్చింపును గురించి వారం రోజులలో ప్రకటిస్తారని ఆర్థికమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి నేడు లోక్ సభలో వెల్లడించారు.

కరువుభత్యం కొత్తరేట్లు 1964 ఫిబ్రవరి ఒకటవ తేదీనుండి అమలులోకి రాగలవని ఆయన తెలిపారు.

జీవనవ్యయం పెరుగుదలకు పూర్తి పరిహారం లభించే విధంగా కరువు భత్యాన్ని హెచ్చించడం, ప్రభుత్వానికి అధికవ్యయం కాగలదనే కారణంగా ఆయన త్రోసిపుచ్చారు.

ఉద్యోగులకు ఏమేరకు అదనపు సహాయం లభించగలదో ఆయన సూచించలేదు. కాని అదనపు సహాయం ఎంత ఉండాలనే విషయమై పరిశీలన జరుగుతున్నదని చెప్పారు

వేయి రూపాయలలోపు జీతం లభించే ఉద్యోగులందరికి జీవనవ్యయం పెరుగుదలకు అనుగుణంగా కరువుభత్యం హెచ్చించాలని కొందరుసభ్యులు చేసిన శతకు ప్రస్తావించి, ఈ సందర్భంలో పరిమితిని నిర్వచించడం సాధ్యంకాగలదా అని పరిశీలిస్తున్నామని చెప్పారు.

జీవనవ్యయం పెరుగుదలకు పూర్తి అనుగుణంగా ఉండేటట్లు కరువుభత్యం హెచ్చించాలని రెండవవేతన నిర్ణాయక సంఘం సిఫార్సులలో కూడా లేదని ఆర్థికమంత్రి అన్నారు.

పెన్షనర్ల విషయం ప్రస్తావించి, ఇదివరకే వీరికి ప్రభుత్వంకొంత సహాయం చేసినదని అయితే ఆ సహాయం చాలదని తన వ్యక్తిగత అభిప్రాయమని అన్నారు. విస్వంకేహంగా తక్కువ ఆదాయంఉన్న ఒకవర్గంవారికి సహాయం చేయకపోవడం అన్నది వారిపట్ల శ్రద్ధ కొరవడడం కారణంకాదు. తగినంత ధనం ఎలా సమకూర్చుకోవడమన్నది ప్రధాన సమస్య. పెన్షనర్ల విషయంలో ఎట్టి వాగ్దానం ఇవ్వలేను కాని వారి సమస్యలను తప్పకుండా దృష్టిలో ఉంచుకొంటాను అని శ్రీ కృష్ణమాచారి చెప్పారు.

జీవన వ్యయం పెరుగుదలకు పూర్తిగా అనుగుణంగా ఉండేటట్టు

(మిగతా 6వ పేజీలో)

జనసంఘం, స్వతంత్ర పార్టీల ఎన్నికలపొత్తు

శ్రీ దేవప్రసాద్ ఘోష్ ప్రకటన

హైదరాబాద్, మే 5

జనసంఘం, స్వతంత్ర పార్టీల మధ్య ఒక విధమైన ఎన్నికల ఒప్పందం కుదిరిందని, అఖిలభారత జనసంఘం అధ్యక్షులు శ్రీ దేవప్రసాద్ ఘోష్ నేడిక్కడ చెప్పారు. ఈ రెండు పార్టీల కార్యదర్శులు - శ్రీ ఎం.ఆర్. మసాని శ్రీ ఉపాధ్యాయ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన ఒక కార్యక్రమాన్ని ఇటీవల రూపొందించారని కూడా ఆయన చెప్పారు.

ఆర్థికరంగంలో స్వతంత్ర పార్టీతో తమ పార్టీ అంగీకరించిందనీ, పత్రికా గోష్ఠిలో ప్రసంగిస్తూ శ్రీ ఘోష్ చెప్పారు.

హిందూ మహాసభతో తమ పార్టీ "చాలా స్నేహపూర్వకం"గా ఉంటోందని, ఆ రెండు పార్టీలు అనేక విషయాలను అంగీకరించాయని. ఆయన అన్నారు. పి. ఎస్. పి లోహియా సోషలిస్టుపార్టీలకు సంబంధించినంతవరకు, లోహియా సోషలిస్టులతోనే తమకు ఎక్కువ సంబంధాలు కలవని, లోహియా ఎన్నికలలో తమ పార్టీ ప్రముఖమైన పాత్రను నిర్వహించిందని ఆయన అన్నారు

కమ్యూనిస్టుపార్టీతో తనపార్టీ ఎట్టి సంబంధాలను పెట్టుకునే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఆకాశవాణి ఉద్యోగికి శిక్ష

న్యూఢిల్లీ మే 5

ఢిల్లీలో ఆకాశవాణి కార్యాలయంలో 2వ గ్రేడ్ గుమాస్తా, తాను యిదివరకు కొన్ని నేరాలకు శిక్షించబడినాడన్న విషయాన్ని దాచిపెట్టినందుకు గాను దఫ్తరీఉద్యోగానికి దించేశారు.

విద్యుద్ఘాతంవల్ల బాలిక మరణం

(ఆంధ్రభూమి ప్రతినిధి)

హైదరాబాద్, మే 5

తొమ్మిది సంవత్సరాల వయస్సుగల ఒక బాలిక నిన్నటిదినం బోయిన్‌పల్లిలో విద్యుచ్ఛక్తి ప్రసరిస్తున్న తీగెను తాకినందువల్ల మరణించింది.

బోయిన్‌పల్లిలో మిలిటరి పాల కేంద్రంలో సూపర్‌వైజరుగా పనిచేస్తున్న శ్రీ సుదర్శన్ యొక్క పిల్లలతో ఆడుకొంటున్న ఒక బాలిక వేలిపైన వరి ఉన్న ఎలెక్ట్రిక్ పోల్ తీగెను ప్రమాదవశాత్తు తాకింది శ్రీ సింగ్ భార్య ఆ బాలికను రక్షించాలనే కోరికతో ఆమెను పట్టుకుంది. ఆమెకు కూడా షాక్ తగిలింది

బాలికను వెంటనే హాస్పిటల్ కు పంపారని, ఆమె అక్కడ మరణించిందని పోలీసువర్గాలవల్ల తెలుస్తోంది.

పంచాంగం

బుధవారం

6 5-1964

శ్రీ క్రోధి సంవత్సర నిజవైశాఖ బహుళ నవమి పగలు 4-29 వరకు ధనిష్ఠ ఉదయం 9-15 వరకు వర్జ్యం పగలు 4-38 మొదలు 6-10 వరకు నవమి తిథి

వ్యాపారస్తులకు:- వెండిబంగారాలు మార్పులుండవు పత్తి,నూలు మంది మా వెదినుసులు నిలకడగా ఉండవు కంపెనీ వాటాలు పెరుగును

రైతులకు - చెట్లునాటుటకు. పశువృద్ధికి అనుకూలము

మంచిచెడ్డలు:- వివాదపరిష్కారానికీ నాటకకళలకు. దైనందిన వృత్తి వ్యాపారాలకు యంత్రములు వాహనములు కొనటకు, అనుకూలము ప్రయాణాలకు. పెట్టుబడులకు మంచిది కాదు.

అదృష్టసంఖ్యలు: 5—8—1.

ఆంధ్రభూమి

బుధవారం, 6 మే 1964

కరువుభత్యం హెచ్చింపు: అధిక ధరల సమస్య

కేంద్ర ప్రభుత్వోద్యోగుల కరువుభత్యాన్ని పెంచడానికి శ్రీ టి. టి. కె. నిశ్చయించారంటే, తప్పనిసరి పరిస్థితి వచ్చింది కనుక అంగీకరించారు. జీవితావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయనేది అందరూ అనుభవ పూర్వకంగా తెలుసుకుంటున్నదే. పార్లమెంటు సభ్యులే తమ వేతనాలను పెంచుకోవడం అవసరమని భావించాక, ఏదో కొంత ఆర్థిక సహాయాన్ని సిబ్బందికి నిరాకరించడం నైతికంగా సాధ్యం కాదు. మొండిగా నిరాకరిస్తే సిబ్బందీ ఏమీ చెయ్యలేరుగాని, లోలోపల అసంతృప్తి పెంచుకుని అసలే అంతంతమాత్రంగా చేస్తున్న పనిని మరింతఅధ్వాన్నం చేస్తారు.

నెలకు వెయ్యిరూపాయిల వేతనం తెచ్చుకునే వారికి కూడా భత్యం పెంచడం అవసరమని టి. టి. కె. అంగీకరిస్తున్నప్పుడు, అప్రియ సత్యంగా చాలా సత్యాలు అంగీకరిస్తున్నారు. ధరలను అదుపులో పెట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. దానికోసం ఎన్ని చర్యలు తీసుకున్నా నిష్ప్రయోజన మయాయి. ప్రకటనలు హెచ్చరికలు ఎన్ని చేసినా రక్తి కట్టడం లేదు. వర్తకులు వినిపించుకోరు. ఎవరి దారి వారిది. అడ్డదారి అవలంబించి అక్రమ ధనార్జన చెయ్యడానికి కొందరదృష్టవంతులకు ఎన్నో అవకాశాలున్నప్పుడు, బ్లాక్ మార్కెటులో వేలకోట్ల రూపాయిలు తిరుగుతున్నప్పుడు ధరలు అరికట్టడం ఎవరి తరం? అందులో కాంగ్రెస్ ప్రభుత్వానికి బొత్తిగా అసాధ్యం.

రూపాయి కొనుగోలు శక్తి క్షీణిస్తున్నప్పుడు. నికరాదాయాల ఉద్యోగులకు ఎక్కువ రూపాయిలు ముట్టచెప్పడమే ప్రభుత్వానికి చేతనైన పని. క్రమంగా అధిక చెలామణీ పరాకాష్ఠకు వచ్చి జర్మనీలో వీమార్ రిపబ్లిక్ చివరి రోజుల స్థితీ, చైనాలో కొమింటాంగ్ చివరి రోజుల స్థితీ—యిక్కడ తటస్థపడినా మనం ఆశ్చర్యపడనక్కర లేదు.

కేంద్ర ప్రభుత్వ సిబ్బందీ జీతాలు పెరిగాక, రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందీ ఆందోళన చేస్తే నైతికంగాకాదనడానికి వీలులేదు. ఐతే డబ్బు లేక కాబట్టి వేతనాలు పెంచడం అసాధ్యమని కఠినంగా చెప్పవచ్చును. ఇలా పెంచుకుంటూ పోవడానికి అంతమెక్కడ?— అని ప్రశ్నించ వచ్చును. ఐతే—ఈ ధరల పెరుగుదలకు అంతెక్కడ? అదీఅసలుప్రశ్న. అధికారం ఉంది కనుక సిబ్బందీని గదమాయించినా బాధలనూ. అసంతృప్తినీ తీసివేయడం అసాధ్యం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ సిబ్బందీ సంగతి చూసుకోగానే సరికాదు ప్రయివేటు వర్తక, పారిశ్రామిక రంగాలలో స్వల్పాదాయ సిబ్బందీ సంగతేమిటి? వారిలో అసంతృప్తి చెలరేగుతుంది. ఉద్యమాలు బయలుదేరతాయి. ప్రభుత్వ సిబ్బందీకి దొరికినంత త్వరితంగా వారికి సహాయం లభించకపోయినా, చిట్టచివరకు వారి విషయంలో కూడా ప్రభుత్వం జోక్యం చేసుకోక తప్పదు.

'అధిక ధరలు' అనేది జాతీయ సమస్య. కేవలం ప్రభుత్వానికీ తమ సిబ్బందికీ సంబంధించిన స్వంత సమస్య కాదు.

లోతుగా ఆలోచిస్తే ప్రభుత్వం చేయగల్గుతున్నదేమిటి? ధనిక వర్తక వాణిజ్య వర్గాలను అదుపులో పెటలేక ధరలను స్థిరీకరించలేక. బ్లాక్ మార్కెటును అరికట్టలేక, ఉత్పత్తి పెంచలేక ద్రవ్య చలామణీని మాత్రం పెంచుతున్నది. ఈ పద్ధతిలో మన ఆర్థిక సమస్య పరిష్కారం కాదు; కాలేదు. వేతనాల వారికి అదనంగా యిచ్చిన తృణమోపణమో తిరిగి ధనిక వర్గాలవారికే చేరుకుంటుంది. సంపన్నులకూ తక్కిన అశేష ప్రజానీకానికీ మధ్య అగాధం యింకా ఎక్కువవుతుంది. సోషలిస్టు లక్ష్యానికి వ్యతిరేకమైన దిక్కులో ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం నడుపుతున్నది. పన్నెండేళ్లుగా అనుసరిస్తున్న ఆర్థికవిధానాల ఫలితమిది. సమస్యలను మూలంలో ఎదుర్కొంటే తప్ప యీ విషమచక్రపరిభ్రమణం నుండి ఆర్థిక వ్యవస్థ బైటపడలేదు. ఐతే మానసికంగా అలిసిపోయిన పాలక వర్గానికి కొత్త ఆలోచనలు వచ్చే అవకాశం లేదు.

కైరోలో నూతన రాయబారిగా ఎస్. ఎన్ హక్సర్ నియామకం

న్యూఢిల్లీ, మే 4

ప్రస్తుతం ఇటలీలో భారత రాయబారిగా వున్న శ్రీ సుందర్ నారాయన్ హక్సర్ ను, ఐక్యఅరబ్ రిపబ్లిక్ లో భారత రాయబారిగా నియమించబడినట్లు విదేశాంగ మంత్రిత్వశాఖ ఒక పత్రికా ప్రకటన చేసింది. ఈయన జులై నెలలో నూతన బాధ్యతలను స్వీకరించగలరని భావిస్తున్నారు.

నందాతో బక్షీ సమావేశం

న్యూఢిల్లీ, మే 5

కాశ్మీర్ మాజీ ప్రధాని బక్షీగులామ్ మహ్మద్ నిన్న సాయంకాలం ఇక్కడ కేంద్ర హోంమంత్రి శ్రీ గుల్జారీలాల్ నందాతో సమావేశం జరిపారు.

షేక్ అబ్దుల్లా విడుదల, తదనంతరం ఆయన ప్రసంగాలవల్ల ఏర్పడిన పరిస్థితిని ఆయన హోంమంత్రికి వివరించారని తెలుస్తున్నది.

మొన్న ఇక్కడికివచ్చిన బక్షీ ప్రధాని నెహ్రూతో మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రితో ఇదివరకే చర్చలు జరిపారు.

మాస్కోలోని 'టైమ్' వారపత్రిక ఆఫీసు మూసివేత

మాస్కో, మే 5

మాస్కోలోని "టైం" వారపత్రిక కార్యాలయాన్ని మూసివేయాలని సోవియట్ ప్రభుత్వం నేడు ఉత్తర్వుచేసినది. ఆ పత్రిక విలేకరి ఇజ్రాయెల్ షెంకర్ ను దేశం నుండి బహిష్కరించినది.

రాజకీయ పర్యావలోకనం

ప్రధాని నెహ్రూకు రాజకీయ వారసుడెవరు?

వారసత్వాలు లేని ప్రజాస్వామ్యంలో రాజకీయంలో అధికారం వున్న నెహ్రూ తర్వాత ఎవరు?-అనే ప్రశ్న తరచు వినవస్తూ వుంది. శ్రీమతి ఇందిరా గాంధీ అమెరికా పర్యటనలో యిదే ప్రశ్న వచ్చింది. ఇంతకుముందే శ్రీ జయప్రకాశ్ నారాయణ్ ఈ ప్రశ్న అనుచితమైనదని త్రోసిపుచ్చారు. ప్రధాని నెహ్రూ సైతం దీన్ని అర్థంలేని జిజ్ఞాసగా విమర్శించారు. అయినా అప్పుడప్పుడు పత్రికలు కాంగ్రెస్ వారు, విదేశీయులు ఈ ప్రశ్న వేస్తూనే వున్నారు. ఇదమిత్థమని తేల్చిచెప్పిన జోస్యం యిప్పటికీ లేదు! ఉండటానికి వీల్లేదుకూడా.

మన దేశంలో ఈ ప్రశ్న రావటానికి కొన్ని ప్రధాన కారణాలు వున్నయి. దేశంలో స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో పాల్గొని, ప్రజల అభిమానాన్ని చూరగొన్న పెద్ద నాయకులంతా స్వాతంత్ర్యానికి కొంచెం యించుమించుగా అటోయిటో సమయానికి రాలిపోయారు. గాంధీజీ, పటేల్ వంటివారు లేరు. మరి కొద్దిమంది ప్రతిపక్షాల్లో మిగిలిపోయారు. ఇక మిగిలింది అశేష అనన్య సామాన్య ప్రజాభిమాని నెహ్రూ గారే. ఎవరు ఏమనుకున్నా దేశంలో నెహ్రూకు గల ప్రజాభిమానం మరెవరికీ లేదు. ఆయన స్థాయిని అందుకోగల్గేవారెవరు?

రెండోది నెహ్రూగారున్న కీలక స్థానం ఆయన ప్రాధాన్యాన్ని యినుమడింప జేసింది. కాంగ్రెస్ అధినేతగా, ప్రధానిగా, ప్రణాళికా సంఘాధ్యక్షుడుగా, భారత్ సేవక్ సమాజ్ స్థాపకుడుగా, యింకా దేశ విదేశీ వ్యవహారాల పరిష్కర్తగా నెహ్రూ ఔన్నత్యం గొప్పది. అందువలన రాష్ట్ర కాంగ్రెస్ ముఠా తగాదాలనుండి అంతర్జాతీయ అపరిష్కృత సమస్యల వరకూ అందరూ నెహ్రూగారి వైపు చూడటం సర్వసాధారణమైంది. ఆయన చెప్పనిదే ఆమోద ముద్ర పడనిదే ఏ విషయమూ జరిగేటట్లు కనిపించలేదు. మంచికో చెడుకో నెహ్రూగారిపై వుండిన ఈ విశ్వాసం వలన, ఆయన అనంతరం ఎవరిపై వుండాలి అనే సందేహం తప్పనిసరైంది.

మూడు నెహ్రూ ప్రాథమికంగా ప్రజాస్వామికవాది. నియంత అయ్యే అవకాశాలు వున్నా వినియోగించుకోలేదు. కాని తన జీవిత కాలంలో అనుకున్న సోషలిస్టు సమాజ లక్ష్యాన్ని చేరుకోవాలనే తాపత్రయం బాగా కనిపిస్తున్నది. చేసే శాసనాలు తాను భావించిన వాటికి అడ్డు తగిలినప్పుడు వచ్చే చిరాకు, కోపం అందుకు నిదర్శనాలు. అయితే తన అభిప్రాయాలను పార్టీనేతలొప్పించి. పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రానుగుణంగానే వ్యవహరించటం విశేషం. తిరుగులేనిబలం పార్టీకి వుంటం వలనా పార్టీలో ఎదురులేని విశ్వాసం తనపై వుండడం వలనా పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి భిన్నంగా ఆలోచించాల్సిన అవసరం ఆయనకు తటస్థపడలేదు.

నాలుగు: నెహ్రూ కారణంగా రాజకీయాలు ఢిల్లీచుట్టూ కేంద్రీకరించబడ్డాయి. ఆయనొక్క పరిష్కర్త. ఢిల్లీ ఒక పరిష్కార కేంద్రం సమస్యల రణరంగం. దేశం ఫెడరల్ విధానంగావున్నా

ఎస్. శూలపాణి

రాష్ట్రాలకున్న స్వాతంత్ర్యం చాలా తక్కువ. కేంద్ర నిర్ణయాల్ని అంటే నెహ్రూ నిర్ణయాల్ని కేవలం అమలు పరచటమే రాష్ట్రాల కర్తవ్యంగా తయారైంది. నెహ్రూ అనంతరం రాష్ట్రాల అధికారాన్ని కేంద్రీకరించే వ్యక్తి కనిపించటం లేదు. అప్పుడు రాష్ట్రాలే రాజకీయ కేంద్రాలై బలంగల రాష్ట్రాలే రాష్ట్రాలు దేశాన్ని పాలించవా?- అనే సందేహం విజ్ఞులకు లేకపోలేదు.

ఇటీవల నెహ్రూగారి ఆరోగ్యం క్షీణించింది. భయాందోళనలకు దారితీసింది. భువనేశ్వర్ కాంగ్రెస్ మహాసభల్లో కాంగ్రెస్ సోషలిస్టు ప్రతినిధులకు బలం లేదని తేలింది. అంటే భయభక్తుల వలన అప్రియమైన విషయాల్ని కూడా కాంగ్రెస్ వారు నెహ్రూ పేరుతో స్వీకరిస్తున్నారు. అందుకు కూడా నెహ్రూ అనంతరం ఎవరు?- అనే ప్రశ్నకు బలం తీసింది.

చివరిది: పొరుగు దేశాల్లో వలె నెహ్రూ అనంతరం సైనిక శక్తులు విజృంభించి దేశాన్ని ఆక్రమించవచ్చనే నమ్మకం ఏమిటి? అందర్నీ కూడగట్టుకు రాగల నాయకుడు లేనప్పుడు యిదే గత్యంతరమా?

ఏదిఏమైనా నెహ్రూ తర్వాత ఎవరు అనే ప్రశ్న ప్రజాస్వామ్య మన తత్వాన్ని సూచించదు. ప్రజాస్వామ్యంలో నమ్మకం దృఢంగా లేకపోవటం సత్సంప్రదాయాలు ఇంకా అలవడకపోవటమే ఈ ధోరణికి కారణం. పైగా ప్రతి విషయానికీ ఒకే వ్యక్తిపై ఆధారపడే సంప్రదాయాన్ని యిక ముందైనా మానాలి. బహుశా నెహ్రూ అనంతరం ఈవిధానం క్రమేణా మారవచ్చును. రాష్ట్రాలు సాధ్యమైనంత వరకు స్వయం పాలన చేసుకుంటూ వుండగలవు. ఒక వ్యక్తిని అతీతుడుగా పరిగణించటం విపరీత అధికారాలు యివ్వటం ఆ వ్యక్తి ఎంత మంచివాడైనా ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

మన అధికార వికేంద్రీకరణ సూత్రాన్ని నెహ్రూ అనంతరం బాగా అమలుపరచే అవకాశం వుంది. ప్రజాస్వామ్యంలో అధికార ప్రజల్లోవుంటూ భవన నిర్మాణంలో పునాదివలె ప్రజలు సర్వాధికారులై వుండాలి. ఇప్పుడు ఢిల్లీ కొద్ది మోతాదుల్లో అప్పుడప్పుడూ విడుదల చేసినట్లుగాక, ఆపని క్రింది నుంచి జరుగుతుంది.

నెహ్రూ నేడు నిర్వహిస్తున్న బాధ్యతలన్నీ ఒకే వ్యక్తి తదనంతరం మోయలేకపోవచ్చు. అది విస్తృతపరచబడి కొంతమంది కలసి బాధ్యతలు పంచుకుంటారు. అప్పుడు పనికూడా శ్రద్ధగా చురుకుగా జరిగే అవకాశం వుంది.

ఆసియా, ఆఫ్రికాలో చాలాదేశాల్ని పోల్చి చూస్తే ప్రజాస్వామికంగా ఇండియా స్వేచ్ఛా వాయువుల్ని అనుభవిస్తున్నది. ఇప్పుడిప్పుడే ప్రజాస్వామిక సంప్రదాయాలకు అలవాటు పడుతున్నాం. చైతన్యవంతమైన ప్రజలున్నచోట మిలటరీ ప్రభుత్వం ఏర్పడటం కష్టం కనుక ప్రజాస్వామిక సంప్రదాయాలు ఉత్తమస్థాయిలో నెలకొల్పేటందుకు నెహ్రూ అనంతరం ఎవరు?-అనే ప్రశ్నకు ప్రాముఖ్యమివ్వకుండా స్వయంశక్తిపై ఆధారపడటం నేర్చుకుంటే మంచిది.

చతుర్థ ప్రణాళికలో యంత్రపరికరాల ఉత్పత్తి లక్ష్యాలు

న్యూఢిల్లీ, మే 5

చతుర్థ పంచవర్ష ప్రణాళికా కాలంలో యంత్ర పరికరాల తయారి నిమిత్తం ఏర్పాటైన నిర్వహణ బృందం నాల్గవ ప్రణాళిక మొత్తంమీద 372 కోట్ల విలువమేరకు యంత్రపరికరాలు అవసరమవుతాయని అంచనా వేసింది. ఇతర లోహ పరిశ్రమలలో ఉపయుక్తమయ్యే యంత్రాలు విడిభాగాలు 74 కోట్ల విలువమేరకు అవసరమవుతాయి. ఇటీవల ఇక్కడ జరిగిన యంత్ర పరికరాల తయారి పరిశ్రమాభివృద్ధి సంఘ సమావేశంలో పై విషయాలు వెల్లడి అయ్యాయి. సంవత్సరాల వారీగా ఇందుకు సంబంధించిన ఇతర వివరాలు ఇవి: 1966వ సంవత్సరానికి గాను 58 కోట్లు 1967వ సంవత్సరానికి గాను 62 కోట్లు 1968వ సంవత్సరానికిగాను 72 కోట్లు 1969వ సంవత్సరానికిగాను 85 కోట్లు 1970వ సంవత్సరానికిగాను 100 కోట్ల విలువ మేరకు యంత్ర పరికరాలు అవసరమవుతాయి. ఇదేవిధంగా 1966 లో 11 కోట్లు 1967లో 12 కోట్లు, 1968లో 14 కోట్లు 1969లో 17 కోట్లు, 1970లో 20 కోట్ల విలువ మేరకు ఇతర లోహ పరిశ్రమలలో ఉపయుక్తమయ్యే యంత్రాలు విడిభాగాలు అవసరమవుతాయి.

ఒక మధ్యంతర నివేదికలో వెల్లడి చెయ్యడం జరిగింది. అందిన సమాచారాన్ని బట్టి యంత్రపరికరాలు చతుర్థ ప్రణాళికాకాలంలో ఏమేరకు అవసరమవుతాయో స్థూలంగా అంచనా వెయ్యడం జరిగిందనికూడా నివేదికలో తెలియచేయబడింది.

వివిధ పరిశ్రమలలో అవసరమయ్యే యంత్రపరికరాలలో నూరింట 75 వంతులు చతుర్థ ప్రణాళిక ఆఖరునాటికి దేశంలోనే తయారుచెయ్యాలని ఈ బృందం ఒక సిఫారసు చేసింది. ప్రస్తుతం దేశంలో అవసరమయ్యే యంత్రపరికరాలలో నూరింట 60 శాతం విదేశాలనుంచి దిగుమతి చేసుకోవడం జరుగుతున్నదనీ, ఈ దిగుమతుల స్థాయిని 25 శాతానికి తగ్గించాలని ఈ బృందం సూచించింది.

ప్రస్తుతపు యంత్ర పరికరాల ఉత్పత్తి స్థాయిని గురించి ప్రస్తావిస్తూ తృతీయ ప్రణాళిక ఆఖరు సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యం రూ. 30 కోట్లుకాగా రూ 33 కోట్ల విలువ మేరకు యంత్రపరికరాలు ఉత్పత్తి కాగలవని భావించబడుతోందని. అయితే ఇందుకు అవసరమైన విదేశీ మారకద్రవ్యం విడుదల కావలసి ఉందనీ, నివేదికలో తెలియచేసింది.

అమెరికాలో టాగోర్ ఆధ్యాత్మిక బోధనల ప్రభావం

పందొమ్మిదవ శతాబ్ది పూర్వార్థంలో న్యూ ఇంగ్లండ్ (అమెరికా) హిందూ పురాణాల వెల్లువలో పడింది. న్యూ ఇంగ్లండ్ అంటే అమెరికా సాంస్కృతిక డోలిక వంటిది. భారతీయ మత, వేదాంతాల ప్రభావం ఆనాటి కొందరు రచయితల, గ్రంథకర్తల మీద బాగా కనపడుతుంది. భగవద్గీత, ఉపనిషత్తులు, మనుస్మృతి వంటి పేర్లు ఆనాడు ఇంటింటా వినిపించేవి.

అమెరికాలో ఆనాడు సాగుతుండిన ఆధ్యాత్మిక పునర్వికాసోద్యమంలో భాగంగా ఈ వెల్లువ ప్రవహించింది. క్వేకరిజం, ప్రొటెస్టెంటిజం యూనిటేరియనిజంవంటి మత ఉద్యమాలు విజృంభిస్తుండిన కాలంలోనే ఇదే జరిగింది. మరింత అసంతృప్తులైన అమెరికన్లు ప్రాచ్య వేదాంతాలవైపు, ముఖ్యంగా హిందూవేదాంతంవైపు, దృష్టి మళ్ళించారు.

అసలు హిందూ వేదాంతంపట్ల ఈ ఆసక్తి ఎప్పుడు ఎట్లాపుట్టిందో తెలియదు. అయితే అమెరికాకు భారతీయ ప్రభావం ఎప్పుడు ఎట్లా విస్తరించిందనే విషయమై మూడు వాదాలున్నాయి. 1. తొలి అమెరికన్ వర్తకులు కారణమనీ, 2. రామమోహన్ రాయ్ ప్రభావం కారణమనీ, 3. అమెరికన్ అతిక్రామక వాదంమీద ఐరోపా విలక్షణ ప్రియవాదప్రభావంకారణమనీచెబుతారు.

అమెరికా ఇండియాలో 1787 లోనే వ్యాపారం ప్రారంభించిన సంగతి తెలిసిందే. అమెరికాకు స్వాతంత్ర్యం వచ్చిన కొద్దికాలానికే ఇది ప్రారంభమైంది. అమెరికానుంచి సరుకులు తెచ్చిన నౌకలలో తిరిగి వెళ్లుతూ సుగంధద్రవ్యాలు, నీలిమందు, వస్త్రంవంటి సరుకులేగాకుండా హిందూమత, వేదాంత గ్రంథాలుకూడా కొనుక్కొని వెళ్లుతుండేవారు. మెసచుసెట్స్ రాష్ట్రంలో సేలం నగరంలో పీబాడీమ్యూజియంలో ఉన్న భారతీయ వస్తు సంచయంచూస్తే ఇండియా, అమెరికాలమధ్య ఆనాడు ఎంతగా రాకపోకలుండేదీ తెలుస్తుంది. ఈ వ్యాపారనౌకలు ఉపయోగించిన రేవు స్థలంలో సేలం ఒకటి.

ఇండియా-అమెరికా సాంస్కృతిక సంబంధాలవృద్ధికి రామమోహన్ రాయ్ దోహదం చేశారు. హిందూ, క్రైస్తవ మతాలమధ్య సామరస్య సాధనకు విసుగు, విరామం లేకుండా కృషిచేసిన గొప్ప భారతీయ మత సంస్కర్త రామమోహన్ రాయ్. నూతన అమెరికన్ సమాజంమీద ఆయన వ్రాతలు గొప్ప ప్రభావం చూపాయి. అమెరికాలో నడిచే మత పత్రికలలో సగం ఆయన గురించి, ఆయన విశ్వాసాలను గురించి వ్యాసాలు ప్రచురించాయి.

ఇది ఇట్లా ఉండగా అమెరికాలో అతిక్రామిక వాదం (ట్రాన్సెండెంటలిజమ్) అనే కొత్త ఉద్యమం బయలుదేరింది. ఇది నిజానికి ఐరోపాలో బయలుదేరిన విలక్షణ ప్రియ వాదపు (రొమాంటసిజం) విస్తరణే అనవచ్చు. రాల్ఫ్ వాల్డో ఎమర్సన్, హెన్రీ డేవిడ్ థోరో వంటి అతిక్రామక వాదుల మీద ఐరోపా విలక్షణ ప్రియవాదుల రచనల ప్రభావం గొప్పగా పని చేసింది. ఈ విలక్షణ ప్రియవాదులు హిందూ వేదాంత సంపదను తరచి చూచిన గురువులుగా గుర్తించ బడినవారు. ఈవిధంగా భారత దేశాన్ని దాని విజ్ఞాన సంపదను అమెరికన్లు భారతీయ కావ్యాల అనువాదాల ద్వారా తెలుసుకొన్నారు.

ఎమర్సన్, థోరోల తరువాత, కొంత తక్కువ స్థాయిలోనే అయినప్పటికీ అమెరికాలో హిందూ మత ప్రభావం వ్యాప్తి చెందుతూనే వచ్చింది. ఆ

కృష్ణన్ గుజ్రాల్

కాలంలో అమెరికాలో పారిశ్రామికీకరణ దుష్ఫలితాల ఫలితంగా మరొక ఆధ్యాత్మిక కల్లోలంలో చిక్కుకున్నది. ఫలితంగా అమెరికన్లు ఇతర మతాల అధ్యయనం పట్ల ఇతోధికంగా ఆసక్తి చూపారు.

ఇటువంటి పరిస్థితుల్లో, స్వామి వివేకానంద 1893 లో అమెరికా వెళ్లటం జరిగింది. రామకృష్ణ పరమహంస ఉద్యమాన్ని ప్రపంచ వ్యాప్తంగా విస్తరింప జేసిన మూలపురుషుడు స్వామి వివేకానంద. ఈయన రాకతో మళ్లీ అమెరికా భావ ధోరణి మీద హిందూ ప్రభావం వెల్లువలాగా వచ్చి పడింది. స్వామి వివేకానంద మత దురభిమానాలకు అతీతమైన ఒక కొత్త జీవిత విధానాన్ని ప్రబోధించి అమెరికన్ల గౌరవం చూరగొన్నారు. ఆయన ప్రభావం అమెరికన్ల మీద గొప్పగా పనిజేసింది. అనతి కాలంలో అద్భుతమైన విజయం సాధించాడు. స్వల్పకాలంలోనే పలు పురు మేధావులు భారతదేశం గురించి, చాల వరకు అవగాహన చేసుకొన్నారు.

వివేకానంద తరువాత మరొక గొప్ప భారతీయమేధావి అమెరికా వెళ్లాడు. భారతీయ-అమెరికా ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబంధాల నిర్మాతలలో ఈయన రెండవవ్యక్తి. ఎవరీయన? రవీంద్రనాథ్ టాగోర్, రవికవి ఐదుసార్లు అమెరికా సందర్శించి 15 రాష్ట్రాలలో 40 నగరాలు చూశారు. పెద్ద పెద్ద సభలలో ఉపన్యాసాలు చేశారు. పెద్ద పత్రికలలో వ్యాసాలు వ్రాశారు. అన్ని జీవిత రంగాలలో నాయకులను కలుసుకొన్నారు.

భారతీయ భావ, సిద్ధాంతాలను అద్భుతంగా వివరించి ఈయనఅమెరికన్ల గౌరవాన్ని విశేషంగా చూరగొన్నారు. ఇట్లాచేసి అమెరికాలో భారతదేశపు పలుకుబడిని ఇనుమడింపచేశారాయన. అంతే కాదు. భారతదేశపు ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. ఇతర రంగాలకు కూడా ఈ పలుకుబడి వ్యాపించింది. అనతికాలంలోనే ప్రాచ్య పశ్చిమ సద్భావ చిహ్నమన్న పేరు ఆయనకు వచ్చింది.

అమెరికాలో టాగోర్ అంటే ఇంత కాలంగా గౌరవం ఉంటూ వచ్చింది. 1960-61 లో ఆయన శతవర్ధంతి జరగటంతో ఈ గౌరవం అద్భుతంగా పెరిగింది. ప్రఖ్యాత రచయిత్రి పెరల్ బక్ అధ్యక్షతన శతవర్ధంతి ఉత్సవ కమిటీ ఏర్పాటు అయింది. దేశం అంతటా ఉపన్యాసాలు, విద్వద్గోష్ఠులు, ఫిల్ములు వంటి వాటిద్వారా టాగోర్ ఉత్సవాలు జరిగాయి. ఆయన నాటకాలు, గ్రంథాలు కథాఖండాలు గురించి విరివిగా పరిచయం జరిగింది. అమెరికా అంతటా ప్రజలు నీరాజనాలు అర్పించారు. అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) ఉభయ సభలు జోహార్లు అర్పించాయి.

న్యూయార్కులో జరిగిన టాగోర్ ఉత్సవాలకు స్వర్గీయ ప్రెసిడెంట్ కెన్నడీ పంపిన సందేశంలో, ప్రపంచం అంతటా అడుగులకొలది ప్రజలకు టాగోర్ రచనల పరిచయం జరుగుతున్నందుకు సంతోషం వెల్లడించారు. "ఈ విధంగా ఆయన ప్రతిభ, ఉదాత్తశైలి, భావ గాంభీర్యత, సంపన్నతలను మరింత మంది అర్థం చేసుకొని ఆనందించగల్గుతారు" అన్నారు స్వర్గీయ కెన్నెడీ.

1912లో తొలిసారి టాగోర్ అమెరికా వెళ్లినప్పటికీ, దీనికి సంబంధమే లేదు. అప్పటికి ఆయనొక అపరిచిత వ్యక్తి. కొద్దిమంది మేధావులకు, భారతదేశం ఎరిగినమిత్రులకు మాత్రమే ఆయనెవరో తెలుసును. అమెరికన్లది "సంకుచిత జాతీయవాద తత్వం" అని వారిది "శుద్ధ చార్వాక తత్వం" అనీ, ఆయన విమర్శించాడు. ఈ మాటలు ఆయన వారిపట్ల ద్వేషంతోగాక, సద్భావధోరణిలో అన్నారు. అయినా అమెరికన్లలో కొన్ని వర్గాలవారి మనస్సుకే ఇది బాగా కష్టం కల్గించింది.

అయితే, టాగోర్ కి అమెరికా దేశ శక్తిసామర్థ్యాలపట్ల ప్రగాఢమైనగౌరవ భావం కలదనీ. వారి సత్యాన్వేషణ ఆయనకు శ్లాఘనీయమైందనీ, సంకుచిత జాతీయవాదాన్ని అమెరికాలో సేగాక, ఇండియా సహా మరెక్కడైనా ఆయన సహ గిట్టదనీ, అమెరికన్లు గురించిన మీదట పరస్పరఅపనమ్మకాలు క్రమేణా అంతరించాయి. ఆయనభావాలను అమెరికన్లు అర్థం చేసుకొన్న కొలదీ, ఆయన విశ్వజనీన దృక్పథం గురించి అవగాహన కూడా పెరిగింది.

"హాయిటీ" అనే ఒక అమెరికన్ పత్రికలో టాగోర్ పద్యాలు ఆరు ఇంగ్లీషు అనువాదాలు ప్రచురణ కావటంతో అసలు ఈ సంబంధాలలోనే ఒక కొత్త ఘట్టం ప్రారంభమైంది. ఈ ప్రచురణ 1912 డిసెంబర్ లో జరిగింది. దీనితో అమెరికన్లు అనేక మందికి టాగోర్ గురించి తెలియ వచ్చింది. అంతే కాదు పాశ్చాత్య సాహితీ ప్రపంచం ఆయనను గుర్తించటానికికూడా ఇది కారణమైంది. ఈ ఆరు పద్యాలు గీతాంజలిలోనివి. ఈ పద్య కావ్యానికి ఆ మరు సంవత్సరమే నోబెల్ బహుమానం వచ్చింది.

దీనిలో అమెరికాలో ఆయనకు మరింత గొప్ప పేరు వచ్చింది. ఆయన చివరసారి (అయిదోసారి) 1930 లో అమెరికా వెళ్ళినప్పుడు ఆయనకు రాజ మర్యాదలు చేశారు. ప్రెసిడెంట్ హూవర్ వైట్ హౌస్ కు ఆహ్వానించారు. న్యూయార్క్ నగరంలో 400 మంది ప్రముఖులు (వారిలో మాజీ ప్రెసిడెంట్ కూలేడ్జి కూడా ఉన్నారు.) కలిసి గొప్ప సన్మానం జరిపారు. అమెరికాలో ఆయన పరిచయం సంపూర్ణమైంది.

టాగోర్ కీ సైతం మొదట్లో అమెరికా అంటే ఉండే వ్యతిరేక భావాలను మార్చుకొన్నారు. అమెరికన్ ప్రజలతో ఏర్పడిన సాన్నిహిత్యం ఇందుకు కారణమైంది.

ఒకసారి "అట్లాంటిక్" అనే మాసపత్రికలో ఆయన ఇట్లా వ్రాశారు "....అమెరికా చార్వాక తత్వంగలదని అన్నామంటే ఆ మాట పూర్తిగా సత్యం కాదనటానికి కావలసిన నిదర్శనాలు కనుపిస్తున్నాయి.... అమెరికా భావధోరణిలో అంతర్గతమైన ఆధ్యాత్మికా దర్శవాదం ఒకటుంది."

1940 లో ఫాసిస్టు శక్తులు నాగరిక ప్రపంచాన్ని నాశనం చేయ పూనుకొన్నప్పుడు ప్రెసిడెంట్ రూజ్వెల్టుకు ఆయన చేసిన విజ్ఞప్తిని బట్టి అమెరికా ప్రజాస్వామ్యం పట్ల ఆయనకు గల దృఢ విశ్వాసం వ్యక్తమయింది. ఆయన అమెరికా ప్రెసిడెంటుకు చేసిన విజ్ఞప్తి చూడండి:

"....ఈనాడు ప్రపంచానికి భీకర మారణ శక్తుల ప్రమాదం దాపురించింది. నాగరకతను నాశనం చేయబూనుకొన్న ఈ దౌష్ట్యపు వెల్లువను నిలువరించగల శక్తి భారత దేశానికి లేదు.

"ఈనాడు మన విడివిడి రాజకీయ సమస్యలన్నిటిని మించిన ఒక పెద్ద సమస్య ఉదయించింది. వ్యక్తి ఆత్మ శక్తికి చివరి దుర్గంలాగాడున్న అమెరికా సహాయాన్ని ప్రపంచం ఈ సమస్యను పరిష్కరించుకొనటంలో కోరుతున్నదని నా విశ్వాసం. ప్రపంచానికి ముంచుకు వస్తున్న ఈ ప్రళయాన్ని తప్పక ఎదుర్కొంటుందని నా ఆశ."

జనవాణి

వర్కింగ్ జర్నలిస్టుల వేతనాలు

ఆర్యా,

నానాటి జీవితావసరవస్తువులధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయనీ, తత్ఫలితంగా నిర్ణీత వేతనాలపై ఆధారపడిన వర్గం దుర్భరయాతనలకు గురి అవుతున్నదనే విషయం నేడు మన దేశంలో అధిక సంఖ్యాకులకు స్వానుభవమే.

ధరల పెరుగుదలను పురస్కరించుకొని తదనుగుణంగా కరువు భత్యాన్ని సవరించాలని కోరుతూ వివిధపరిశ్రమలలోను, వాణిజ్యసంస్థలలోను ప్రభుత్వ కార్యాలయాలలోను పనిచేసే సిబ్బంది నేడు వివిధ రూపాలలో ఆందోళన సాగిస్తున్నారు.

పత్రికా రంగంలోని వర్కింగ్ జర్నలిస్టుల వేతనాలు తొలిసారిగా ఆరేండ్ల క్రితం వేతనసంఘ సిఫార్సులను పురస్కరించుకొని రూపొందాయి. నాటి నుండి నేటివరకు వివిధ వస్తువుల ధరలు కనీసం 30 శాతం అయినా పెరిగాయంటే అతిశయోక్తి కాదు. ఈ మధ్యకాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సిబ్బంది-కరువుభత్యాన్ని హెచ్చించడం. కరువు భత్యంలో అధికభాగాన్ని జీతంలో కలిపివేయడం చేసాయి. అయితే పత్రికలన్నీ ప్రయివేటు రంగానికి చెందినవి కావడంవల్ల వర్కింగ్ జర్నలిస్టులు ఆ భాగ్యానికి నోచుకోలేదు. అదీగాక పత్రికల వర్గీకరణ ఫలితంగా చాలా పత్రికలు దిగువ శ్రేణికి చెందినవిగా పరిగణింపబడటంతో వర్కింగు జర్నలిస్టులలో అధిక భాగం దుర్భరపరిస్థితులలో జీవించవలసి వస్తున్నది.

వర్కింగు జర్నలిస్టుల వేతనాల సవరణపై కేంద్రం ఇటీవల వేజ్ బోర్డును నియమించింది. వేజ్ బోర్డు సిఫార్సులకు తుదిరూపం ఏర్పడేసరికి మరో సంవత్సరకాలం గడిచే సూచనలు కానవస్తున్నాయి. అందుచేత వేజ్ బోర్డు తాత్కాలిక పెంపుదలనుసిఫార్సు చెయడం సమంజసం. పత్రికల ప్రస్తుత వర్గీకరణ, వేతనాల స్థాయిలతో నిమిత్తం లేకుండా 25 శాతం మేరకు వేతనాలు తాత్కాలికంగా పెంచడంవల్ల కనీసన్యాయం చేకూరగలదు. ఈ విషయంపై సత్వరమే నిర్ణయం జరగగలదని ఆశిస్తున్నాను.

వి. యస్. రాయసం

సికిందరాబాద్.

శ్రోతల మనవి

ఆర్యా,

ఆకాశవాణి శ్రోతలు చాలామంది. ఫిలింపాటల ప్రసార కాలాన్ని హెచ్చించాలని కోరుతూ లేఖలు వ్రాస్తున్నారు. తెలుగు రేడియోకేంద్రాలు కానట్ట' 'సిలోన్,' 'వివిధభారతి' ప్రసారాలలో ప్రతిరోజు అరగంటసేపు సినిమాపాటలు ప్రసారం చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ కేంద్రాలనుండి రోజుకు ఒక గంటసేపు ఫిల్మ్ పాటలను ప్రసారం చేయడంలో అసమంజసమేమీ లేదని నా అభిప్రాయం. శ్రోతల ఆనందానికి సినిమాపాటలుకూడా అవసరమనే విషయం రేడియో అధికారులు గుర్తించాలని నా మనవి.

హైదరాబాద్, విజయవాడ కేంద్రాల సలహాసంఘాలు కూడా శ్రోతల అభిప్రాయాన్ని గుర్తించి, సినిమాపాటలు ప్రతిరోజు ఒక గంటసేపు ప్రసారం చెయ్యడానికిగాను కృషి చేయాలని అభ్యర్థిస్తున్నాను.

నిజామాబాద్. శీలా నరసింహవర్మ

* * *

'మిక్కిలి విచారకరం'

ఆర్యా,

ఆకాశవాణి, విజయవాడ, హైదరాబాద్ కేంద్రాలనుండి సినిమాపాటలను ప్రసారం చెయ్యాలని శ్రోతలు ఎంత మనవిచేసినా అధికారులు దానిని పట్టించుకోకపోవటం, మిక్కిలి విచారకరం.

ప్రస్తుతం ప్రసారంచేస్తున్న పాటలలో చాలావరకు పాతరికార్డులనే ప్రసారం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితిదృష్ట్యా ఏమైనా ప్రత్యేక ప్రసంగాలు ఉంచేవాటికి కావలసిన కాలాన్ని కూడా, రికార్డులకై కేటాయించిన కాలంనుండే వినియోగించటం జరుగుతోంది.

ఇకముందైనా, తెలుగు సినిమాపాటలను, సంగీత ప్రశంసాచిత్రాలను తరచు ప్రసారం చెయ్యడానికి అధికారులు తగిన శ్రద్ధవహించాలని ప్రార్థిస్తున్నాను.

చందంపేట, (మెదక్ జిల్లా) వై. ఎస్. రాములు

* * *

అనుచిత ధోరణి

ఆర్యా,

"ఆకాశవాణి" హైదరాబాదు, విజయవాడ కేంద్రాలవారి ధోరణి గురించి "ఆంధ్రభూమి" పాఠకులు వ్యక్తపరుస్తున్న అభిప్రాయాలను పూర్తిగా బలపరుస్తున్నాను.

ప్రజాస్వామ్యంలో ప్రజల కోర్కెకు విలువ ఇవ్వకపోవడం ఘోరం.

శ్రోతలు కోరుతున్నదేమీ పెద్ద విషయంకాదు. రోజూ ఒక గంటసేపు ఫిలిం గీతాలు ప్రసారం చెయ్యాలని, రేడియో నండి ప్రశంస చిత్రాలను మరింత తరచుగా ప్రసారంచెయ్యాలని మాత్రమే మా కోరిక.

రేడియో కార్యక్రమాలను నిర్వహించేవారు తమ ఒక్కరి ఇష్టాయిష్టాలను బట్టి గాక ప్రజల కోర్కెలననుసరించి నడుచుకోవడం అవసరం. అప్పుడే రేడియో కార్యక్రమాలు జనరంజకం కాగలుగుతాయి.

గిరిరాజ్

సికింద్రాబాద్

*

తనకు తోచదు....

ఆర్యా,

రేడియో అధికారుల వ్యవహారం "తనకు తోచదు ఒకరు చెబితే వినరు" అన్నట్టున్నది. సినిమా సంగీతానికి రేడియో వారుపూర్తిగా వ్యతిరేకులుకూడా కాదు. అటువంటప్పుడు మరికొంత సమయం కేటాయిస్తే వారికిగాని మరొకరికిగాని వచ్చే ప్రమాదమేమిటి?

తెలుగు సినిమా పాటలకు కొంత వ్యవధి కల్పిస్తున్నందుకు "రేడియో సిలోన్". "వివిధ భారతి" నిర్వాహకులకు ఈ సందర్భంలో మా కృతజ్ఞత.

టి. ఓంకారనాథ్

వి. బాలుసా

సిద్దిపేట.

* * *

అలీన విదేశాంగ విధానం

ఆర్యా,

మన అలీన విదేశాంగ విధానాన్ని గురించి "క్రిటిక్" గారి క్రిటిసిజం (ఏప్రిల్ 29) చాలా క్రిటిక్ లాగా ఉండడమేగాక "క్రిటిక్" గారికి కొన్ని యదార్థ విషయాలు తెలియవనికూడా బైట పెడుతున్నది.

"క్రిటిక్"గారు మన అలీన విధానాన్ని గురించి కొన్ని అనవసర అపోహలు వ్యక్తపరిచారు. కొన్ని ఆసియా ఆఫ్రికా దేశాలను జకార్తా మహాసభకు ఆహ్వానించలేదని ఆ విషయమై ఇండియా ప్రతినిధి ఏమీ మాట్లాడలేదని వ్రాశారు.

మన ప్రతినిధివర్గ నాయకుడు సర్దార్ స్వరణ్ సింగ్ కొన్ని దేశాలను ఆహ్వానించనందుకు తమ ప్రారంభోపన్యాసంలోనే విమర్శించారు. బాండుంగ్ మహాసభలో పాల్గొన్న దేశాలన్నింటిని రెండవ మహాసభకు ఆహ్వానించాలని ఆయన స్పష్టం చేశారు. సన్నాహక సభ విషయంలో విచక్షణ చూపనందుకు అసంతృప్తి ప్రకటించారు. "క్రిటిక్" గారికి ఇంత మాత్రం తెలియకపోవడం విచారకరం. 'ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా' ఇచ్చిన కొద్దిపాటి వార్తలు ఆధారంగా క్రిటిక్ గారు అలాంటి విమర్శలు చేసి ఉండవలసింది కాదు. జకార్తాలోని "ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా" విలేఖరి కూడా తన డిస్పాచ్ లో ఇంత ముఖ్యమైన సంగతిని వదలి ఉండరు. అయితే ఎలాగో అది "క్రిటిక్"గారు చదివిన పేపర్లో వచ్చి ఉండకపోవచ్చు. ఆఫ్రికా ఆసియా దేశాల మహాసభకు రష్యాను ఆహ్వానించడం కేవలం రాజకీయపు ఎత్తుగడ అని చిత్రించడానికి "క్రిటిక్" గారు ప్రయత్నించారు. ఇది పూర్తిగా అసమంజసం. చైనాకు భయపడి, రష్యాతో మోహమాటం కొలది ఇండియా అలా సూచించినదనడం అర్థరహితం. రష్యా ఆసియా సంబంధం పిల్లలకుకూడా తెలిసినసంగతి. ఆసియా వ్యవహారాలలో రష్యా వహిస్తున్న పాత్ర, ఆసియా దేశాలలో రష్యా పలుకుబడి తెలుసుకుంటే "క్రిటిక్" గారు అలా వ్రాసి ఉండేవారు కారు. ఆసియా, ఆఫ్రికా దేశాలు ఏర్పాటు చేసుకున్న సభలలో రష్యా పాల్గొనడం కొత్త విషయమేమీ కాదు. జకార్తా సభలో ఇండియా ప్రతినిధి అనుసరించిన వైఖరి అలీన విధానానికి విరుద్ధంగానూ విరుద్ధంకాదు. ఒకరిపట్ల అభిమానంవల్లగాని, మరొకరికి భయపడికాని ఇండియా ప్రతినిధి వ్యవహరించలేదని నిష్పాక్షికంగా పరిశీలిస్తే స్పష్టం కాగలదు. రష్యాను, మలేషియాను సభకు ఆహ్వానించాలన్న ఇండియా సూచన అక్షరాలా సమంజసం.

యస్. వెంకటనారాయణ

కమలాపురం

* * *

వెలగని వీధి దీపాలు

ఆర్యా,

విద్యుచ్ఛక్తి శాఖా సిబ్బందిలో అలక్ష్యం రానురాను ఎక్కువవుతున్నది. వీధులలో దీపాలుపోతే మళ్ళీ ఎప్పుడొస్తాయో తెలియదు. ఇళ్ళలో కూడా అంతే. కొన్ని ప్రాంతాలలో లైట్లుపోతే ఒక్కొక్క పూట అసలే రావు. కంప్లయింట్ చేస్తే ఎవడూ పట్టించుకోడు.

బోయినపల్లి. బొల్లారం వెళ్ళే మార్గాలలో వీధి దీపాలు ఒక్కొకపూట వెలగవు. రాత్రిపూట సినిమాలు. దొంగతనాలు ఎక్కువ కావడానికి ఈ విధంగా విద్యుచ్ఛక్తిశాఖ కారణమవుతున్నది.

ఉన్నతాధికారులైనా జోక్యం చేసుకోవాలని. ప్రజల ఇబ్బందులను గమనించాలని ప్రార్థన.

జి. దయానంద్

సికింద్రాబాద్.

రామకృష్ణ దాల్మియా, శాంతిప్రసాద్ జైన్ మరి 11 మంది అరెస్టు

న్యూఢిల్లీ, మే 4

మోసం నేరంపై రెండు సంవత్సరాల జైలు శిక్షను అనుభవించి గత గురువారంనాడు విడుదలైన కోటీశ్వరుడు రామకృష్ణ దాల్మియాను దాల్మియా జైన్ ఎయిర్ వేస్ నిధులను దుర్వినియోగంచేసి నమ్మక ద్రోహం చేశాడనే నేరంపై నేడు మళ్లీ అరెస్టు చేశారు.

ఆయనతోపాటు శాంతి ప్రసాద్ జైన్, జైదయాల్ దాల్మియా, విష్ణుహరి దాల్మియాను మరి 11 మందిని కూడా ప్రత్యేక పోలీసు సంస్థ వారు అరెస్టు చేశారు. తర్వాత వారందరినీ జామీన్ పై విడుదల చేశారు.

నిందితులంతా కుట్ర పన్ని దాల్మియా జైన్ ఎయిర్ వేస్ లిమిటెడ్ వాటాలకు నిధులను సుమారు అరకోటి మేరకు కుంభకోణం చేయడానికి ఎత్తు వేశారని ప్రత్యేక పోలీసు సంస్థ సూపరింటెండెంట్ శ్రీ గుర్బాన్ మల్ ఆరోపించారు. ఆ కంపెనీ 1952 జూన్ లో దివాళా తీసినది.

నేడే చూడండి! నేడే చూడండి!!
శక్తి ఫిలిమ్స్ వారి
కాశ్మీర్ కీ కలీ
(ఈస్ట్ మన్ కలర్)
షమ్మీకపూర్ షర్మిలాటాగూర్ ప్రాణ్ నాజిర్ హుస్సేన్, ధూమల్, అనూప్ కుమార్ మదన్ పురి
నిర్మాత దర్శకుడు: శక్తిసామంత సంగీతం: ఓ. పి. నయ్యర్
జమ్రుద్ - హైదరాబాద్ నటరాజ్ - సికిందరాబాద్
రోజు 3 ఆటలు: 3-15 6-15, 9-30
సాదియా - ఔరంగాబాద్ - కపూర్ చంద్ అండ్ బ్రదర్స్ రిలీజ్

ఆఖరి 2 వారాలు! జెమినీవారి మహత్తర చిత్రం

నారంగ్ లో
రోజు 3 ఆటలు: 3-00, 6-15 9-30
జిందగి

మే 8వ తేదీన విడుదల!
పిల్లలకు ప్రవేశం లేదు.... వయోజనులకు మాత్రమే....
గీతాంజలి పిక్చర్స్ వారి
కోహరా

నటీనటులు:- వహీదా రెహమాన్, బిశ్వజీత్ లలితాపవార్
నిర్మాత సంగీతం: హేమంత్ కుమార్ దర్శకత్వం: బిరేన్ నాగ్
లిబర్టీ హైదరాబాద్ ప్రకాష్ హైదరాబాద్ మినర్వా సికిందరాబాద్
అడ్వాన్సు బుకింగు పగలు 11-00 నుంచి 1-00 మధ్య తిరిగి ఆటల సమయాలలోను గలదు
అడ్వాన్సు బుకింగు ఆటల సమయాలలో గలదు.
మే 8, 9, 10 తారీఖులలో రోజు 4 ఆటలు: 12-30, 3-30, 6-30, 9-30
—రషీద్ మెహతా అండ్ కో రిలీజ్—

అమీనాబాద గ్రామంలో అగ్నిప్రమాదం: వందఇళ్ళు దగ్ధం

(ఆంధ్రభూమి విలేకరి)

కాకినాడ, మే 4

ఉప్పాడ సమీపాన గల అమినాబాద గ్రామంలో నిన్న మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించిన ఫలితంగా వంద ఇళ్ళు దగ్ధమయాయి సుమారు 15 వేల రూపాయల విలువ గల ఆస్తినష్టమై ఉంటుందని అంచనా వేశారు

కాకినాడ అగ్నిమాపక దళంవారు మంటలను అదుపులోనికి తెచ్చారు.

అసెంబ్లీ సభ్యుడు శ్రీ మహమ్మద్ ఇస్మాయిల్ ఈ గ్రామాన్ని సందర్శించారు. ఇంటికి 50 రూపాయల చొప్పున సహాయం మంజూరు చేయవలసిందని కలెక్టరుకు ఆయన విజ్ఞప్తి చేసారు

ఇండొనేషియా రైలుప్రమాదంలో 21 మంది మృతి

జకార్తా, మే 4 (ఎ యఫ్ పి)

జావాకు నైరుతిదిక్కున ట్రోవాక్ గ్రామం దగ్గర ఒక దిగుడువంపులో కొండుంగునుండి వస్తున్న ఒక ట్రెయిన్ పట్టాలుతప్పి 21 మంది మరణించినట్లు 120 మంది గాయపడినట్లు అంటారా వార్తాసంస్థ ప్రకటించింది.

అనేక పెట్టెలు కనుమలోకి దొర్లుకొన్నట్లు ఒక పాసింజర్ పెట్టెతోసహా మరో 5 పెట్టెలు రెండున్నర కిలో మీటర్ల దూరం జారుకొని వెళ్ళి అక్కడ పట్టాలు తప్పినట్లుకూడా తెలుస్తున్నది

గాయపడినవారిని ట్రోవాక్ కు అనేక మైళ్ళ దూరానవున్న టాసిక్ మలయా కు హుటాహుటిని తరలించారు.

6 ఏళ్ళ క్రితం ఇదే ప్రాంతంలో రైలుబండి పట్టాలుతప్పి 100 మంది మృతి చెందారు.

'పోటీ కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పాటు దేశద్రోహం'

గుంటూరు సభలో చండ్ర రాజేశ్వరరావు విమర్శ

(ఆంధ్రభూమి విలేకరి)

గుంటూరు, మే 4

"కమ్యూనిస్టుపార్టీలో అభిప్రాయ భేదాలుయీనాటివికావు. 1958 నుండే ఉన్నవి. కాని, అవి బయటపడినవి చైనా ధర్మమాఅని. ఒక కమ్యూనిస్టు దేశం మాతృదేశం మీద విరుచుకుపడితే దేశంలోని కమ్యూనిస్టులు 'నీవు తప్పు చేస్తున్నా'వని అంటే తప్పా? పార్టీలో నుంచి చీలివాయి వాటపార్టీని పెట్టవంతమాత్రాన ఏం ప్రయోజనం? ప్రజల ముందుకువెళ్ళి, వారి విశ్వాసాన్ని చూరగొని నిలవాలి ఇప్పటికైనా వారు వచ్చి మాతో కలిస్తే మంచిదే. అయినా పార్టీలో చీలికలు దేశానికి, పార్టీకి శ్రేయస్కరంగాదు" అని శ్రీ చండ్ర రాజేశ్వరరావు మే దినోత్సవ సందర్భంలో జరిగిన సభలో మాట్లాడుచూ అన్నారు.

కమ్యూనిస్టు నాయకులు శ్రీ కె. నాగయ్య సభకు అధ్యక్షత వహించారు.

శ్రీ రాజేశ్వరరావు మాట్లాడుతూ పోటీపార్టీ నెలకొల్పడం దేశవిద్రోహ చర్య తప్ప వేరుగాదన్నారు.

సభకు సుమారు పదివేలమంది హాజరయ్యారు సభకుపూర్వం ప్రభలతో ఊరేగింపు జరిగింది.

స్కూటర్ల ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వ సహాయం

న్యూఢిల్లీ, మే 4

వచ్చే ఒకటి, రెండు సంవత్సరాలలో స్కూటర్ల సరఫరా పరిస్థితి మెరుగు కావచ్చునని ఉక్కు, గనులు, భారీ ఇంజనీరింగ్ శాఖ మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం రాజ్యసభలో చెప్పారు.

శ్రీ సీతారామజైపూరియా ప్రశ్నకు సమాధానం చెబుతూ, ప్రస్తుతపు ఉత్పత్తిని ఈ సంవత్సరానికి 90శాతం వరకు పెంచడానికి దేశంలోని ఉత్పత్తిదార్లకు ప్రభుత్వం సహాయం చేస్తోందని శ్రీ సుబ్రహ్మణ్యం చెప్పారు.



నూతన గవర్నర్ శ్రీ పట్టం తాను పిళ్లైతో ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ఇతర మంత్రులు

భూటాన్ లో చైనా విధ్వంసక చర్యలు సాగించే సూచన ప్రస్తుతానికి లేదని ప్రకటన

న్యూఢిల్లీ, మే 4 (పి టి ఐ)

భూటాన్ లో చైనా విధ్వంసక కృత్యాలు జరిపిస్తుందన్న భయం ప్రస్తుతానికి లేదని మంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి నేడు లోక్ సభ ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు

ఇటీవల భూటాన్ ప్రధాని హత్య జరిగిన సందర్భంలో చైనీస్ ప్రమేయం ఉన్నట్టు ప్రభుత్వం భావిస్తున్నదా అని శ్రీ హేమ్ బారువా, శ్రీ డి సి శర్మ మరికొందరు సభ్యులు ప్రశ్నించారు.

చైనీయుల పాత్ర ఏమిటో ఇప్పుడు కచితంగా చెప్పలేనని శ్రీ శాస్త్రి అన్నారు.

హత్యా కేసు దర్యాప్తు జరుగుతున్నదని, ఇదమిత్థంగా ఏమీ ఇప్పుడు చెప్పలేమని మంత్రి వివరించారు

విధ్వంసకాండ జరుగుతున్నదన్న భయం ప్రస్తుతానికి లేదనీ, అయినా ఎప్పటికప్పుడు పరిణామాలను గమనిస్తుంటామని ఆయన చెప్పారు

డాక్టర్ జి. జి స్వెల్ ఇలా అడిగారు.

"ఏప్రిల్ 13వ తేదీన భూటాన్ ఉపసేనాని అరెస్టు కావడానికి ముందు అక్కడి పరిస్థితులు విషమించాయా? విషమించినట్టు సమాచారం అందితే జోక్యం చేసుకోవలని దిగా భారత సైన్యాన్ని ఆదేశించారా? అలా ఆదేశించడం భూటాన్ ప్రభుత్వ విజ్ఞప్తిపై జరిగిందా లేక మనంతట మనం జోక్యం చేసుకున్నామా?"

డాక్టర్ స్వెల్ ప్రశ్నలో వచ్చిన సమాచారం అంత సరియైనది కాదని శ్రీ శాస్త్రి అన్నారు.

ఇందుకు సంబంధించి, ప్రభుత్వం వద్ద కచ్చితమైన సమాచారం ఉన్నప్పటికీ దానిని సభవారికి తెలియ జేయలేమని శ్రీ శాస్త్రి స్పష్టం చేశారు.

భూటాన్ లో ప్రస్తుత ప్రభుత్వాన్ని కూలద్రోసి, ఇండియా, భూటాన్ సంబంధాలను మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్టు ముందుగా దౌత్యవర్గాల ద్వారా సమాచారం అందినదా అని శ్రీ ఇంద్రజిత్ గుప్తా ప్రశ్నించారు.

తిరుగుబాటు జరుగుతుందన్న ప్రత్యేక సమాచారమేమీ రాలేదని అయితే భూటాన్ ప్రధాని హత్య కారణంగా ఏమైనా అవాంతర పరిస్థితులు రావచ్చునని సందేహించడం మటుకు జరిగిందనీ, విదేశాంగ వ్యవహారాల స్టేట్ మంత్రి శ్రీమతి లక్ష్మీ మీనన్ చెప్పారు.

టి.టి.కె. ప్రకటన

(1వ పేజీ తరువాయి)

కరువుభత్యం హెచ్చించడానికి ధనాభావమే కారణమని ఆయన పదేపదే పేర్కొన్నారు.

కొంత అదనపు సహాయం మంజూర్ జేయడానికి కూడా సాలీనా దాదాపు 20 కోట్లు అదనపు వ్యయం కాగలదని పేర్కొంటూ, ధరల పెరుగుదలను అరికట్టాలన్న సభ్యుల సూచనతో శ్రీ కృష్ణమాచారి ఏకీభవించారు. స్వల్పాదాయ వర్గాలవారికి నాలుగు రూపాయలు జీతం పెరిగినదన్న సాకుతో ధరలు పెంచుతున్న వారిపై చర్యగైకొనానికూడా ఆయనకోరారు

జీవన వ్యయం పెరుగుదలకు ప్రతీకారంగా కరువు భత్యం హెచ్చించే బదులు ఇతర విధాలుగా సదుపాయాలుకల్పించడం వాంఛనీయమా అనే విషయమై ప్రభుత్వం పరిశీలిస్తూ ఉన్నదనీ, ఈ సందర్భంలో అధికారులతో కూడిన కమిటీ చర్చలు జరిపినదనీ, కాని వారు ఎట్టి నిర్ణయానికి రాలేదని ఆర్థిక మంత్రి తెలియచేసారు.

పి. యస్. పి. సభ్యుడు శ్రీ నాథ్ పాయ్, ఇండిపెండెంట్ సభ్యుడు శ్రీ ఎస్. ఎం. బెనర్జీ ప్రస్తావన ద్వారా, ఈ సమస్యపై అర్ధగంటసేపు సాగిన చర్చలో జోక్యం చేసుకొని మాట్లాడుతూ శ్రీ కృష్ణమాచారి పైవిధంగా చెప్పారు.

పంచవర్ష ప్రణాళికల అమలులో సాంఘిక లక్ష్యాలు అతి ముఖ్యమైనవనీ, దేశం పురోగతి చెందడం అవసరమనీ, నాలుగవ ప్రణాళికకు ఇతోధికంగా సాధన సంపత్తిసమీకరణ అవసరమన్న సత్యాన్ని గుర్తించినప్పటికీ, స్వల్పాదాయ వర్గాల జీవన ప్రమాణాలను పెంచాలనే సాంఘిక లక్ష్యాన్ని ప్రభుత్వం విస్మరించజాలదని శ్రీ కృష్ణమాచారి అన్నారు.

అంతకుపూర్వం, శ్రీ బెనర్జీ మాట్లాడుతూ, ధరలను తగ్గించే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైనదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వోద్యోగులకు కరువుభత్యం హెచ్చించని పక్షంలో, వారిలో నిస్పృహ ప్రబలి, తద్వారా దేశవ్యాప్తంగా ఆందోళన ఏర్పడగలదని ఆయన అన్నారు.

ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న కాలంలో ధరల పెరుగుదల అనివార్యమని చెప్పడంవల్ల ప్రయోజనం లేదనీ. వర్ధమాన దేశమైన ఐక్యఅరబ్ రిపబ్లిక్ లో ఆహార పదార్థాల ధరలు కొన్ని సంవత్సరాలుగా నిలకడగా ఉన్నాయని శ్రీ నాథ్ పాయ్ చెప్పారు. చౌకధరల దుకాణాలను ప్రారంభించే విషయమై ప్రభుత్వం యోచిస్తున్నదా లేదా అని ఆయన ప్రశ్నించారు.

గత రెండేళ్ళలో ధరలు పెరిగినందున కరువుభత్యం కొత్తరేట్లు 1962 ఏప్రిల్ నుండి అమలులోకి రావాలని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ అనందన్ నంబియార్ సూచించారు.

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యవర్గ ఎన్నికల నామినేషన్లు

న్యూఢిల్లీ, మే 4

వచ్చే సంవత్సరానికి కాంగ్రెస్ పార్లమెంటరీ ఉపనాయకులు ఇద్దరిలో ఒకరుగా శ్రీ సురేంద్రమోహన్ ఘోష్ ఎన్నికైనట్లే.

రాజ్యసభ నుండి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు.

లోక్ సభలో మాత్రం ఏడుగురు అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నట్టు పరిశీలనాంతరం ప్రకటించారు వారిలో ప్రస్తుత ఉపనాయకుడు శ్రీ కె. సి. రెడ్డితోపాటు శ్రీ ఎస్. కె పాటిల్ కూడా ఉన్నారు

మే 7వ తేదీనాడు ఎన్నికలు జరుగుతాయి. మే 6 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నది

పార్టీ కార్యదర్శి పదవికి లోక్ సభ నుండి 9 మంది అభ్యర్థులు ఉన్నారు. వారిలో ప్రస్తుత కార్యదర్శులు శ్రీయుతులు రఘునాథ్ సింగ్, బిభూతిమిశ్రా కూడా ఉన్నారు,

(లోక్ సభ నుండి ఇద్దరు రాజ్యసభ నుండి ఒక కార్యదర్శిని ఎన్నుకోవలసి ఉంటుంది.)

రాజ్యసభనుండి కార్యదర్శి పదవికి ఏడుగురు పోటీ చేస్తున్నారు. వారిలో ప్రస్తుత కార్యదర్శి శ్రీ టి. ఎస్. పట్టాభి రామన్ ఒకరు.

తాతా సాంఘిక విజ్ఞాన శాస్త్రాల సంస్థ

న్యూఢిల్లీ, మే 4

తాతా సాంఘిక విజ్ఞాన శాస్త్రాల సంస్థ (బొంబాయి), విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘం చట్టానికి సంబంధించి [illegible] విశ్వవిద్యాలయంగా పరిగణించబడుతుందని ప్రకటించారు.

కొండ ప్రాంతాలకు విస్తృతాధికారాలు

ప్రధాని సూచనను అస్సాం జిల్లాల నాయకులు అంగీకరించినట్లు లోక్ సభలో శాస్త్రి ప్రకటన

న్యూఢిల్లీ, మే 4 (పి టి ఐ)

అస్సాం కొండప్రాంతాలకు స్వతంత్రాధికారాలు బాగా కల్పించగలమని ప్రధానిచేసిన సూచనను ఆ ప్రాంతాల నాయకులు అంగీకరించిరమాట వాస్తవమేనని కేంద్రమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి నేడు లోక్ సభలో ధ్రువీకరించారు.

ఈవిషయంలో వివరాలను రూపొందించడానికి కమిషన్ నియమించే విషయం ప్రస్తుతం పరిశీలనలో ఉన్నదని ఆయన అన్నారు.

కొండప్రాంతాల నాయకులకు నిర్దిష్టమైన వాగ్దానమేదీ చేయలేదని శ్రీ యస్పాల్ సింగ్ మరి పెక్కుమంది అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ శ్రీ శాస్త్రి అన్నారు. వీరితో స్థూలంగా చర్చలు జరిగాయనీ, అన్ని విషయాలనూ స్పష్టీకరించేనిమిత్తం కమిషన్ పరిశీలనాంశాలను రూపొందించవలసి ఉన్నదని ఆయన అన్నారు.

కొండ ప్రాంతాలకు స్వతంత్రాధికారాలు బాగా ఉంటాయనీ అయితే వివిధమైన ఏర్పాటయినా రాజ్యాంగావకాశాలకు విరుద్ధంగా ఉండబోదని శ్రీ శాస్త్రి అన్నారు.

కొండప్రాంత నాయకుల కోర్కెలలో కొన్నిటిని ఈడేర్చడానికి ప్రధాని ఈవరకే వాగ్దానం చేసినమాటనిజమేనా అనీ, కమిషన్ స్వతంత్రమైనదిగా వ్యవహరించగలదా అని శ్రీమతి రేణుకాదేవి ప్రశ్నించారు.

కొండ ప్రాంతాలలో ఒకరకంగా స్కాట్లండ్ పద్ధతి పరిపాలన ప్రవేశపెట్టవచ్చని ప్రధానిసూచించారని శ్రీ శాస్త్రి సమాధానమిచ్చారు.

మామూలుగానే ఈ విషయాన్ని కమిషన్ పరిశీలించగలదనీ, అంతేతప్ప ఈ విషయంలో నిర్దిష్టంగా ఏమీ చెప్పలేదనీ మంత్రి అన్నారు.

భాష, ప్రాంతీయాభివృద్ధి, ఆ ప్రాంత బడ్జెట్, ఆ తెగలవారికి ఇవ్వవలసిన ప్రత్యేక హక్కులు మొదలైన వాటికి సంబంధించిన విషయాలను కమిషన్ పరిశీలిస్తుందని శ్రీమతి రేణూచక్రవర్తి అడిగిన ప్రశ్నకుసమాధానమిస్తూ మంత్రి అన్నారు. ఈ కమిషన్ పరిశీలించవలసిన అంశాలను హోమ్ శాఖ రూపొందిస్తున్నది.

"స్వతంత్రాధికారాలు బాగా కల్పించగలమని" లేక "సంపూర్ణ స్వతంత్రాధికారాలు" ఇవ్వగలమని కొండ ప్రాంతాలవారికి ప్రధాని వాగ్దానం చేయలేదని శ్రీ జి. జి. స్వెల్ ప్రశ్నించారు. ప్రధాని ఇచ్చిన హామీలకు అనుగుణంగా కమిషన్ పనిచేయగలదని భావిస్తున్నదా అనికూడా ఆయన ప్రశ్నించారు.

"సంపూర్ణ స్వతంత్రాధికారాలు" అనేమాటను ప్రధాని ఉపయోగించలేదనీ స్వతంత్రాధికారాలు ఎంతవరకూ ఇవ్వాలనే విషయం కమిషన్ నివేదికపై ఆధారపడి ఉంటుందని శ్రీ శాస్త్రి అన్నారు. అయితే ప్రధాని ఒకవేళ ఆ విధంగా అనిఉంటే సవరించుకోవచ్చని ఆయన అన్నారు.

లావోస్ మితవాద, తటస్థవర్గాల మధ్య ఒప్పందం

వియన్ షైన్, మే 3

లావోస్ లోని తటస్థవాదులు, మితవాదవర్గం మధ్య, ఒకకొత్త రాజీ ఒప్పందం కుదిరిందని, యికముందు మితవాదవర్గం అంతర్ధానం కాగలదని, లావోస్ ప్రధాని ప్రిన్స్ సౌవన్న ఫౌమా నిన్న ప్రకటించారు.

మిశ్రమ ప్రభుత్వం పనిచేయడానికి వామపక్ష నాయకులు ప్రిన్స్ సౌఫనోవాంగు సహకారాన్ని అభ్యర్థించటానికై, రేపు ఆయనను కలుసుకోబోతున్నట్టు ఒక పత్రికాగోష్ఠిలో ప్రిన్స్ ఫౌమా చెప్పారు.

మితవాదవర్గం పూర్తి సైనికాధికారాన్ని తనకు అప్పగించిందని, రక్షణమంత్రిగా సైనిక వ్యవహారాలన్నిటినీ తానే చూస్తున్నానని, మితవాద సైన్యాలు తన అధికారంలోనే ఉన్నాయని ఫౌమా చెప్పారు.

కార్యదీక్షతో పనిచేస్తే పరిష్కారం కాని సమస్యే ఉండదు

రాష్ట్ర ప్రజలకిచ్చిన సందేశంలో కొత్త గవర్నర్ ఉద్ఘాటన

హైదరాబాద్ మే 4

సరియైన దృక్పథంతోను పరస్పర సుహృద్భావంతోను విషయావగాహన పూనుకుంటే ఎట్టి సమస్యయైనను పరిష్కారం కానిది అతీతంకాదని. ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా అధికార స్వీకారం చేసిన శ్రీ పట్టం తానుపిళ్ళై నేటి రాత్రి యిక్కడ చెప్పారు

గవర్నరు రాష్ట్ర ప్రజలను ప్రప్రథమంగా హైదరాబాద్ ఆకాశవాణి ద్వారా సంబోధిస్తూ ఆర్థికాభివృద్ధి మాత్రమే జాతీయతకు సమగ్ర స్ఫూర్తి కలిగించదన్నారు ఉత్తమ తరగతి పౌరశ్రేణిని రూపొందించటానికి శ్రద్ధాపూర్వకమైన కృషిచేయాలి. ప్రజల దృక్పథంలో సేవా తత్పరత, సోదర మానవులపట్ల ప్రేమ, సానుభూతి, సహనం, ఉదాత్త సంభావనీయత ప్రకృష్టస్థానం వహించాలి

గవర్నరు ఇంకా యిలా అన్నారు;

బృహత్తరమైన మీ రాష్ట్రంయొక్క గవర్నరుగా ఈరోజు ఉదయం నేను పదవీప్రమాణం స్వీకరించాను. ఆ సందర్భంలో నేను మీకు నా శక్త్యానుసారం సేవచేయగలననే ప్రతిజ్ఞ చేశాను. ఆ ప్రతిజ్ఞను ఇప్పుడు తిరిగి మీతో చేస్తున్నాను.

"నేను ఆంధ్రప్రదేశ్ కు రావడం నా స్వస్థానానికి వచ్చినట్లుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ లో చాలాభాగం, నాస్వంత రాష్ట్రమైన కేరళలోని సుమారు అయిదింట రెండువంతుల ప్రాంతం లోగడ అవిభాజిత మద్రాసు రాష్ట్రంలో భాగాలుగా ఉండేవి. ఈ రెండురాష్ట్రాలను దక్షిణమండలంలో చేర్చారు. ఇంతేకాక యీ రెండుప్రాంతాల ప్రజలను సన్నిహితం చేసే సంబంధాలు ఇంకా అనేకం ఉన్నాయి. ఈ ఉభయరాష్ట్రాలలో ప్రజల సంస్కృతి, సాంఘిక జీవితం దాదాపు ఒకటిగా ఉంటాయి. ఇంతేకాక ప్రాథమికమైన ఏకత్వంకూడాఉంది. ఇదే పరస్పర సంబంధాలను సన్నిహితం, దృఢతరంచేస్తున్నది. అందుచేత నేను మీకు సేవచేయడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. ఈ సదవకాశం లభించినందుకు నాకు ఎంతో ఆనందంగా ఉంది.

"మన దేశంలోని అత్యంత అభ్యుదయకరమైన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ప్రకృతిసిద్ధమైన వనరులు యీ రాష్ట్రంలో ఉన్నాయి. అనేక ఉపనదు [illegible] యీ రాష్ట్రంలో నీటిపారుదల సౌకర్యాలు కల్పించడమేకాకుండా భారీఎత్తున విద్యుచ్ఛక్తినికూడా సరఫరా చేస్తున్నాయి. నాగార్జునసాగర్, శ్రీశైలం, పోచంపాడు ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కావడంతో ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధివనరులు ఇంకా చాలావరకు పెంపొందుతాయి. ఇక్కడి ప్రజలకు ఇవి సమృద్ధవంతమైన, అభ్యుదయకరమైన జీవితాన్ని సంప్రాప్తింప జేస్తాయి ఆంధ్ర ప్రదేశ్ మరింతగా పురోభివృద్ధి సాధించడమంటే యావద్భారత ప్రజలకు ముఖ్యంగా యీ రాష్ట్రం నుంచి అధికపరిమాణంలో బియ్యం దిగుమతి చేసుకుంటున్న లోటు రాష్ట్రాలకు ఇతోధికంగా ప్రయోజనాలు చేకూరడమేనన్నమాట. ఈ రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధిని సాధించటంతో పాటుగా అనేక పారిశ్రామిక పథకాలను కూడా అమలుపరుస్తున్నట్లు తెలుసుకొని నేనుచాలా ఆనందించాను. ఈ పథకాలు ప్రజానీకానికి లాభసాటియైన ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా వారి ఆర్థిక సౌష్ఠవాన్ని మరింతగా పెంపొందిస్తాయి.

శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి అజేయ నాయకత్వంలో, ఇతర మంత్రుల అండదండలలో ప్రవర్ధమానమై సుస్థిరమైన ప్రభుత్వానికి గవర్నరుగా రావడం నాకెంతైనా గర్వకారణం.

"ఈ నాటినుండి రాష్ట్ర ప్రజలను కలుసుకోవడం నా విద్యుక్త ధర్మం. వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు సార్వజనిక నగరమైన యీ సుందర హైదరాబాదు నగరంలోని వారినే కాక, ముందుముందు నాపర్యటనల్లో జిల్లాలలోని ప్రజలనుకూడా కలుసుకుంటాను. ఆ ప్రజలకష్టాలను అర్థం చేసుకోవడానికి, వారి సమస్యలను తొలగించే సహాయం చేయడానికి ప్రయత్నిస్తాను, సక్రమంగా ఉత్సాహంగా ఒకరినొకరు అర్థం చేసుకుని సమస్యాపరిష్కారానికి పూనుకుంటే నేగాని ఏసమస్యా ఒక కొలిక్కిరాదు. దేశం సర్వతోముఖంగా వికాసాన్ని పొందాలంటే కేవలం ఆర్థికాభివృద్ధి జరిగితే చాలదు. సేవా నిరతి, ప్రేమ, సానుభూతి, సహనం, దాతృత్వం మొదలైన గుణగణాలతో రూపొందిన దృక్పథంగల ఒకచక్కటి తరగతిప్రజలు వెలుపడడానికి కారణమయ్యే బృహత్తర కార్యంపైపు మనం మన దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం కూడా ఉంది. దేశంలో ఆర్థికాభివృద్ధిని విస్తరిల్ల చేయడంతోపాటు, మన ప్రజలలో పైన పేర్కొన్న సుగుణాలను కల్పించి తద్వారా మన ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేయడానికి అవసరపడే సరైన పౌరులు రూపొందడానికి మనం మన శక్తియుక్తులను ఆవైపుగా మరలించాల్సి ఉంది పొరుగు దేశపు విరోధ ధోరణివల్ల ఉత్పన్నమైన క్లిష్టపరిస్థితిని యీనాడు మనం ఎదుర్కొంటున్న విషయం మీకు తెలిసినదే, దేశాభ్యుదయానికి మన కృషిని ఏ మాత్రం సడలించకుండా నే సాధ్యమైనంతవరకు దేశ సమైక్యతను, గౌరవాన్ని మనం పరిపోషించాలి దేశ సమైక్యతను అన్ని విధాలా మనం పటిష్టవంతం చేయాలి, కులమత వర్గాలతో సంబంధం లేకుండా ధనికులు, బీదవారూ, పెద్దా, చిన్నా తేడాలేకుండా రాష్ట్రంలోని ప్రజలందరిలో ఐకమత్యం, స్నేహం, పరస్పర గౌరవాలను రూపొందించడానికి నేనూ నా అర్ధాంగి పాటుపడతామని మీకు నేను హామీ ఇస్తున్నాను. జీవితంలో సంపాదించిన అనుభవాల్ని యీ రాష్ట్ర ప్రజల సేవకొరకై వినియోగిస్తాను గవర్నరుగా నేను [illegible] తున్న యీ బృహత్తరకార్యక్రమానికి మీ పూర్తి సహాయం సహకారాలను అందజేయవలసిందిగా మీకందరకూ విజ్ఞప్తి చేస్తున్నాను.

దేశంలో లేత్ మిషనుల ఉత్పత్తి

బెంగుళూరు, మే 4

ప్రభుత్వ రంగంలోని హిందూస్థాన్ యంత్ర పరికరాల కర్మాగారం, లేత్ మిషన్ల ఉత్పత్తిని త్వరలో ప్రారంభిస్తుంది

'మనుర్ హిన్' అనే ఫ్రెంచి సంస్థ హిందూస్థాన్ యంత్ర పరికరాల సంస్థకు మధ్య సాంకేతిక సహకారానికి ఒక ఒప్పందం కుదిరింది.

ఈ మిషన్లను తయారుచేసి, భారత సింహళ దేశాలలో విక్రయించడానికి హిందూస్థాన్ సంస్థకు పూర్తి అధికారం ఉంటుంది.

అశోక్: హైదరాబాద్ ప్యారడైజ్: సికిందరాబాద్

విక్రమ్ ప్రొడక్షన్స్ అమరశిల్పి జక్కన్న
నిర్మాత, దర్శకుడు బి. యస్. రంగా ఈస్ట్ మన్ కలర్ నవయుగ
అశోక్ లో 3 ఆటలు: 2-30 6-15 9-30 ప్యారడైజ్ 2 ఆటలు: 6-15, 9-30

8వ వారం బసంత్: హైదరాబాద్ అంజలి: సికింద్రాబాద్
మీ హృదయాలపై గాఢమైన ముద్రవేసే మహత్తర చిత్రం!
మూగమనసులు

ప్రతిరోజు 3 ఆటలు: 2-30, 6-15, 9-30

సాగర్ - హైదరాబాద్ రాజేశ్వర్ - సికింద్రాబాద్

బి.ఎ.యస్. వారి
మైరావణ
బి.ఎ. సుబ్బారావు
రోజు 3 ఆటలు: 2-45, 6-15, 9-30

నేడే మధ్యాహ్నం 2-30 గంటలకు విడుదల!
దుష్టపాత్రనుండి కూడా త్యాగాన్ని సమనీయం చేసే సముచిత కథా సంవిధానంతో పవిత్ర ప్రేమను సేవా శీలాన్ని ప్రదర్శించిన యువతి జీవిత గాథ—
మహేశ్వరి పిక్చర్స్ వారి
అపూర్వ కానుక
పద్మిని, ఇ. వి. సరోజ, రాగిణి కుచలకుమారి, ఎమ్. కె. రాధ, సుందర్
నిర్మాత, దర్శకుడు: టి. జానకిరామ్
రాహత్ మహల్ - ముషీరాబాద్
రోజు 3 ఆటలు: 2-30, 6 00, 9-30

- సాధనా పిక్చర్స్ విడుదల -

గ్రామీణ ప్రాంతాలలో సహకారోద్యమం

తెలంగాణా ప్రాంత సహకార శిక్షణ బోధకుల సమావేశంలో ముఖ్యమంత్రి సూచన

హైదరాబాదు మే 3 (ఎ.ఎన్ ఎస్) జాతీయ పునర్నిర్మాణకార్యక్రమంలో సహకారోద్యమం అత్యంత ప్రముఖ పాత్రవహించవలసి వుందని నేడు తెలంగాణా ప్రాంత సహకార శిక్షణ బోధకుల సమావేశానికి ప్రారంభోత్సవం జరుపుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు.

హైదరాబాదు కేంద్ర సహకార సంఘం అధ్యక్షుడు శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఇటీవల భువనేశ్వర్ లో జరిగిన కాంగ్రెసు మహాసభలో సహకారరంగ ప్రాముఖ్యతను నాయకులు గుర్తించారనీ, జాతీయ పునర్నిర్మాణ కృషిలో, కేంద్రరాష్ట్రప్రభుత్వాలు అనేక బృహత్తర కార్యక్రమాలను ప్రవేశ పెడుతున్నారనీ, ఈ కృషి అవిధికార సంస్థల ప్రజల సహకారం అత్యంత అవశ్యకమనీ ముఖ్యమంత్రి అన్నారు.

సహకారరంగం ప్రాధాన్యత వహిస్తున్నరీత్యా ఇందుకు తగిన నాయకత్వాన్ని పెంపొందించవలసి వుంది గ్రామీణ ప్రాంతాలలో ఇందుకనువైన వాతావరణాన్ని, ప్రజలలో ఉత్సాహాన్ని రేకెత్తించవలసి వుంది. ఇందుకు కార్యకర్తలకు శిక్షణనివ్వడం ఎంతో అవసరం.

కార్యకర్తలు ప్రభుత్వం అమలు జరుపుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఎరుకపరచి వారి సహకారాన్ని పొందినప్పుడే. ఈ కార్యక్రమాలు విజయాన్ని సాధిస్తాయి. ఈ శిక్షణ కార్యక్రమం, సహకార రంగంలోనేగాక, అన్ని రంగాలలోను అమలుపరచవలసిన అవసరం వున్నది. ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల కేంద్ర సహకార సంఘాలు రెండూ ఏకీకృతమై ఒక పటిష్టమైన సంఘంగా రూపొందగలదని శ్రీ బ్రహ్మానందరెడ్డి తమ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఇంతవరకు 8లక్షల మంది సహకార సంఘాల ప్రాథమిక సభ్యులకు 2000 మంది కార్యనిర్వాహక సభ్యులకు శిక్షణ యిచ్చినట్లు శ్రీ లక్ష్మణ్ బాపూజీ వెల్లడించారు

అఖిలభారత సహకార సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు శ్రీ మాధవరావు, [illegible] ప్రసంగిస్తూ వ్యవహార జ్ఞానం లోపించడంచేతనే సహకారోద్యమం [illegible] నదనీ, గత పదేళ్లుగా దేశంలో సహకారోద్యమానికి అత్యంత ప్రోత్సాహం లభించిందనీ, గ్రామీణ ప్రాంతాలలో బాగా వ్యాప్తిచెందినదనీ సహకార రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానం వహించే రోజు దగ్గరపడుతున్నదనీ అన్నారు.

భారతీయ హిందీ పరిషత్ మహాసభ

ఈ నెల 31 న ప్రారంభం

హైదరాబాద్, మే 4(ఎ.ఎన్ ఎస్)

భారతీయహిందీపరిషత్ 21వ మహాసభ ఈనెల 31నుండి 3రోజులపాటు ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో జరుగుతుంది.

అలహాబాద్ లో యూనివర్సిటీ హిందీ శాఖాధిపతి డాక్టర్ రాంకుమార్ వర్మ అధ్యక్షత వహిస్తారు వివిధ విశ్వవిద్యాలయాల నుండి 400 మంది హిందీ అధ్యాపకులు ఈ మహాసభలో పాల్గొంటారని భావిస్తున్నారు.

మహాసభ ఆహ్వాన సంఘం శుక్రవారంనాడు డాక్టర్ మాధవ్ విద్యాలంకార్ అధ్యక్షతన సమావేశమై ఈ సభను విజయవంతంగా నిర్వహించే నిమిత్తం కొన్ని ఉపసంఘాలను ఏర్పాటుచేసింది.

మహాసభ నిర్వహణనిమిత్తం 20వేల రూపాయల నిధిని సేకరించాలని కూడా నిర్ణయించింది.

ఆహ్వానసంఘ సభ్యులు డాక్టర్ డి. యస్. రెడ్డిని కలుసుకొని వారు తిరిగి వైస్ ఛాన్సలర్ గా నియమితులైనందుకు తమ అభినందనలు అందజేశారు.

షేక్స్పియర్ సృష్టించిన పాత్రల విశిష్టత

అమరేంద్ర అభిభాషణ

(ఆంధ్రభూమి ప్రతినిధి)

గుంటూరు, మే 3

రోటరీక్లబ్ సమావేశంలో, శ్రీ అమరేంద్ర ఆంగ్ల మహాకవి షేక్స్పియర్ కు శ్రద్ధాంజలి ఘటించారు. సభ్యులే గాక ఇతర పురప్రముఖులు కూడా అనేకులు విచ్చేశారు.

షేక్స్పియర్ సృష్టించిన ప్రతి పాత్ర ఒక ప్రత్యేక విలక్షణత్వం, ఒక విశిష్టత గల్గి, చిరంజీవిత్వాన్ని సంపాదించుకొన్నదనీ, అదే ఆయన గొప్పదనమనీ శ్రీ అమరేంద్ర అన్నారు. అతను ఏ విశ్వవిద్యాలయంలోను విద్యనభ్యసించలేదనీ కాని విశ్వం అనే విశ్వవిద్యాలయంలో స్వయం కృషిచే విద్యాపారంగతుడైనాడనీ, ఆ కవి విషాదాంత నాటకాలలో పురుషులు, కామెడీలలో స్త్రీలు ప్రాధాన్యం వహిస్తారనీ అమరేంద్ర అన్నారు.

డాక్టర్ యస్. మల్లికార్జునరావు కూడా విశ్వకవికి జోహారు అర్పించారు.

వందన సమర్పణతో సభ ముగిసింది.

అవినీతి నిర్మూలనకు సదాచార సమితులు: రాష్ట్రాలకునందాసూచన

పాటియాలా. మే 4 (పి.టి ఐ)

సమాజంలోని సర్వ అవలక్షణాలకు అవినీతి మూలకారణమనీ, అన్ని జీవన రంగాలలోనూ అవినీతిని నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వాలుతమరాష్ట్రాలలో "సదాచారసమితు"లనుఏర్పాటు చేయాలనీ కాంగ్రెస్ లోని సోషలిస్టు కార్యాచరణ ఫోరం సమావేశానికి అధ్యక్షత వహిస్తూ కేంద్రహోంమంత్రి శ్రీ గుల్జారిలాల్ నందా నిన్న సూచించారు.

కాంగ్రెస్ సంస్థ పట్ల ప్రభుత్వ పరిపాలనపట్ల ప్రజలలో తిరిగి విశ్వాసం ఏర్పడడానికి కాంగ్రెస్ వాదులు తిరిగి విప్లవాత్మక దృక్పథంతో పనిచేయాలనీ ప్రయివేట్ రంగం పనిచేస్తూ వుండాలి కానీ అది సోషలిస్టు లక్ష్యాలకు అనుగుణంగా వ్యవహరించేందుకు తగిన పరిస్థితులను సృష్టించాలనీ శ్రీ నందా అన్నారు.

కాంగ్రెస్ వాదులకు సోషలిస్టు సిద్ధాంతాలలో శిక్షణనిచ్చేందుకు ఒక నెలరోజుల వ్యవధి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయాలని పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ ప్రతాప్ సింగ్ కైరాన్ సూచించారు.

శ్రీ కె. డి మాలవియా మాట్లాడుతూ భారతదేశంలో కాశ్మీర్ విలీనీకరణ అంతిమ నిర్ణయమనీ, ఇక తిరగతోడడానికి వీలులేదనీ ఉద్ఘాటించారు.

పార్లమెంటరీ కమిటీల నియామకం

(ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి)

న్యూఢిల్లీ, మే 3

శ్రీ మొసలికంటి తిరుమలరావును సిబ్బంది సంఘాధ్యక్షుడుగా లోక్ సభ స్పీకర్ నియమించారు.

లోక్ సభకు చెందిన వివిధసంఘాలకు కూడా మరికొంతమంది ఆంధ్రప్రదేశ్ కు చెందిన సభ్యులు ఎన్నికయారు.

శ్రీ సి యల్ నరసింహారెడ్డి (స్వ), శ్రీ పి. వెంకటసుబ్బయ్య (కాం) ఉభయులూ పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో ఉన్నారు అంచనాల సంఘంలో శ్రీ బాకర్ అలీమీర్జా ఉన్నారు. ప్రభుత్వ యాజమాన్య సంస్థలపై ఏర్పడిన కమిటీకి శ్రీ ఎన్ జి రంగా ఎన్నికయారు కార్యక్రమ నిర్వహణ సలహా సంఘ సభ్యురాలుగా శ్రీమతి లక్ష్మీకాంతమ్మ వ్యవహరిస్తున్నారు [illegible] సంఘానికి శ్రీమతి యశోదారెడ్డి ఎన్నికయారు. ప్రభుత్వ హామీల పరిశీలక సంఘంలో శ్రీ జి ఎలమందారెడ్డి ఉన్నారు సబార్డినేట లెజిస్లేషన్ కమిటీలో శ్రీ హరిశ్చంద్ర హెడా సభ్యుడుగా ఉన్నారు.

సైప్రస్ లో తిరిగి సంఘర్షణలు

నికోసియా మే 3

సైప్రస్ లో అక్కడక్కడ, మత కలహాలకు సంబంధించిన కొత్తసంఘటనలు జరిగినట్టు ఒకప్రక్క వార్తలు వస్తుండగా నేటి ఉదయం "ఈస్టర్" సందేశ సూచకగా నికోసియా చర్చిలో గంటలు మ్రోగాయి.

రాయల్ సైనిక స్త్రీ దళాలపై థియోడరస్ గ్రామంలో 6 సార్లు కాల్పులు జరిపారని సమితి ప్రతినిధి చెప్పారు. వారు హెచ్చరిక చేయగా ఆ కాల్పులు ఆగిపోయాయని ఐతే అదే చౌక్ వద్దకు వెడుతు గ్రీక్ సైప్రియట్ పోలీసులపై కాల్పులు జరిపారని చెప్పారు.

ఈ సందర్భంలో యిద్దరు గ్రీక్ సైప్రియట్లను పోలీసులు నిర్బంధించారు.

ఇంకా అనేక ప్రాంతాలలో మరతుపాకులతోను, రైఫిల్స్ తోను కాల్పులు జరుపుకున్నట్టు వార్తలు వస్తున్నాయి.

నాటకం జయప్రదం కావాలంటే...

రచయిత దర్శకుడు. నటులు పరస్పరం అర్థం చేసుకోవాలని గోపాలస్వామినాయుడుఅభిభాషణ

(ఆంధ్రభూమి ప్రతినిధి)

హైదరాబాద్, మే 4

ఒక నాటకం జయప్రదం కావాలంటే దాని రచయిత, నటుడు దర్శకుడు, ఒకరినొకరు పరస్పరం అర్థం చేసుకొని సహకరించుకొన వలసిన అవసరమెంతైనా వున్నదన్న అభిప్రాయాన్ని ఆంధ్రా యూనివర్శిటీ మాజీ రిజిస్ట్రార్ శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి నాయుడు ఇక్కడ వ్యక్తం చేసారు.

శ్రీ గోపాలస్వామి నాయుడు స్థానిక కళావాణి సాంస్కృతిక సంస్థకు మొన్న ప్రారంభోత్సవం చేస్తూ నాటకరచన నటన, దర్శకత్వం విషయాలలో ఎదురయ్యే ఇబ్బందులను సమస్యలను ప్రస్తావించి నాటక రచయిత నటుడు, దర్శకుడు మధ్య నెలకొనే సన్నిహితమైన సుహృద్భావ సంబంధాలద్వారా ఇవి పరిష్కారం కాగలవన్నారు. నాటకరంగంలో ఈ వాతావరణాన్ని సృష్టించడానికై నాటక సంస్థలు కృషిచేయడానికి ముందుకు రావాలన్నారు అంతకు ముందు శ్రీ వెంకటేశ్వరరావు శ్రీ గోపాలస్వామికి ఇతర ప్రముఖులకు స్వాగతంచెప్పి 'కళావాణి' లక్ష్యాలను ఆశయాలను వివరించారు.

కళావాణి ప్రారంభోత్సవం సందర్భంలో విజయవాడ ర.స.న సమాఖ్య బృందం సభ్యులు శ్రీ గొల్లపూడి మారుతిరావు రచించిన 'రాగరాగిణి' తెలుగు నాటకాన్ని రవీంద్రభారతిలో ప్రదర్శించారు.

కొండజాతి ప్రాంతాలలో సహకార సంఘాల అభివృద్ధికి సంకల్పం

న్యూఢిల్లీ మే 3

కొండజాతి ప్రాంతాలలో సహకార సంఘాలను అభివృద్ధి పరచటానికి వెంటనే చర్యలు తీసుకోవాలని తలంచారు. 1964-65 సంవత్సరంలో కొండజాతి ప్రాంతాలలోని 19 అభివృద్ధి బ్లాకులలో సేవాసహకార సంఘాలనూ అటవీ కార్మిక సహకార సంఘాలనూ. కార్మిక కాంట్రాక్ట్ సంఘాలనూ ప్రాథమిక మార్కెటింగ్ సంఘాలనూ ఏర్పాటు చేసారు.

కొండ జాతి ప్రాంతాలలోని బ్లాకు లన్నిటిలోనూ సేవా సహకార సంఘాలూ. అటవీ సహకార సంఘాలు మొదలైనవాటిని తృతీయ ప్రణాళిక అంతంలోగా యేర్పాటు చేయాలని వెనుక జరిగిన తరగతులలో సహకారోద్యమాభివృద్ధికి సంబంధించిన నిర్వహణ బృందం సిఫారసు చేసింది. కొండజాతి ప్రాంతాలలోని అభివృద్ధి బ్లాకులకు [illegible] అదనపు వనరులూ, శిక్షణపొందిన సాంకేతిక సిబ్బంది లభ్యమవుతుండటంలో, వాటిలో సహకారసంఘాలను అభివృద్ధి పరచటానికి పరిస్థితులు అనుకూలంగా ఉంటాయని తలంచారు. కొండ జాతి ప్రాంతాలలోని వివిధ బ్లాకులలో 1885 సేవా సహకార సంఘాలను, 1885 అటవీ కార్మిక సహకార సంఘాలనూ. 734 కార్మిక కాంట్రాక్టు సంఘాలనూ 242 మార్కెటింగు సంఘాలనూ ఏర్పాటుచేయాలని ఆ నిర్వహణబృందం సూచించింది.

తృతీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఇంకా మిగిలిన రెండేళ్ళలోనే ఈ సహకారాభివృద్ధి కార్యక్రమాన్ని అమలుపరచవలసివున్నందున, నిర్వహణ బృందం చేసిన సిఫారుసులన్నిటినీ అమలు అమలు పరచటానికి వీలుగాదు. అందుచేత, కొండ జాతి ప్రాంతాలలోని 119 బ్లాకులలోనూ, ఆరంభంలో సేవా సహకార సంఘాలనూ, అటవీ కార్మిక సంఘాలనూ కొన్నింటిని యేర్పాటు చేస్తారు. 1965-66లో మిగిలిన సంఘాలను పూర్తి చేస్తారు. మరో 212 బ్లాకులలో ఈ కార్యక్రమాన్ని అమలు పరుస్తారు. కొండజాతి ప్రాంతాలలో1965-66లో యేర్పాటు చేసే బ్లాకులలో ఆ తర్వాత సంవత్సరంలో ఈ కార్యక్రమం ప్రవేశ పెట్టుతారు.

1964-65లో కనీసకార్యక్రమాన్ని నిర్వహించటానికి అవసరమైన ఆర్థిక వనరులుచాలా బ్లాకులలో లభ్యపడ వచ్చును.

నిర్మల్ లో మహిళలకు కుట్టుపని శిక్షణ కేంద్రం

నిర్మల్, మే 3

రాష్ట్ర మహిళా సంక్షేమం శాఖ డైరెక్టర్ కుమారి బి. శకుంతల నిర్మల్ పంచాయతీ సమితి గ్రామాలలో ఇటీవల పర్యటించారు. ఈ సందర్భంలో ఆమె చించోలి మహిళా మండలిని తనిఖీచేసి మండలిద్వారా జరుగుతున్న కృషినిపరిశీలించారు. గ్రామంలో ఏర్పాటైన కుట్టుపని శిక్షణ కేంద్రానికి కుమారి శకుంతల ప్రారంభోత్సవం చేసారు. మండలి అధ్యక్షుడు శ్రీమతి నల్లరామవ్వ సంస్థ నివేదికను సభలో చదివారు ఆదిలాబాద్ లోని మహిళా [illegible] వహించారు ముఖ్య సేవిక శ్రీమతి అక్రాల్ ఫతీమా వందన సమర్పణ చేసారు.

ఆధునిక పద్ధతులద్వారా అధికోత్పత్తి సాధన

రైతులకు శ్రీ రామ్ గోపాల్ రెడ్డి విజ్ఞప్తి

(ఆంధ్రభూమి విలేకరి)

కరీంనగర్, మే 3

అధిక వ్యవసాయోత్పత్తి సాధనకై మేలురకమైన పరికరాలనూ, విత్తనాలనూఎరువులనూ ఉపయోగించాలని రైతులకు అసెంబ్లీ సభ్యుడు శ్రీ రామ్ గోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేసారు.

బెజ్జంకి వద్ద జిల్లా పౌర సంబంధాల శాఖవారు ఇటీవల నిర్వహించిన సభలో ప్రసంగిస్తూ ఆయన పైవిధంగా అన్నారు.

నుస్తులాపూర్ పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ వి. ముకుందరెడ్డి, బెజ్జంకి గ్రామ పంచాయతీ అధ్యక్షుడు శ్రీ ఆర్. నరసింహులు కూడా ప్రసంగించారు. జిల్లా పౌర సంబంధాలశాఖాధికారి వందన సమర్పణ చేసారు.

దరల పెరుగుదలకు ప్రభుత్వానిదే బాధ్యత

వ్యాపారస్తులపై విమర్శలు సహేతుకంకావని తమిళనాడ్ స్వతంత్రపార్టీ నాయకుని వాదం

వేలూరు, మే 3

భూముల గరిష్ఠ పరిమితిని నిర్ణయించే చట్టాలతోసహా సుమారు 124 ప్రభుత్వ శాసనాలను గత 15సంవత్సరాలలోను రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టుత్రోసి పుచ్చినందువల్ల, అప్పుడు రూపొందించిన శాసనాలన్నిటినీ సరిదిద్దుకోవడానికే ప్రభుత్వం యీ రాజ్యాంగం 17వ సవరణ బిల్లును తీసుకువచ్చిందని తమిళనాడ్ స్వతంత్రపార్టీ ఉపాధ్యక్షులు శ్రీ కె సుందరం అన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వతంత్రపార్టీ మహాసభలలో అధ్యక్షోపన్యాసం చేస్తూ శ్రీ సుందరం పైవిధంగా అన్నారు.

ప్రభుత్వ విధానాలవల్లనే ముఖ్యావసర వస్తువుల ధరలు పెరిగాయని. ఐతే దాని బాధ్యతను వ్యాపారస్తులమీదకు నెట్టివేసిందని ఆయన అన్నారు.

అంతకుముందు ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ కోమారెడ్డి జావయ్యచౌదరి ప్రతినిధులకు అధ్యక్షులకు స్వాగతం చెప్పారు. సుమారు 600 మంది ప్రతినిధులు మహాసభలకు హాజరైనారు.

దక్షిణ అరేబియాలో తిరుగుబాటు తెగపై బ్రిటిష్ విమానాలదాడి

టర్ మీర్ (దక్షిణ అరేబియా) మే 3

యెమన్ రిపబ్లిక్ సరిహద్దుకు సమీపంగా రడ్ ఫాన్ పర్వతాలలో తిరుగుబాటుదారుల స్థావరాలపై బ్రిటిష్ విమానాలు, శతఘ్ని దళాలు నేడు అగ్నివర్షం కురిపించాయి.

స్థానిక తెగలజాతులకు చెందిన ఈ తిరుగుబాటుదారులు "రెడ్ వుల్వ్స్" అని వ్యవహరిస్తుంటారు.

ఈ తెగలవారు కనీసం 700 మంది సాయుధులైఉన్నారని బ్రిటిష్ అరబ్ దళాల సంయుక్త సైనికాధికారి బ్రిగేడియర్ రాబర్ట్ లూయీ హార్గ్రోవ్స్ పేర్కొన్నారు.

ఇదిఇలా ఉండగా. దక్షిణ అరేబియా ఫెడరల్ ప్రభుత్వ అభ్యర్థనపై బ్రిటన్ 600 మంది సైనికులను ఏడెన్ కు విమానంలో చేరవేస్తున్నది.

హిందూమహాసభ 48వ సమావేశం

విప్లవాత్మకమైనదని పాటిల్ ప్రకటన

షోలాపూర్ (మహారాష్ట్ర), మే 4

భారతదేశానికి వ్యతిరేకంగా చైనా పాకిస్తాన్ నులు కొనసాగిస్తున్న సంయుక్త కార్యక్రమాలు, తూర్పు పాకిస్తాన్ లోని అల్పసంఖ్యాక వర్గాల పట్ల జరిపిన అత్యాచారాల పర్యవసానంగా భారతదేశానికి శరణార్థులు భారీయెత్తున తరలిరావటం షేక్ అబ్దుల్లా విడుదల, ఆయన ప్రసంగాలు మొదలైన సంఘటనల దృష్ట్యా, రాబోయే 48వ అఖిలభారత హిందూ మహాసభ సమావేశం తప్పకవిప్లవాత్మకమైందని నిన్న హిందూమహాసభ నాయకుడు శ్రీ వి. ఆర్. పాటిల్ ఇక్కడ చెప్పారు.

ఈ మాసంలో ఇక్కడ జరుగనున్న మహాసభ సమావేశానికి ఆహ్వాన సంఘాధ్యక్ష స్థానం వహిస్తున్న శ్రీ పాటిల్ ప్రసంగిస్తూ శ్రీ సత్యనారాయణ్ బనర్జీ (కలకత్తా) అధ్యక్షతన జరిగే ఈమహాసభలో దాదాపు రెండువేల మందిప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. మాజీ అధ్యక్షులైన శ్రీ వి. డి. సావర్కర్, పార్లమెంటు సభ్యుడు శ్రీ ఎన్. సి. ఛటర్జీ, ఆర్. ఎస్. ఎస్. నాయకుడు శ్రీ గోల్ వాల్కర్. ప్రభృతులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు. హిందూ మహాసభ సమావేశంతోపాటు అఖిల భారత హిందూ మహిళా సమావేశం కూడా జరుగుతుందని చెప్పారు.

బక్షిగులాంమహమ్మద్ ఢిల్లీ చేరిక

న్యూఢిల్లీ, మే 2

కాశ్మీర్ మాజీప్రధాని బక్షి గులామ్ మహమ్మద్ నేటి దినం ఇక్కడికి చేరిన తరువాత కేంద్రమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రిని సాయంత్రంవేళ కలుసుకున్నారు

షేక్ అబ్దుల్లాతో కూడా వచ్చిన మీర్జాఅఫ్జల్ బేగ్, శ్రీ జయప్రకాశ్ నారాయణ్ కూడా విడివిడిగా శ్రీ లాల్ బహాదుర్ శాస్త్రిని కలుసుకుని ఆయనతో సంభాషించారు.

అతివృష్టివల్ల లావోస్ నాయకుల చర్చలకు అంతరాయం

వియన్ టియెన్, మే 3

లావోస్ మిశ్రమ మంత్రివర్గాన్ని సుస్థిరంచేసే నిమిత్తం పాథెట్ లావోస్ నాయకుడైన ప్రిన్స్ సోఫానవాంగ్ ను నేడు కలుసుకోవాలని సంకల్పించిన ప్రధాని సావన్నఫౌమాకు వియన్ టియెన్ లో కుంభవృష్టికారణంగాప్రయాణం సాధ్యపడలేదు.

దక్షిణాఫ్రికాపై బ్రిటన్, అమెరికావత్తిడిఅవసరం

సమితి పరిశీలకబృందం సభ్యుడు సర్ హ్యూఫుట్ సూచన

న్యూయార్కు, మే3

ప్రపంచంలో శ్వేతజాతులకు వర్ణజాతులకు మధ్య యుద్ధానికి దక్షిణాఫ్రికాలో అంకురార్పణ జరుగకుండాదక్షిణాఫ్రికా ప్రభుత్వంపై బ్రిటన్, అమెరికాలు వత్తిడి తీసుకురావాలని దక్షిణాఫ్రికా పరిస్థితులపై పోయిన నెల నివేదిక సమర్పించిన సమితి. పరిశీలక బృందం సభ్యుడు సర్ హ్యూఫుట్ నేడు సూచించారు.

జాతి వివక్షతా సమస్యలపై పరిశీలన జరిపే నిమిత్తంపూర్తి ప్రాతినిధ్యంతోకూడిన జాతీయ దక్షిణాఫ్రికా ప్రభుత్వం. సమ్మేళనాన్నిఏర్పాటు చేయాలని పరిశీలకబృందంనివేదికలోపేర్కొన్నది.

సర్ హ్యూఫుట్ టెలివిజన్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పరిస్థితి ఇలా కొనసాగడానికి వీలులేదని అమెరికా బ్రిటన్ లు చెప్పవలసిన తరుణం ఆసన్నమైనదని అన్నారు.

నిల్వఉన్న పొగాకు అమ్మకానికి చర్యలు

రాజ్యసభలో మంత్రి ప్రకటన

(ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి)

న్యూఢిల్లీ మే 3

తమవద్దగల వాణిజ్యమైన పొగాకును అమ్మలేకుండా ఉన్నట్టు గుంటూరుజిల్లాలోని పొగాకు ఉత్పత్తిదారులు వినతిపత్రం సమర్పించినమాట నిజమేనని అంతర్జాతీయ వాణిజ్యమంత్రి శ్రీ మనూభాయ్ షా రాజ్యసభలో ధ్రువీకరించారు

పొగాకు నిల్వలను త్వరితగతిన ఎగుమతిచేసే యత్నంలో పొగాకు దిగుమతి చేసుకొనే రాజ్యాల ప్రతినిధులతో చర్చలు జరిపినట్టు శ్రీ ఎ డి మణి ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో మంత్రి పేర్కొన్నారు. ఉత్పత్తిదారులు తమ పొగాకును నిల్వచేసుకోవడానికి వీలుగా గిడ్డంగి సౌకర్యాలు సమకూర్చడానికి చర్యలు గైకొనడం ఆరంభించినట్టు కూడా ఆయన పేర్కొన్నారు.

కర్రగుజ్జు ఫ్యాక్టరీ స్థాపనకు సహాయం

కేంద్రమంత్రి హామీ

అలహాబాద్. మే4 (పిటిఐ)

చిన్నతరహా కాగితంమిల్లులు సంయుక్తంగా ఒక కర్రగుజ్జు ఫ్యాక్టరీని నిర్మించదలిస్తే దానికి ప్రభుత్వం సహాయపడుతుందని కేంద్ర ఉక్కు భారీపరిశ్రమల మంత్రి శ్రీ సి సుబ్రహ్మణ్యం నిన్న హామీఇచ్చారు.

నైనీ పారిశ్రామిక వాడలో ఒక కాగితంమిల్లుకు ప్రారంభోత్సవం జరుపుతూ ప్రభుత్వం కాగితం పరిశ్రమకు అవసరమైన ఒక కర్రగుజ్జు పరిశ్రమను స్థాపించాలన్న కోరికను ప్రస్తావించి ఆయనపై సూచనచేశారు.

చిన్న పరిశ్రమలవారు తమకు అవసరమైన ముడిపదార్థాల కొనుగోలు సరఫరా, నిల్వచేసుకోవడం, సాంకేతిక సహాయం సహకార పద్ధతిని ఒక ఉమ్మడి సంస్థద్వారా జరుపుకోవాలని కూడా శ్రీ సుబ్రహ్మణ్యం సూచించారు.

పి.యస్.పి.,సోషలిస్టు పార్టీల ఏకీకరణపై ఈవారంలోనిర్ణయం

న్యూఢిల్లీ మే 4

సోషలిస్టు ప్రజాసోషలిస్టు పార్టీల ఏకీకరణ విషయమై సంప్రదింపులు జరపడానికిగాను ఉభయ పార్టీలు నియమించిన ప్రత్యేక కమిటీలు ఈ నెల 7, 8 తేదీలలో ఢిల్లీలో సమావేశమై. ఏకీకరణకు సంబంధించిన వివరాలపై తుదినిర్ణయం గైకొంటాయి.

పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ, రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీల ప్రతినిధులను కూడా ఈ చర్చలకు ఆహ్వానించడం సంభవమని తోస్తున్నది

12 మంది ఉద్యోగులను హత్యచేసిన నేరంపై ముగ్గురికి మరణశిక్ష

షిల్లాంగు, మే 4 (పి. టి. ఐ)

చాయంగుతాజువద్ద 11 నెలల్క్రితం 12 మంది ప్రభుత్వోద్యోగులను హత్యచేశారనే నేరంపై ముగ్గురికి మరణశిక్ష, ఎనిమిదిమందికి యావజ్జీవఖైదు ఒకనికి 7 సంవత్సరాల కఠినశిక్ష, మరి ముగ్గురికి మూడేళ్ళ కఠినశిక్ష విధిస్తూ నేఫాలోని కామెంగు ఫ్రాంటీర్ డివిజన్ సెషన్సుజడ్జి. అదనపురాజకీయాధికారి, అయిన శ్రీ సాంట్ కారాజ్ గత నెల 28వ తేదీన తీర్పు చెప్పారు. ~~ఒక వ్యక్తిని విడుదలచేసారు.~~

ఏడేళ్ళకంటె ఎక్కువకాలం విధించిన శిక్షనూ మరణశిక్షనూ అస్సాం, నాగాలాండ్ హైకోర్టు ధ్రువీకరించవలసి వున్నది.

మాస్కోలో మే దినోత్సవాలు

మాస్కో. మే 3

ప్రపంచమంతటా మే దినోత్సవం జరుపుకొన్నది తొలిసారిగా చైనా, రష్యాలు పరస్పరం ప్రతినిధివర్గాలను పంపుకోలేదు. అయితే మాస్కోలోని చైనీస్ రాయబారి వాన్ జులీ మాత్రం రెడ్ స్క్వేర్ లో జరిగిన విన్యాసాలకు హాజరైనారు. సంప్రదాయ సిద్ధంగా జరుగుతూ వస్తున్న ఈ సైనికశక్తి ప్రదర్శన కవ్వాతులో రష్యా ఒక రకం జంటరాకెట్ల ఆయుధాన్ని కొత్తగా ప్రవేశపెట్టినది.

ఈ సందర్భంలో సైన్యానికిచ్చిన ఒక సందేశంలో రక్షణమంత్రి రోడిన్ మాలినోవ్ స్కీ సామ్రాజ్యవాదులు సోషలిస్టు దేశాలపై వ్యతిరేకంగా గనుక యుద్ధం ప్రారంభించినట్టయితే వారికి ఘోరపరాజయం తప్పదన్నారు.

'బ్లాక్ మనీ' వెచ్చించి ద్రాక్ష పెంపకం

పెద్ద తోటలువేయడం ఆంధ్రప్రదేశ్ లో 'ఫ్యాషన్'గా మారినదని శ్రీహెడా విమర్శ

(ఆంధ్రభూమి ప్రత్యేకప్రతినిధి)

న్యూఢిల్లీ, మే 3

ఆంధ్రప్రదేశ్ లో భారీఎత్తున ద్రాక్ష తోటలను పెంచాలనే ఉబలాటాన్ని శ్రీ హరిశ్చంద్ర హెడా (కాంగ్రెస్ నిజామాబాద్) లోక్ సభలో విమర్శించారు. పన్నులను ఎగవేయడానికి బ్లాక్ మనీ"తో ప్రజలుదానికి పాల్పడుతున్నారు అనిఅన్నారు.

తన స్వగ్రామంలోని యీ కొత్త పరిణామంఒక కుతంత్రంగాకనిపిస్తోందని ఆయన అన్నారు. అక్కడ ప్రజలుద్రాక్షతోటల పెంపకాన్నిప్రారంభించారని, మరి పెద్దతోటలు ఉండటం ఒక విధమైన "ఫ్యాషను"గా తయారైనదని ఆయన అన్నారు.

పన్నుల విధానపు చట్టాల బిల్లుపై ప్రసంగిస్తూ శ్రీ హెడా పై విధంగా అన్నారు.

ఆ పరిశ్రమ మంచిదే, జాగ్రత్తతో, కష్టపడి పనిచేసినట్టయితే ఎకరానికి వెయ్యి రూపాయలనుండి 5వేల రూపాయల వరకు సంపాదించవచ్చు, ఐతే కొంతమంది తమరహస్యసొత్తును (బ్లాక్ మనీ) చెలామణీలోకితీసుకురావడానికే యీ ద్రాక్షతోటలను చేపడుతున్నారని నాఅనుమానం అని ఆయన అన్నారు.

ద్రాక్షతోటలను పెంచుతున్నవారిలో చాలామంది అనుభవం లేనివారేనని. వ్యవసాయమంటే వారికి అభిరుచిలేదని ఆయన చెప్పారు.

వ్యవసాయంపై పన్ను విధించరు కాబట్టి, పన్నులను ఎగవేయటానికి ఇది ఒకమార్గమని శ్రీ హెడాఅన్నారు.

కర్నూలు జిల్లాలోని 183 గ్రామాలలో పూర్తిగా పన్నుల వసూళ్ళు

(ఆంధ్రభూమి విలేకరి)

కర్నూలు మే 3

కర్నూలు జిల్లాలో పన్నుల వసూళ్ళ నిమిత్తం ఏర్పాటైన సిబ్బంది 27 పెద్ద పంచాయతీలలోను 884 [illegible]డవ తరగతి పంచాయతీలలోను పన్నులను వసూలు చేసారు 11 పెద్ద పంచాయతీలలోను 172 చిన్న పంచాయతీలలోను పన్నులు నూటికి నూరు పాళ్లు వసూలు అయినట్టు జిల్లా పంచాయతీ ఆఫీసర్ శ్రీ కె అంజనేయులు వెల్లడించారు.

కల్తీ నేరానికి జరిమానా

కర్నూలు పాలవ్యాపారి కె. వెంకటస్వామి అనువాని పాలలో 20 శాతం నీరు కలిపాడన్న ఆరోపణపై స్థానిక మొదటి తరగతి మేజిస్ట్రేట్ శ్రీ యం రంగారెడ్డి 125 రూపాయల జరిమానాను విధించారు. పాల వ్యాపారస్తుడు జరిమానాను చెల్లించాడు.

కళ్ళూరులో భూమికొనుగోలుకు మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం

(ఆంధ్రభూమి విలేకరి)

కర్నూలు, మే 3

కర్నూలు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గత నెల 29న మున్సిపల్ చైర్మెన్ శ్రీ పి.రామయ్య అధ్యక్షతన జరిగింది

అంతర్జాతీయ స్థానిక సంస్థల మహాసభకు. మున్సిపల్ కమీషనర్, మరో యిద్దరు కౌన్సిలర్లను ప్రతినిధులుగా పంపడానికి సమావేశం నిశ్చయించింది

ఈ ప్రతినిధులు తొమ్మిది వారాల పాటు యూరప్ లోను జర్మనీ నెదర్లాండ్స్ స్వీడన్ దేశాలలో పర్యటించగలరు ఈమహాసభ ప్రతినిధులు గా కమీషనర్ కాక ఒక కౌన్సిలర్ ను పంపాలన్న ఆదేశం వచ్చినప్పటికీ కౌన్సిల్ తీసుకొన్న పై నిర్ణయం దృష్ట్యా ప్రతినిధులెవరు సభకు వెళ్ళడానికి వీలులేని పరిస్థితి ఏర్పడ్డట్టు తెలుస్తున్నది.

స్వల్ప వేతనాసరులకు గృహావసతి కల్పించడానికి కళ్ళూరు గ్రామంలో కొంతభూమిని ఖరిదుచేయడానికి సమావేశం నిశ్చయించింది.

ఆంధ్ర శిల్పకళా పరిషత్తు ఎన్నికలు

(ఆంధ్రభూమి విలేకరి)

తెనాలి. మే 4

ఆంధ్రశిల్పకళా పరిషత్తు సాధారణ సభ్య సమావేశం మంగళగిరివద్ద నున్న శ్రీ తత్వానంద శిల్పాశ్రమంలో గత నెల 29న జరిగినది. సభకు శిల్పకళాకోవిద శ్రీ స్వర్ణ సుబ్రహ్మణ్యకవి అధ్యక్షత వహించారు. కార్యదర్శి శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు పరిషత్తు నేటివరకు చేసినకృషిని, ప్రకటించిన గ్రంథములను గూర్చి వివరించారు ప్రస్తుతం శ్రీ స్వర్ణ సుబ్రహ్మణ్య కవి వ్రాసిన "భారతీయమహాశిల్పం" అనే 16 భాగాల బృహద్గ్రంథ ముద్రణకు పరిషత్తు ప్రయత్నిస్తున్నదనీ. ఈ పరిషత్తును మొన్న ఫిబ్రవరి మాసములో సొసైటీల ఆక్టుక్రింద రిజిస్టరుచేయించినామన్నారు శ్రీస్వర్ణ సుబ్రహ్మణ్యకవి శ్రీ చిర్రావూరి నాగభూషణాచార్యులు శ్రీనల్లపాటి సుబ్బారావు పరిషత్తుఇంతవరకూ చేసిన సేవనుగూర్చి తమ హర్షమును వెలిబుచ్చుతూ కళాసాహిత్య ఆరాధకులందరూ సభ్యులుగా చేరి పరిషత్తును బలిష్టముచేయవలసినదనివిజ్ఞప్తి చేసినారు. పరిషత్తుకు (సాధారణ) 13 మంది నూతనసభ్యులను చేర్చుకొనడం జరిగింది. ఈ దిగువ సభ్యులతో కార్యవర్గము ఏర్పాటైనది.

శ్రీ స్వర్ణ సుబ్రహ్మణ్యకవి (అధ్యక్షుడు) శ్రీ నల్లపాటి సుబ్బారావు (ఉపాధ్యక్షుడు) శ్రీ చిర్రావూరి నాగభూషణాచార్యులు (గౌరవాధ్యక్షుడు) శ్రీ కొండూరి వీర రాఘవాచార్యులు (కార్యదర్శి) శ్రీ పులివర్తి విజయభూషణశర్మ. పామర్తి నాగభూషణశర్మ (సహాయకార్యదర్శి) శ్రీ మంగళాపురపు దక్షిణామూర్తి (కోశాధిపతి) శ్రీ కొలకలూరి కోటయాచార్యులు శ్రీ పణితపు మార్కండేయులు. శ్రీ పూసపాటి సాంబయ్య, శ్రీ దేవు మహామయాచార్యులు, శ్రీ వెల్లటూరి పూర్ణానంద శర్మ శ్రీ సూర్యదేవర సంజీవదేవ్, శ్రీ వంగిపోలు ఆదిశేషయ్య, శ్రీ సంజీవదేవు, శ్రీ దురిసేటి రామాచార్యులు గారలు రాజాలక వ్రాసిన సందేశములు చదువబడినవి.

పరిషత్తును ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమికి అనుబంధసంస్థగా చేయడానికి, భారత మహాశిల్పగ్రంథ ముద్రణకూ వలసిన చర్యలు తీసుకొనవలసినదని కోరుతూ సమావేశంతీర్మానించినది.

పరిశోధనలకై 19 మందికి ఆర్థిక సహాయం

యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ నిర్ణయం

న్యూఢిల్లీ మే 3

పరిశోధనా కృషిచేసే ఉపాధ్యాయులకు 1964-65 వ సంవత్సరంలో ఆర్థిక పథకం క్రింద అవార్డులు యివ్వటానికి మానవతా శాస్త్రంలోను, సాంఘిక శాస్త్రాలలోను 91మంది ఉపాధ్యాయులను విశ్వవిద్యాలయ గ్రాంట్సు కమిషన్ నిర్ణయించింది.

ఉపాధ్యాయులలో పరిశోధనా కృషిని ప్రోత్సహించే నిమిత్తంగ్రాంట్సు కమిషను ఈ పథకాన్ని రూపొందించింది.

గోదావరిపై వంతెన నిర్మాణానికి కేంద్రంవారు వెంటనే అందజేయాలి

శ్రీమతి అమ్మన్నరాజా విజ్ఞప్తి

(ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి)

న్యూఢిల్లీ, మే, 4

గోదావరిపై రైలు రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే కోటిరూపాయలు అందజేయాలని శ్రీమతి అమ్మన్నరాజా ఇటీవల రాజ్యసభలో అన్నారు.

రైలు బ్రిడ్జితో పాటు రోడ్డుబ్రిడ్జి కూడా నిర్మించే పక్షంలో అదనంగా రెండుకోట్ల రూపాయలు వ్యయం కాగలదు కాబట్టి ఈ వంతెన నిర్మాణానికి కోటిరూపాయల వరకు విరాళం ఇవ్వవలసినదిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వమూ, ప్రజలుకూడా కేంద్రాన్ని కోరుతున్నారని ఆమె అన్నారు.

ఈ సూచనపట్ల ఆర్థికమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి విముఖత చూపినట్టు వచ్చిన వార్తను ప్రస్తావిస్తూ, ఆంధ్రులకు ఈసౌకర్యం కల్పించకుండా నిరాకరించరాదని ఆమె అన్నారు.

న్యాయమైన ఈ అభ్యర్థనను నిరాకరించడం అనుచితమేకాక, దానివల్ల రాష్ట్ర ప్రజలకు వేదన కలిగించినట్టు అవుతుందని ఆమె అన్నారు. ఈ వంతెన నిర్మాణంవల్ల ఒక్క ఆంధ్రులకే కాక యావత్తుదేశానికి ప్రయోజనం లభిస్తుందని ఆమె అన్నారు.

పోచంపాడు ప్రాజెక్టుపై కేంద్ర జల విద్యుచ్ఛక్తి కమిషన్ పరిశీలన

(ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి)

న్యూఢిల్లీ, మే 3

కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖ తోటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తోటీ చర్చలు జరుపుతూ పోచంపాడు ప్రాజెక్టు అమలు గురించి కేంద్ర జలవిద్యుచ్ఛక్తి కమిషన్ పరిశీలిస్తున్నదనీ, కేంద్ర ప్లానింగ్ మంత్రి శ్రీ బి. ఆర్. భగత్ గత గురువారంనాడు లోక్ సభలో తెలిపారు.

ఈ పరిశీలన పూర్తికాగానే ప్రాజెక్టు అమలుకు అంగీకరించటం జరుగుతుందని శ్రీ లక్ష్మీదాసు అడిగినప్రశ్నకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో మంత్రి పేర్కొన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి మరికొంత సమాచారం రావలసి ఉన్నది.

శ్రీశైలం ప్రాజెక్టును అమలు పరచడానికి ప్లానింగ్ కమిషన్ ఈ వరకే ఆమోదించినదని శ్రీ భగత్ అన్నారు.

రాష్ట్ర స్వతంత్రపార్టీ సర్వసభ్య సమావేశం

ఏలూరు. మే 3

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వతంత్రపార్టీ మహాసభల సందర్భంలో, స్థానిక కళాక్షేత్రం హాలులో, రాష్ట్ర స్వతంత్ర పార్టీ సర్వసభ్య సమావేశం నిన్న జరిగింది.

మొన్న రాత్రి పార్టీ కార్యనిర్వాహక వర్గం ఆమోదించిన ముసాయిదా తీర్మానాలను, సర్వసభ్య సమావేశం పరిశీలించింది.

రాష్ట్ర పార్టీ అధ్యక్షులు శ్రీ గౌతు లచ్చన్న, సమావేశానికి అధ్యక్షత వహించారు.

నగరంలో హనుమజ్జయంతి

హైదరాబాద్. మే 4

కామాటీపుర, బేగూన్ దూద్ బావులిలో శ్రీ పాతాళ వీరాంజనేయుని ఆలయంలో గతనెల 28వతేదీ వరకు హనుమజ్జయంత్యుత్సవాలు మహావైభవంగా జరిగాయి. ఈ సందర్భంలో రథోత్సవం సంగీత కచేరీలు జరిగినవి

ఉత్సవాల ఆఖరురోజు ఆరోగ్యశాఖ అధ్వర్యాన మలేరియా మొదలైన వ్యాధులను నిరోధించడానికి తీసుకోవలసిన చర్యలకు సంబంధించిన చలనచిత్రాన్ని ప్రదర్శించారు

లాల్ దర్వాజా మున్సిపల్ గ్రౌండ్ వద్దఉన్న స్వామీ వివేకానంద గ్రంథాలయం అధ్వర్యాన, హనుమజ్జయంత్యుత్సవం సందర్భంలో వివిధ కార్యక్రమాలు జరిగినవి.

వాణిజ్య భూమి

ఆజమ్ జాహి మిల్స్ వాటాల ధర స్వల్పంగా తగ్గుదల

హైదరాబాదు, మే 4

నేడు హైదరాబాదు స్టాక్ ఎక్స్ఛేంజిలో మందకొడిగా ప్రారంభమైన ఈ వారం వ్యాపారంలో ఒక్క ఆజమ్‌జాహి మిల్స్ వాటాలలోనే వ్యాపారం జరిగింది.

ఆజమ్‌జాహి మిల్స్‌వాటాలధర గత ముగింపు ధర 52-00 నుండి 2 రూపాయలు తగ్గి 50-00, వద్ద ముగిసింది.

ముగింపు ధరలు (మే4)

ఆర్డినరి:- ఆజంజాహి 50-00;డి.బి ఆర్. 78-00; ఎం. ఎస్.కె. 1-50; సిర్‌సిల్క్ 8-50; ఉస్మాన్ షాహి. 42-00; సూర్యలక్ష్మి 10-00; ఎమ్మిగనూర్ స్పిన్నింగ్ 50-00; సిర్పూర్ పేపర్ 12-37; కెమికల్ ఫార్మస్యూటికల్ 23-00; కెమికల్ ఫెర్టిలైజర్సు 9-00; బయోకెమికల్ 4-06; నిజాం సుగర్ 55-00! సింగరేణి 9-75; వజీర్ సుల్తాన్ 35-37; తుంగభద్రా ఇండస్ట్రీస్ 9-00; రోలర్ ఫ్లోర్ 4-81; ఆస్‌బెస్టాస్ సిమెంట్స్ 22-00, ఇండియన్ డెటొనేటర్స్ 100-00, హైదరాబాదు పాటరీస్ 12-00. పన్యం సిమెంట్స్ 100-00, ఆటోఫిన్ లిమిటెడ్ 50-00, ఆల్విన్ మెటల్స్ 12-00, కన్‌స్ట్రక్షన్ 31-00, మో పెడ్స్ ఇండియా 5-00.

ప్రిఫరెన్స్‌వాటాలు:- నిజాంసుగర్ 5 శాతం 18-10, నిజాం సుగర్ 4 శాతం 14-30, సిర్పూర్ పేపర్ 6 శాతం 84-25, సిర్‌సిల్క్ 6 శాతం 125-00. వజీర్ సుల్తాన్ 7 శాతం 95-00, పన్యం సిమెంట్ 9 3 సిమెంట్ 100-00, ఎమ్మిగనూర్ స్పిన్నింగు 9.3 శాతం 50-00. సూర్యలక్ష్మి 9.5 శాతం 10-00, ఎన్. ఎస్. రైల్వే 5 శాతం 210-00, ఎన్. ఎస్. రైల్వే 6 శాతం 224-00.

సెక్యూరిటీలు:- ఆంధ్రప్రదేశ్ రుణాలు రుణాలు 4 1/2 శాతం (1974) 99-31 4 1/4 శాతం ((1970) 98-12, 4 1/4 శాతం (1972) 97-75 4 శాతం (19-67) 97-00, (1968) 97-00, (1969) 97-00, (1971) 96-50.

హైదరాబాదు స్టేట్ రుణాలు 4 శాతం (1967) 97-00; (1968) 97-00.

విద్యుచ్ఛక్తి బాండ్లు:- ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి బాండ్లు 4 1/4 శాతం 1970) 92-00.

ఇండియన్ ఐరన్ 24-68.

షేక్ షైర్స్:- సెంచరి 606-50; కోహినూర్ 332-50; స్టాండర్డ్ 632-00; స్వదేశి 240-00:బొంబాయి డైయింగు 61-40: టాటా మిల్స్ 52-00

మిశ్రమ జాబితా:- నేషనల్ రేయాన్స్ 35-50 ప్రీమియర్ కన్‌స్ట్రక్షన్ 161-50; టాటా ఇంజనీరింగు 293-00: వోల్టాస్ 254-50; బేలాపూర్ సుగర్స్ 216-50; బొంబాయి బర్మా 58-00; సిండియా స్టీమ్14-52; ప్రీమియర్ ఆటో 99-50; టాటా కెమికల్ 17-84: టాటాఆయిల్స్ 58-70; ఇండియన్ డైస్టఫ్ 266-22.

సెక్యూరిటీల ముగింపు శాపీగాఉంది.

నూనెగింజల మార్కెట్

బొంబాయి, మే 4

నేడు బొంబాయి నూనె గింజల మార్కెట్‌లో వ్యాపారం మందకొడిగా ఉంది. తక్కువ స్థాయిలో ప్రారంభమైన ఆముదాల ధర తరువాత కొంచెం పెరుగుదల చూపింది. వేరు సెనగ నిర్లక్ష్యం చేయబడింది. అవిసెలలో వ్యాపారం శాపీగా ఉంది. మొత్తం మీద ఆముదాలలో 5 వేల క్యాండీలు వ్యాపారం జరగగా వేరుశెనగలో వ్యాపారం స్వల్పంగా జరిగింది.

ఆముదాలు (జూన్) ప్రారంభం 173-75 ముగింపు 174-62.

వేరు సెనగ (జూలై) ప్రారంభం 239-50; ముగింపు 239-62;

వేరు సెనగ తెలకపిండి ప్రారంభం 451-50 ముగింపు 457-00.

అవిసెలు (జూన్) ముగింపు 42-56

హైదరాబాదు

(మే 4, వేరుసెనగనూనె జూలై-ఆగస్టు) వేరుసెనగ తెలకపిండి (జూన్) వ్యాపారం లేదు.

రెడీధరలు:-

ఆముదాలు 67-00. ఆముదం 18-50 వేరుసెనగ 87-00, వేరుసెనగ నూనె 21-00, వేరుసెనగ తెలకపిండి 29-00.

ప్రత్తి మార్కెట్

బొంబాయి, మే 4

నేడు బొంబాయి ప్రత్తి వాయిదా మార్కెట్‌లో వ్యాపారం తగ్గు స్థాయిలో జరిగింది. కొండర్లను తీసుకోవడానికి ఒక ప్రముఖ వ్యాపారి విముఖంగా ఉండడమే ఈ తగ్గుదల ధోరణికి కారణమని చెప్పబడుచున్నది. మొత్తం మీద 15 వేల బేళ్ళ వ్యాపారం జరిగింది.

బి.సి.సి. మొగలాయీ జరిల్లా (ఆగస్టు) ప్రారంభం 717-50. ముగింపు. 718-75 (మే) ముగింపు 727-00.

రెడీధరల మార్కెట్‌లో వ్యాపారం నిశ్చలంగా ఉంది.

బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి

నేడు బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజిలో తగ్గుస్థాయిలో ప్రారంభమైన ధరలు మరింత తగ్గుదల చూపాయి తగ్గుస్థాయిలో పరిమితమైన మద్దతు లభించడంతో ముగింపు తగ్గుస్థాయిలో ఉండి కొన్ని ముఖ్యమైన కంపెనీల వాటాల ధరలు క్రిందటివారాంతంలోనిముగింపు ధరలకంటె కూడా తగ్గిపోయాయి.

స్టీల్స్ వాటాల ధరలు నిశ్చలంగా ఉన్నాయి. షేక్ షైర్స్‌లో సెంచరి, స్టాండర్డ్ వాటాల ధరలో అమ్మకం వత్తిడి లభించింది. మిశ్రమ జాబితాలో నేషనల్ రేయాన్స్. హింద్ మోటర్స్, టాటా ఇంజనీరింగ్, వోల్టాస్ వాటాలలో స్వల్పంగా బేరాలు సాగాయి నగదు జాబితా నిశ్చలంగాఉంది.

ముగింపు ధరలు (మే 4)

స్టీల్స్:- టాటా ఆర్డినరి 148-72;

నగర మార్కెట్

కొత్తూరి సీతయ్య గుప్త

ఫోన్ : 41255

100 కిలో గ్రాముల తూకం

సోమవారం 4-5-64

సన్నబియ్యం	—	—
తెల్ల జొన్నలు	52-00	56-00
చప్పి జొన్నలు	42-00	46-00
పచ్చ జొన్నలు	43-00	44-00
పసుపు	110-00	138-00
పెద్ద కందులు	82-00	83-00
ఎర్ర కందులు	74-00	79-25
పెసలు	70-00	74-00
మినుములు	65-00	70-00
సెనగలు	64-50	35-00
ఉలవలు	36-00	39-00
బెల్లం	55-00	60-00
మిర్చి	160-00	210-00
కొత్త చింతపండు	73-00	85-00
ఉల్లిగడ్డ	10-90	15-00
గోధుమలు	75-00	85-00
ఎం. గోధుమలు	—	—
కుసుమలు	57-00	60-50
నువ్వులు	125-00	140-00
యిలాతివలుకు	82-00	92-00
పెద్దయిలాతి	120-00	122-00
ఆముదాలు	66-00	67-50
పత్తి గింజలు	38-00	42-00
నూనె	20-75	—
పెద్ద కందిపప్పు	106-00	110-00
చిన్న కందిపప్పు	100-00	103-00
మినప పప్పు	92-00	94-00
ఇలాతికాయ	—	—
పెసర పప్పు	105-00	108-00
సెనగ పప్పు	75-00	77-00
సిరిసెనగ పప్పు	88-00	89-00
లంక పప్పు	74-00	—
ధనియాలు	165-00	175-00

బొంబాయి మార్కెట్

సోమవారం మే 4

బులియన్ 'వెండి రెడి	260-00
పుదీన	86-00
పాదరసం	2125
కర్పూరం	30-00
లవంగాలు	295-00

నూనెగింజల రెడి

వేరుసెనగ పెద్దది	53-50
నిజాం	54-00
కోరమాండల్ రెడి	56-00
అవిసె పెద్దవి	43-50
చిన్నవి	42-00
ఆముదాలు (మద్రాసు)	34-37
పెద్దవి	33-75
వేరుసెనగనూనె రెడి	20-25
అవిసె నూనె	17-70
ఆముదం మొదటిరకం	16-25
రెండవ రకం	13-90
కొబ్బరినూనె	27-87
మిరియాలు	180-00

ఆంధ్రాఫౌండ్రీ & మెషిన్ కంపెనీ లిమిటెడ్

28, సరోజినీదేవిరోడ్, సికింద్రాబాద్ 26

వాటాదార్లకు నోటీసు

ఆంధ్రా ఫౌండ్రీ & మెషిన్ కంపెనీ లిమిటెడ్ సాధారణ సమావేశం 1964 మే 30వ తేదీ శనివారం మధ్యాహ్నం 4 గంటలకు సికిందరాబాద్ 26, సరోజినీదేవి రోడ్‌లోని కంపెనీ రిజిష్టర్డ్ కార్యాలయంలో జరుగగలదని, అట్టి సమావేశంలో పదేళ్ల తర్వాతను కేటాయింపు తేదీ కింద పదిహేనేళ్లలో గాను కంపెనీ ఇష్టానుసారం మూడు నెలల నోటీసు ఇచ్చి ప్రిఫరెన్స్ పెట్టుబడిని తిరిగి చెల్లించివేయడానికి ఉద్దేశించిన ప్రత్యేకతీర్మానం పరిశీలనకు రాగలదని. సబబని భావించిన పక్షంలో ఆమోదించబడగలదని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. వివరణాత్మ నివేదికలతో సహా సమగ్రమైన నోటీసులు వాటాదార్లందరికి పోస్టు చేయబడినవి

కంపెనీ వాటాల రిజిష్టర్లు 1964 మే 27వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు (రెండు రోజులూ కలుపుకొని) మూసివేయబడతాయి.

ఆంధ్రాఫౌండ్రీ & మెషిన్ కంపెని తరపున

(సం) పి వెంకటేశ్వరరావు

అసిస్టెంట్ సెక్రటరీ

28 సరోజినీదేవిరోడ్

సికిందరాబాద్-26

1964 మే 4వ తేదీ



నగరంలో ఈనెల ఒకటవ తేదీనాడు సింథెటిక్ లిగ్, ప్రాజెక్టుకు చెందిన రీసెర్చి లెబొరేటరికి కేంద్ర పెట్రోలియమ్ కెమికల్స్ శాఖమంత్రి శ్రీ ఒ. వి. అలగేశన్ శంకుస్థాపన జరిపినప్పటి దృశ్యం.

దేశ ఆర్థికాభివృద్ధిపై ప్రణాళికల ప్రభావం

పరిశీలన ప్రాముఖ్యంపై వి. కె. ఆర్. వి. రావు వివరణ

న్యూఢిల్లీ, మే 4

దేశ ఆర్థిక కార్యకలాపాలపై ప్రణాళికా పథకాల ప్రభావాన్ని పరిశీలించడం అతిముఖ్యమని ప్రణాళికా రచనా సంఘసభ్యుడు ప్రొఫెసర్ వి కె ఆర్. వి. రావు చెప్పారు వస్తువుల వాడకం, జీవనవిధానం, ఉద్యోగ అవకాశాలు మేలురకం వ్యవసాయ పద్ధతులు, గామ పరిశ్రమలకు సంబంధించిన విషయాలను పరిశీలించడానికి యిక్కడికి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధుల సమావేశంలో శ్రీ రావు పై అభిప్రాయాన్ని ప్రకటించారు.

తలసరి సాలు ఆదాయాలనేగాక కనీస ఆదాయాలను కూడా పరిశీలించడం చతుర్థ ప్రణాళిక లక్ష్యాలలో ఒకటనీ, అభివృద్ధి కార్యక్రమాలలో సరైన వాటా గ్రామప్రాంతాలకు లభించడం లేదనీ, చతుర్థ ప్రణాళికను తీర్చిదిద్ది గ్రామ పరిశ్రమలకు తగిన ప్రాధాన్యం యివ్వాలన్నారు వివిధ ప్రాంతాలలో జరిపే పై పరిశీలనలతో ఒక సూచిని తయారుచేయాలనీ, మామూలు స్థాయికంటె తక్కువ వున్న ప్రాంతాలకు అత్యధిక ప్రాముఖ్యం యివ్వాలని కూడా ఆయన అన్నారు. ఈ పరిశీలన వచ్చే మార్చి నెలలోగా పూర్తిచేస్తే చతుర్థ ప్రణాళిక రచనకు వీలుగా వుంటుందన్నారు. ప్రణాళికా రచనా సంఘం కార్యదర్శి శ్రీ టి పి సింగు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల ప్రభావంగురించి సరైన సమాచారం లేకపోవడంవల్ల ప్రాంతీయ వ్యత్యాసాలకు దారితీస్తున్నదనీ, ఈ పరిశీలన ఆ విషయంలో ఎంతో ఉపయోగ పడుతుందనీ చెప్పారు

ఈ పరిశీలన అన్ని రాష్ట్రాలలోనూ యూనియను ప్రాంతాలలోను జరుగుతుంది

హిమాలయ శిఖరాన్ని ఆరోహించినట్టు చైనా ప్రకటన

పెకింగ్, మే 3

ప్రపంచంలో ఇంతవరకు ఎవ్వరూ అధిరోహించని, 26291 అడుగుల ఎత్తుగల పీసాపంగ్మా పర్వతాన్ని, చైనా పర్వతాధిరోహకుల బృందం అధిరోహించిందనే వార్తపట్ల చైనా వార్తా పత్రికలు నేడు హర్షాన్ని వ్యక్తపరిచాయి టిబెట్‌లో ఉన్న ఈ పర్వతం, ప్రపంచంలోని ఎత్తైన పర్వతాలలో ఒకటి.

నేడీ విజయాన్ని గూర్చి వచ్చిన వార్తలోనే యీ పర్వతాధిరోహణను గూర్చి మొదటిసారిగా ప్రస్తావించారు. ఈ పర్వతాన్ని అధిరోహించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని.చైనాలోని సామాన్య ప్రజలకుకాని, ఇతర ప్రపంచానికికాని తెలియదు.

ప్రపంచంలోని ఇతర పర్వతాధిరోహకులు, యీ పర్వతం అధిరోహించకుండా, కొన్ని సంవత్సరాల క్రితం చైనా నిషేధించిన విషయం పాఠకులకు విదితమే. ప్రపంచంలోని ఇతర దేశాలన్నీ దానిని గోసాయిన్‌థన్ పర్వతమని అంటాయి.

అధికార దుర్వినియోగం చేసిన వ్యక్తిని తిరిగి ఎన్నుకోరాదు

(ఆంధ్రభూమి విలేఖరి)

భువనగిరి, మే 3

ఇక్కడికి నాలుగు మైళ్ళదూరాన వున్న అనాజీపురం గ్రామంలో గతనెల 29న జరిగిన బహిరంగసభలో రాష్ట్ర ప్రణాళికలు, పంచాయతీరాజ్ శాఖల మంత్రి డాక్టర్ యం. చెన్నారెడ్డి ప్రసంగిస్తూ పంచాయతీ అధ్యక్షుని అధికారాలను దుర్వినియోగం చేసినవ్యక్తిని తిరిగి పంచాయతీలకు ఎన్నుకొనవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసారు కాంగ్రెస్ సంస్థ ఆశయాలను, లక్ష్యాలను ఆయన ప్రస్తావించారు. జిల్లాపరిషత్తు అధ్యక్షులు శ్రీ జి ఎస్. రెడ్డి సభకు అధ్యక్షత వహించారు. జిల్లాకాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ వి. పురుషోత్తంరెడ్డి, శ్రీ టి. లక్ష్మారెడ్డి ప్రభృతులు సభకు హాజరైనారు. శ్రీ టి. లక్ష్మారెడ్డి వందన సమర్పణతో సభ ముగిసింది.

ఉక్కు కర్మాగారాలకు అవసరమైన సిబ్బంది

రాయపూర్, మే 4

బొకారో స్టీల్ ప్లాంటు నిర్మాణానికి అవసరమైన నిర్మాణ కౌశలంగల ఇంజనీర్లను, భిలాయి స్టీల్ వర్క్స్ అధిక సంఖ్యలో సరఫరా చేయగలదని నిన్నటిదినం ఇక్కడ పత్రికా ప్రతినిధుల సమావేశంలో భిలాయి స్టీల్ వర్క్స్ జనరల్ మేనేజరు శ్రీ ఇంద్రజిత్ సింగ్ చెప్పారు.

రష్యా సహకారంతో ఈ ప్లాంటు నిర్మాణం జరుగుతుంది గనుక, కావలసిన ఇంజనీర్ల సంఖ్య అధికంగా వుండగలదని ఆయన అన్నారు. బొకారో ప్లాంటు నిర్మాణ ఇంజనీరింగు శాఖ అవసరాలను అన్నిటిని భిలాయిప్లాంటు తీర్చగలదని శ్రీ ఇంద్రజిత్‌సింగ్ చెప్పారు.

భిలాయి స్టీల్‌ప్లాంటులో 4 వ కోకు బ్యాటరీకి ఏప్రిల్ 13 న ఉష్ణోగ్రత కలిగించారని, తిరిగి ఆగస్టు 15 న ఉష్ణాదకశక్తిని హెచ్చించినపుడు 800 నుండి వెయ్యి డిగ్రీల ఉష్ణోగ్రతగల కోకును ఉత్పత్తిచేయవచ్చునని ఆయనఅన్నారు.

అభివృద్ధి కార్యక్రమం క్రింద అనేక చిన్న యూనిట్లు పూర్తయినాయని. మరికొన్ని పూర్తికావస్తున్నాయని శ్రీ సింగ్ చెప్పారు.

భిలాయి ప్లాంటువద్ద వర్తమాన సంవత్సరాంతానికి కార్మికుల కొరకు దాదాపు 2,300 గృహాలు నిర్మాణం చేస్తారని ఆయన తెలియజేశారు.

బసుటోలాండ్‌కు వచ్చే ఏడు స్వాతంత్ర్యం లభించే అవకాశం

లండన్, మే 4 (ఎ.ఎఫ్.పి.)

వచ్చే సంవత్సరాంతంలోగా బసుటోలాండ్ స్వతంత్రదేశంగా అవతరించడానికి రాజ్యాంగ రచనా సభ సూత్రప్రాయంగా అంగీకరించినట్టు సన్నిహిత వర్గాలవారు నిన్న తెలిపారు.

ఇప్పుడు కుదుర్చుకొంటున్నఒప్పందం వల్ల దేశంలో ఎన్నికలుజరిపే అవకాశం లభిస్తుంది. ప్రజలు స్వాతంత్ర్యం కోరుతున్నట్టు ప్రజాస్వామిక పద్ధతిలో నిర్ధారించే పక్షంలో 1965వ సంవత్సరంలో బసుటోలాండ్‌కు సంపూర్ణస్వాతంత్ర్యం ఇవ్వడానికి బ్రిటన్ అంగీకరించినట్టు విశ్వాసనీయంగా తెలుస్తున్నది.

నిజామాబాద్ మునిసిపాలిటీకి సంజాయిషీ నోటీసు

నిజామాబాద్ మే 4

నిజామాబాద్ సిటీ మునిసిపాలిటీని రెండేళ్ళపాటు ఎందుకు రద్దుచేయరాదో తెలుపాలనిసంజాయిషీకోరుతూ రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ కౌన్సిలర్లకు మెమొరాండంలు పంపినది.

ధోతిపురా గ్రామంలో లాఠీ ఛార్జి

5 గురు పోలీసులకు గాయాలు

శ్రీనగర్, మే 3

ఇక్కడికి 40 మైళ్ళ దూరంలో ఉన్న ఒకపట్టణ సమీపంలోని ధోతిపురా గ్రామంవద్ద నేటిదినం దుండగులను చెదరకొట్టటానికి పోలీసులు లాఠీఛార్జి చేసిన సందర్భంలో ఒకరు తీవ్రమైన గాయాలకు గురియైనారు

పొలాలలో నీటిని వినియోగించుకోవటాన్ని గురించి గ్రామంలోని రెండు ప్రతిపక్షవర్గాలలో సంఘర్షణ సంప్రాప్తించిందని ఇక్కడికి చేరిన అధికారిక వర్తమానంవల్ల తెలుస్తూంది. దర్యాప్తు చేయటానికి ఈసంఘటన జరిగిన ప్రదేశానికి పోలీసులువచ్చినపుడు. గ్రామస్థులు వారివద్దనున్న సంకెళ్ళు లాక్కుని, తలపాగాలు తీసుకున్నారు. అటుపిమ్మట గ్రామస్తులు పోలీసుపార్టీని కొట్టినందువల్ల 5గురు పోలీసులు గాయపడ్డారు.

మే 10నుండి 15వరకు నిజాంసాగర్ మెయిన్ కాలువమూసివేత

నిజామాబాద్, మే 4

నిజాంసాగర్ మెయిన్ కాలువను మరమ్మతులు చేయడానికి, చెట్టుచేమ తొలగించడానికిగాను ఈనెల 10వతేదీ నుండి 15వ తేదీవరకు (రెండురోజులు కలుపుకొని) మూసివేస్తారు అయితే పంపులు దెబ్బతినకుండా ఉండడానికి కాలువను మూసివేసేముందు, తిరిగి తెరచిన తర్వాత కావలసినంతనీరు విడుదల చేస్తారు.

ప్రణవానంద పాఠశాల వార్షికోత్సవం

హైదరాబాద్, మే 4

దోమలగూడాలోని ప్రణవానంద రాష్ట్రీయ విద్యాలయ వార్షికోత్సవం మొన్న సాయంత్రం జరిగింది. జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ సి. సోమసుందరం అధ్యక్షత వహించారు. శ్రీ టి. గజరాజ్ స్వాగతం చెప్పారు. శ్రీ జి. యస్. ప్రకాశరావు ప్రభృతులు ప్రసంగించారు. విద్యార్థులు రెండు నాటికలను ప్రదర్శించారు. స్వామి శాంతానంద విద్యార్థులకు బహుమతి ప్రదానం చేసారు.

కాశ్మీర్‌లో విధ్వంసక చర్యల నివారణకు హామీ

లోక్ సభలో మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, మే 4

కాశ్మీర్‌లో అడపాదడపా ప్రేలుడు సంఘటనలు సంభవించకుండా ప్రభుత్వం "అవసరమైన చర్యలన్నీ గైకొంటున్న"దనిహోంశాఖలోమంత్రి శ్రీ జైసుఖ్‌లాల్ హాథి నేడు లోక్‌సభకు హామీ ఇచ్చారు.

మెంధార్, పూంచ్ పవర్ హౌస్ వద్ద ఇటీవల జరిగిన రెండు ప్రేలుడు సంఘటనలను ప్రభుత్వదృష్టికి తెస్తూ, శ్రీ ఎస్.ఎం. బెనర్జీ, తదితరులు ప్రవేశపెట్టిన తీర్మానంపై ఒక ప్రకటనచేస్తూ శ్రీ హాథిపై హామీ ఇచ్చారు. సభ్యులు అనేక ప్రశ్నలడిగారు. పాకిస్తానీయుల గూఢచారి చర్యల ఫలితంగానే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని కొందరు సభ్యులు సూచించారు. వీటి నిరోధానికి కేంద్రం ఏంచర్యలు గైకొన్నదో తెలపాలన్నారు.

మొగులూరు గ్రామంలో బహిరంగసభ

కంచికచర్ల, మే 4

నందిగామ తాలూకా జాతీయసత్యాగ్రహ సమితి ఆధ్వర్యాన మొగులూరులో బహిరంగసభ జరిగింది. సభకు గ్రామపంచాయితీ బోర్డు అధ్యక్షులు శ్రీ వెలగా రామకృష్ణయ్య అధ్యక్షత వహించారు. శ్రీకోటూరు వెంకటేశ్వర్లు శ్రీ కొమరగిరి కృష్ణమోహన్, శ్రీ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, శ్రీ సుంకర సత్యనారాయణ శ్రీ కోగంటి వెంకటేశ్వర రావు మాట్లాడారు.

కోనాయపాలెం

కోనాయపాలెంలో నందిగామ తాలూకా జాతీయ సత్యాగ్రహ సమితి ఆధ్వర్యమున బహిరంగసభ జరిగింది సర్వశ్రీ కాటూరు వెంకటేశ్వర్లు, కొమరగిరి కృష్ణమోహనరావు, దమ్మాలపాటి వెంకటేశ్వర రావుగార్లు ఉపన్యసించారు

దేశ సుస్థిరతకు ఇంగ్లీషు అవసరం

ఏలూరు సభలో రాజాజీ అభిభాషణ

ఏలూరు, మే 4 (పి టి ఐ)

కమ్యూనిస్టులు శ్రద్ధానక్తులు చూపిన కారణాన కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగంలోని 18 వ సవరణ బిల్లును ఉపసంహరించుకొన్నదన్న అభిప్రాయాన్ని శ్రీ సి రాజగోపాలాచారి ఇక్కడ వ్యక్తం చేశారుఅయి స్వతంత్ర పార్టీ 17వ సవరణ బిల్లును ఉపసంహరించాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న కారణానవారు (బిల్లు) దాన్ని అంటిపెట్టుకొని వున్నారన్నా రాయన

నిన్న ఇక్కడ జరిగినరాష్ట్రస్వతంత్ర పార్టీ ద్వితీయమహాసభలో రాజాజీ ప్రసంగిస్తూ మే 6వతేదీన లోక్ సభలో ఈ బిలును ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం నిశ్చయించగా దానిని మే 6వ తేదీనే ప్రవేశపెట్టాలని కమ్యూనిస్టు సభ్యులు సూచించారన్నారు. కమ్యూనిస్టు పార్టీవద్దైనా సూచనఅంటూ చేస్తే అది ఎటువంటిదైనా ప్రభుత్వం దానిని వెంటనే పరిశీలనలోకి తీసుకొంటుందని ఆయన తెలిపారు,

ఆంగ్లభాష ప్రాముఖ్యం

అంతకు ముందు రాజాజీ ఆంగ్లంలో ప్రసంగిస్తూ తాను ఆంగ్లేయుడు కానప్పటికీ భారత దేశంలో ఆంగ్ల భాష యథాతథంగా వుండాలనివాంఛిస్తున్నానన్నారు.

మనము ఆంగ్లమును వదలిపెడితే దేశం 20 ముక్కలుగా విడిపోతుందని పేర్కొంటూ ఇంకా పెక్కు ముక్కలుగా చీలిపోయే అవకాశమున్నదన్నారాయన.

1947వ సంవత్సరంనుండిమనం పెక్కు పొరపాట్లను తెలివితక్కువ పనులను చేసామని. వాటిలో ఒకటి దేశమును భాషాప్రయుక్త రాష్ట్రాలు విభజన అని అన్నారు.

27 సంవత్సరాలక్రితం ఉమ్మడి మద్రాసురాష్ట్రంలో తాము, స్వర్గీయ టంగుటూరి ప్రకాశంపంతులు మంత్రి పదవులలో వుండగా రైతులను రక్షించడానికై జమీందారీలనురద్దుచేయడానికై తీసుకొన్న చర్యలను రాజాజీ ప్రస్తావించారు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన మీదట జమీందారీల రద్దు వ్యవహారంలో తలెత్తిన చిక్కులను సమస్యలను తొలగించడానికై జరిగిన కృషిని ఆయన వివరించారు.

డాక్టరు కె.ఎల్. రావు విజయవాడ పర్యటన

హైదరాబాద్, మే 4

నీటి పారుదల, విద్యుచ్ఛక్తి వ్యవహారాల కేంద్రమంత్రి డాక్టర్ కె.ఎల్ రావు యీ నెల 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు విజయవాడలో పర్యటిస్తారు.

ఆయన ఈ నెల 7వ తేదీ గురువారం ఉదయం గం. 9-25 ని.లకు ఢిల్లీనుంచి విమానంలో హైదరాబాదు వస్తారు. ఆ రోజు ఉదయమే 11 గంటలకు విమానంలో విజయవాడ బయలుదేరుతారు. మధ్యాహ్నం 12 గం.15ని.లకు విజయవాడ చేరుకుంటారు. ఆయన విజయవాడ నుంచి మే 9వ తేదీ శనివారం నాటి రాత్రి 8 గం. 5 ని.లకు హౌరా మద్రాసు మెయిలులో మద్రాసు వెడతారు,

నిడుబ్రోలులో షేక్స్పియర్ నాల్గవ శతజయంతి

నిడుబ్రోలు, మే 4

షేక్స్పియర్ 400వ జన్మదినోత్సవము స్థానిక పి. బి. ఎన్. కళాశాలలో ఇటీవల జరిగింది. డాక్టర్ యస్. చంద్రమౌళి దీనికి అధ్యక్షత వహించారు.

శ్రీయుతులు జనార్దనరావు, డాక్టర్ డి రామచంద్రయ్య. యన్. యల్. యన్. శాస్త్రి. ఆర్. లక్ష్మయ్య ప్రభృతులు షేక్స్పియర్ జీవిత విశేషములు. రచనా వైశిష్ట్యమును గురించి ప్రసంగించారు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ బి. వి. సుబ్బరామయ్య షేక్స్పియర్ జీవితంలోని మరుపురాని ఘట్టాలను కొన్ని వివులీకరించారు.

"రోవర్టు ఫ్రాస్టు" ఇండియాకు ఆహ్వానం అనే విషయాలమీద చలన చిత్రం చూడబడింది కళాశాల అధ్యాపకులు బహూకరించిన షేక్స్పియర్ చిత్రాన్ని వ్యవస్థాపకులు శ్రీ పి. బుచ్చినాయుడు కళాశాలలో ఆవిష్కరించారు. శ్రీ జి శ్రీమన్నారాయణ వందన సమర్పణ చేశారు.

గాంధీమెడికల్ కాలేజీని నిజామాబాద్‌కు మార్పించాలని యత్నం

నిజామాబాద్. మే 4 (ఎ.ఎన్ ఎస్)

కేంద్ర ప్రభుత్వం నగరంలో స్థాపించదలచిన పోస్టు గ్రాడ్యుయేట్ వైద్య సంస్థకై చోటు యివ్వడానికి నగరంలోని గాంధీ మెడికల్ కాలేజిని ఏదో ఒక జిల్లాకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు ఇక్కడ విశ్వసనీయంగా తెలుస్తున్నది.

ఈ నూతన ప్రతిపాదన దృష్ట్యా గాంధీ మెడికల్ కాలేజీని నిజామాబాద్‌కు తెప్పించడానికి జిల్లా కలెక్టర్ శ్రీ బి. ఎ రామన్, జిల్లా మెడికల్ ఆఫీసర్ మహమ్మద్ గులామ్‌నబీ గట్టి ప్రయత్నం చేస్తున్నారు. నాలుగవ ప్రణాళికలో నిజామాబాద్‌లో స్థాపించ దలచిన వైద్య కళాశాలకు శ్రీ గులాం నబీ గత సంవత్సరం విశేష కృషిచేసి కొంత స్థలాన్ని సంపాదించారు. దానిని గాంధీ కళాశాలకు వినియోగించ దలచారు. నిజామాబాద్ నుండి ఈ విషయంలో ప్రభుత్వానికి నచ్చజెప్పడానికి గాను శాసన సభ్యులు, పంచాయతీ సమితుల అధ్యక్షులు ఇతర ప్రజానాయకులతో కూడుకొన్న ఒక రాయబార వర్గం త్వరలో హైదరాబాద్ వెళ్ళనున్నది.

వాసవ్యవిద్యాలయ వార్షికోత్సవం

విజయవాడ, మే 4

"చెప్పినదిచేయడం. చేసినది చెప్పడం అనేది గోరాగారి జీవితసూత్రం. దానికనుగుణంగానే ఆయన ఒక ప్రత్యేక విద్యా విధానాన్ని రూపొందిస్తున్నారు అదే వాసవ్య విద్యాలయం. వాస్తవిక దృక్పథం, సంఘదృష్టి. వ్యక్తిత్వంగల పౌరులను తయారుచేయాలనే ఆశయంలో వాసవ్య విద్యాలయం కృషి చేస్తోంది గాంధీజీబేసిక్ విద్యవలె. రవీంద్రుని శాంతినికేతన్ వలె వాసవ్యవిద్యాలయం విద్యారంగంలో గోరాగారి కృషిగా రూపొందుతోంది" అని గత నెల 28వ తేదీ సాయంత్రం వాసవ్య విద్యాలయం తృతీయ వార్షికోత్సవానికి అధ్యక్షత వహిస్తూ శ్రీ కల్లూరు బసవేశ్వరరావు అన్నారు.

విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీమతి కె. మైత్రి, నివేదిక సమర్పిస్తూ, 1961 జూలై ఒకటవ తేదీన విద్యాలయం స్థాపించబడినదనీ, ఆగ్రాకుచెందిన ధోల్‌పూర్ గ్లాస్ వర్క్సు మేనేజింగు డైరెక్టరు శ్రీ శివనారాయణ అగర్వాల్ ఉదారంగా ఇచ్చిన విరాళంలో ఈ సంవత్సరంలో ఒక లేబొరేటరి స్థాపించామనీ. యీ లేబొరేటరీని విద్యార్థులలో చిన్నప్పటినుంచే శాస్త్రీయ దృష్టిని అలవరచుటకు వినియోగించుకేకాక ప్రయోజన విద్యకు సాధనంగా కూడా ఉపయోగిస్తున్నామని చెప్పారు ఈ కృషికి ఒక 'ఎపిడయాస్కోపు' కావాలనీ, అది సుమారు రు. 1200 అవుతుందనీ అన్నారు.

శ్రీ కారుమంచి వెంకటసుబ్బయ్య "ఎపిడయాస్కోపు"కు కావలసిన మొత్తాన్ని విరాళం ప్రకటించి.వాసవ్య విద్యాలయానికి శాశ్వతంగాస్వంతస్థలం ఏర్పాటుచేసే విషయమై విజయవాడ పౌరులు శ్రద్ధవహించాలనీ, తాను కూడాఅందుకుతోడ్పడగలననిచెప్పారు.

శ్రీ గోరా మాట్లాడుతూ తాను సలహాలు ఇచ్చుటేగాని మిగిలినదంతా విద్యాలయ నిర్వాహకులేచూచుకుంటున్నారనీ, ముఖ్యంగా పిల్లలు, పిల్లల సంరక్షకుల సహకారంతోనూ, ఆంధ్ర ఆంధ్రేతర మిత్రులసానుభూతి.ప్రోత్సాహంతోనూ విద్యాలయం అభివృద్ధి చెందుతోందని చెప్పివారిని అభినందించారు. తనను విద్యారంగంలోనే పని చేయమని చాలామంది మిత్రులు సూచిస్తూఉంటారనీ, కాని ఏరంగంలో మార్పులు కావాలన్నా, రాజకీయంగా మార్పులు ముఖ్యమని ఆయనఅన్నారు.

శ్రీ యల్. చిరంజీవిరావు, శ్రీమతి సూర్యాదేవ రాజ్యలక్ష్మి వాసవ్య విద్యావిధాన ప్రత్యేకతగురించిప్రసంగించారు.

చదువులోను, ఆటలలోను ప్రతిభ చూపించిన విద్యార్థులకు శ్రీమతి చెన్నుపాటి రంగమ్మ బహుమతులు పంచిపెట్టారు.

సభా కార్యక్రమానికిముందు సాంస్కృతికప్రదర్శనలుజరగాయి వీనిలో భారతదేశ ప్రస్తుత పరిస్థితులలో మత సామరస్యం ఆవశ్యకతను బోధిస్తూ 6-8 సంవత్సరాల వయస్సు చిన్న పిల్లలు వేసిన టాబ్లో చాలా బాగుంది శాస్త్రజ్ఞానం శాంతి ప్రయోజనాలకే వినియోగించాలనే సందేశమిస్తూ. విజ్ఞాని విధి అనే ఛాయా నాటిక ప్రదర్శించారు పొట్టి తర్లి - పోడిసు పిల్లలు. అనే హాస్యనాటిక కొన్ని నృత్య ప్రదర్శనలు కూడా జరిగాయి

శ్రీమతి హేమలతాలవణం వందన సమర్పణ చేశారు.

ఇన్స్యూరెన్స్ కంపెనీ రిజిస్ట్రేషన్ రద్దు

న్యూఢిల్లీ మే 4

బొంబాయిలోని యూనిక్ మోటర్ అండ్ జనరల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్, నిర్వహణ ఖర్చుల విషయంలో 1938వ సంవత్సరం ఇన్స్యూరెన్స్ చట్టంలోని 40 "బి" సెక్షన్ ఉల్లంఘనకు ఆ కంపెనీ రిజిస్ట్రేషన్ రద్దుచేయబడింది.

కావలెను

"మైకాయ్" బ్రాండ్ గాసుగ సున్నానికి హైదరాబాదుకు స్టాకిస్టులు కావలెను ఇండ్ల నిర్మాణంలోను, పరిశ్రమలకు ఉపయోగపడుతుంది. మద్రాసు, విశాఖపట్నం, బెంగుళూరు, బొంబాయి, కలకత్తాలలో విశేషంగా ఉపయోగించబడుతోంది వివరాలకు స్వయంగాసోల్ డిస్ట్రిబ్యూటర్లను రూముసం 14, తాజ్‌మహల్ హోటల్, సికందరాబాదులో రోజువగలు 1-00 మొదలు 4గంటలమధ్య సంప్రదించండి.

(R-1230)

కావలెను

సేవఛ్ఛ గాయకులుగా పాల్గొనటానికి సంగతపోటీ అభ్యర్థులు కావలెను. రికార్డింగు ఛార్జీలు అరురూపాయలు మాత్రమే నటనలో సమర్థతగల కళాకారులకుఅవకాశం. ధ్వని ఛాయా గ్రహణం పరీక్షరు. 15 లు. తుది గడువు మే 5 వ తేదీ.

స్క్రీన్ టెస్టు

గాంధీ మెడికల్ కాలేజి ఎదుట,

బషీర్ బాగ్, హైదరాబాద్ (ఆ.ప్ర.)

స్త్రీ పురుషులకు శుభవార్త

ఈదినమే 24 గంటలలోతమ కృశించిన శరీరము తిరిగి తమ పూర్వోన్నత శరీరమును పొందవలెనన్న డా॥ రానా గారితో కలిసి సంప్రదించి సంతృప్తి ఆరోగ్యం పొందండి.

వ్యాధి ఏ కారణమువల్ల వచ్చినాసరే నపుంసకత్వానికి ప్రత్యేక గ్యారంటీ చికిత్స పొందండి. వీర్యస్ఖలనము అపుశక్తి పొందండి. వరమూత్ర బలహీనత, ఇంకా స్త్రీలకు బహిష్టు సంబంధమైన అనేక బాధలు. జబ్బులు డా॥ రానా శ్రద్ధతో పరిశీలించగలరు.

వేళలు : ఉ॥ గం. 8 నుండి 1, సా॥ 4 నుండి 8-30

రానా క్లినిక్

వై యం సి. ఎ. బస్‌స్టాండ్ ఎదుట నారాయణగూడ, హైదరాబాద్

ఫోన్ : 36137

బహిరంగ ప్రకటన

దిగువ తెలిపిన పేర్లతో, పేరుకు చివర "లిమిటెడ్"అనిగాని లేక "ప్రయివేట్ లిమిటెడ్"అని గాని చేర్చకుండా సభ్యుల లయబిలిటీని పరిమితం చేస్తూ, రిజిష్టర్డ్ కంపెనీగా నెలకొల్పుకోడానికి అనుమతినివ్వ వలసినదిగా కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 1956కంపెనీల చట్టంలోని 25 సెక్షనుననుసరించి ఒక దరఖాస్తు పంపబడుతోందని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

కంపెనీ పేర్లు

(1) రామన్స్‌ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ ఎసోసియేషన్, రామానగర్, సెట్టిగుంట (గ్రామం), వయా రైల్వే కోడూరు, రాజంపేట (తాలూకా) కడప (జిల్లా) (2) వేణుఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ ఎసోసియేషన్, రామప్రసాద్, యర్రముక్కపల్లి, కడప తాలూకా, జిల్లా.

ఖాదీ గ్రామోద్యోగ పరిశ్రమలలో ప్రజలు అధికసంఖ్యలో భాగం పంచుకుని ఖాదీగ్రామ పరిశ్రమలను పెంపొందించే ముఖ్యోద్దేశంతో సర్వోదయ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడమే కంపెనీ ప్రధాన లక్ష్యం.

కంపెనీ నియమావళిని పైన తెలిపిన చిరునామాలో చూచుకోవచ్చును.

ఎవరికైనా గాని కంపెని, సంస్థ, కార్పొరేషన్‌కయినాగాని ఈ విధంగా దరఖాస్తును పంపడంలో అధిక్షేపణ ఏమైనా వున్నట్లయితే వాటిని ఈ ప్రకటన వెలువడిన నేటినుంచి ముప్పయి రోజులలోగా ప్రభుత్వానికి వ్రాతపూర్వకంగా డెప్యూటి సెక్రటరీ టు ది గవర్నమెంట్. ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్, ఏ పి. హైదరాబాద్ పేరిట తెలియచేయాలి

తేది: 2-5-1964

1 పి రామన్ ఫస్ట్ ప్రొమోటర్

2. జి వేణుగోపాలరెడ్డి ఫస్ట్ ప్రొమోటర్

(ఆర్-1227)

గండక్ బ్యారేజికి శంకుస్థాపన

ఇండియా-నేపాల్ సంబంధ మైత్రికి చిహ్నం రాజుమహేంద్ర, ప్రధాని నెహ్రూ అభిభాషణ

భైసాలోటన్, మే 4

గండక్ బ్యారేజి, ఇండియా-నేపాల్‌ల మధ్య అభివృద్ధిచెందుతున్న స్నేహసంబంధాలకు చిహ్నం కాగలదని నేడు ఇక్కడ బ్యారేజికి శంకుస్థాపన జరిపిన అనంతరం నేపాల్ రాజు మహేంద్ర ఉద్ఘాటించారు.

ఇండియా, నేపాల్ ఉభయదేశాలకు ప్రయోజనకరమైన ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులో ఒక భాగంగా ఈ బ్యారేజిని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఇండియా నిర్వహిస్తున్నది.

పరిసమానులమనే దృష్టితో ఇండియా నేపాల్‌ల మధ్య మైత్రీభావం మరింత దృఢతరం కావడానికి ఉభయపక్షాలకు ఈ బ్యారేజి దోహదం చేయగలదని నిస్సందేహంగా చెప్పవచ్చునని రాజు మహేంద్ర పేర్కొన్నారు.

ఇక్కడ నేటి మధ్యాహ్నం వేద మంత్రోచ్ఛారణలమధ్య బ్యారేజీకి రాజు మహేంద్ర శంకుస్థాపన జరిపారు. భైసాలోటన్‌ను ఇప్పుడు వాల్మీకినగర్ అని పిలుస్తున్నారు.

శంకుస్థాపన జరపవలసినదిగా రాజు మహేంద్రను శ్రీ నెహ్రూ ఆహ్వానిస్తూ ఇండియా, నేపాల్‌ల మధ్య సహకారానికి చిహ్నమైన కోసీ, గండక్ ప్రాజెక్టుల నిర్మాణంతో ఉభయదేశాలు సంపదతో తులతూగ కలవన్న ఆశాభావం ప్రకటించారు.

ముజఫర్‌పూర్ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కృష్ణేశ్వర జలన్, పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేపాలీయులు, భారతీయులు కలిసి అతిమందికి పైగా ఈ ఉత్సవానికి హాజరైనారు.

బీహార్ గవర్నర్, గండక్ ప్రాజెక్టు కంట్రోలు బోర్డు అధ్యక్షుడు అయిన శ్రీ ఎం. అనంతశయనం అయ్యంగార్ రాజు మహేంద్రకు వెండితో చేసిన రథంబొమ్మను బహూకరించారు.

శ్రీకృష్ణపరమాత్మ రథాన్నిపోలిన వేగంతో గండక్ ప్రాజెక్టు నిర్మాణం కొనసాగగలదని గవర్నర్ ఆశాభావం వెలిబుచ్చారు.

బీహార్ ముఖ్యమంత్రి శ్రీకృష్ణవల్లభ సహాయ్ మాట్లాడుతూ, కోసీ, గండక్ ప్రాజెక్టు నిర్మాణంలో సహకరించినందుకు కృతజ్ఞత తెలియజేశారు.

ప్రధాని నెహ్రూ తమఉపన్యాసంలో భారత ప్రభుత్వం స్వంత ఖర్చుతో హనుమాన్‌నగర్ నుండి రాజ్‌బిరాజ్‌కు ఫతేపూర్ నుండి కనూలిబజార్‌కు రోడ్లు నిర్మించగలదనీ, కోసీ విద్యుచ్ఛక్తి కేంద్రం నుండి నేపాల్‌లోని విరాట్‌నగర్, రాజ్‌బిరాజ్‌లకు ట్రాన్స్‌మిషన్ లైన్లు నిర్మించగలదని కూడా చెప్పారు.

ఈ ప్రాజెక్టు ఇరుగుపొరుగునున్న రెండు దేశాలమధ్య మైత్రికి చిహ్నమని బీహార్ ఇరిగేషన్ విద్యుచ్ఛక్తిశాఖ మంత్రి శ్రీ మహేశ్ ప్రసాద్ సిన్హా అన్నారు.

భైసాలోటాన్‌వద్ద ప్రధానికి ఘన స్వాగతం

భైసాలోటాన్, మే 4

ప్రధాని నెహ్రూ నేటి ఉదయం ఢిల్లీ నుండి ఇక్కడకు వచ్చారు విమానాశ్రయంవద్ద సుమారు పదివేలమంది హర్షధ్వానాలతో ప్రధానికి ఘనస్వాగతమిచ్చారు.

ఒకపక్కన ఎండ మాడుతున్నప్పటికీ ప్రధానికి స్వాగతం ఇచ్చేనిమిత్తం ప్రజలు విమానాశ్రయంవద్దనే వేచి ఉన్నారు. ప్రధాని పయనించినవిమానం ఉదయం 11 గంటల 55 నిమి. పాలకు ఇక్కడకు వచ్చింది.

స్వాతంత్ర్య సముపార్జన అనంతరం ప్రధాని ఇక్కడకు రావడం ఇదే తొలిసారి

శ్రీ నెహ్రూ చాలా ఉల్లాసంగా ఉన్నట్టు కనిపించారు.

టాపులేనికారులో ఎక్కి ప్రధాని విమానాశ్రయం చుట్టివచ్చారు. విమానాశ్రయంచుట్టూ నిలబడిఉన్న ప్రజల అభినందనాలను ఆయన స్వీకరించారు

వ్యవసాయయూనివర్సిటీ చట్టం అమలు

హైదరాబాద్ మే 4

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ చట్టం నేటి నుండి అమలులోకి వచ్చినట్టు అసాధారణ గెజెట్ ప్రకటన వెలువడింది.

సూర్యాపేటలో వెనుకబడిన జాతుల సమాఖ్య ఏర్పాటు

సూర్యాపేట, మే 4

సూర్యాపేట పట్టణ వెనుకబడిన జాతుల సమాఖ్యను ఏర్పాటు చేయడానికి, గత నెల 26వ తేదీన స్థానిక జైహింద్ టాకీస్ హాలులో జరుపబడింది నగర పాలక సంఘాధ్యక్షులు డాక్టర్ కె. శ్రీనివాసస్వామి అధ్యక్షత వహించారు.

శ్రీయుతులు వి. వీరరాఘవులు, కొలిశెట్టి వెంకటరాములు డి పాండు జంపాలవెంకులు గోపయ్య బి. స్వామి ముదిరాజ్ మొదలగువారు ప్రసంగించారు

వెనుకబడిన జాతులకు ప్రాతినిధ్యం చేస్తున్న సహాయాన్ని అన్ని వర్గాలకు సక్రమంగా అందజేయటం, తగిన సహాయానికై ప్రభుత్వాన్ని అభ్యర్థించటం, యీ సమాఖ్య ముఖ్యోద్దేశాలు

సమాఖ్య తాత్కాలిక సంఘానికి యీ దిగువవారిని ఎన్నుకున్నారు:-

డాక్టర్ కె. శ్రీనివాసస్వామి-అధ్యక్షులు. శ్రీ కె. వీరబ్రహ్మం-ఉపాధ్యక్షులు. శ్రీ బి స్వామి ముదిరాజు-కార్యదర్శి శ్రీ డి పాండు, శ్రీ కె వెంకటాములు, సహాయకార్యదర్శులు శ్రీయుతులు జనార్దనాచారి లక్క రాజు సత్యనారాయణ జంపాలు వెంకులు చెరు, రాములు సింహాచారి వాడపెల్లి వెంకటేశ్వర్లు. నూకల సైదులు కార్యవర్గ సభ్యులు

కర్నూలు జిల్లాలో పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు

(ఆంధ్రభూమి విలేకరి)

కర్నూలు, మే 3

పంచాయతీ ఎన్నికల సందర్భంలో ప్రతి పంచాయతీ సమితి (బ్లాక్) లోని 5 గ్రామాల చొప్పున జోనులను ఏర్పాటు చేసి ఒక్కొక్కదానికి ఒక్కొక్క ఎన్నికోద్యోగిని నియోగించినట్టు జిల్లా పంచాయతీల అధికారి వెల్లడించారు జిల్లాలోని పంచాయతీ గ్రామాలను ఐదు జోన్‌లుగా రూపొందించినట్టు ఆయన తెలిపారు. మొదటి రెండు జోన్‌లకూ చెందిన గ్రామ పంచాయతీలకు వరుసగా ఈ నెల 29,31 తేదీలలోను 3,4 జోన్‌ల వచ్చేనెల 2,4 తేదీలలోను, ఐదవ జోన్‌లో జూన్ 6వ తేదీన ఎన్నికలు జరుగుతాయని ఈ నెల 10న గ్రామాలలో ఎన్నికల ప్రకటన జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి వివరించారు. ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం 2-30 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగు జరుగుతుంది

ఆకాశవాణి గురువారం 7-5-1964

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలో సై)

ఉ: 6-30 సుప్రభాతం, కార్యక్రమ వివరణ 6-40 ఆంగ్లములో వార్తలు 6-45 భక్తిరంజని: (విజయవాడనుండి రిలే) 6-55 సూక్తిముక్తావళి 7-00 తెలుగులో వార్తలు 7-15 సంకీర్తనం (భక్తిపాటలు) 7-30 లలిత సంగీతం 7-45 సంగీతశిక్షణ 8-00 ఆంగ్లములో వార్తలు 8-15 విజయవాడవలె 8-30 విజయవాడవలె 9-00 వాతావరణ సూచన ప్రసార సమాప్తి.

మ: 12-30 కార్మికుల కార్యక్రమం 1-00 స్త్రీలకు (ఉర్దూ) 1-30 లలిత సంగీతం; 1-40 హిందీలో వార్తలు 1-50 తెలుగులో వార్తలు 2-00 హైదరాబాద్ బి వలె 2-10 ఉర్దూలో వార్తలు 2-20 హైదరాబాద్ బి వలె 2-30 ప్రసారసమాప్తి.

సా: 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతియవార్తలు 6-15 ప్రస్తుతాంశం 6-20 చహల్‌పహల్ 7-00 తెలుగులో వార్తలు 7-15 మరాఠీశ్రోతలకు 7-30 హైదరాబాద్ బి వలె 7-45 రాగం, తానం, పల్లవి (మద్రాస్‌నుండి రిలే) 8-40 విరామసంగీతం 8-45 రహీముద్దీన్ డాగర్ 9-00 ఆంగ్లములో వార్తలు 9-15 ఉర్దూలో వార్తలు 9-30 అఖిలభారత నాటక కార్యక్రమం 10-30 ఆంగ్లములో వార్తలు 10-35 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి, జనగణమన.

హైదరాబాద్-బి

కడప

252.1 మీ (1190 కిలో సై)

విశాఖపట్నం

322.6 మీ (930 కిలో సై)

సా|| 6-00 నుండి రా|| 9-30వరకు

89.42 మీ (3355 కిలో సై)

(హైదరాబాద్ మాత్రమే)

ఉ: 6-30 హైదరాబాద్ ఎ వలె 7-45 ప్రసార సమాప్తి.

49.02 మీ (6120 కిలో సై)

[illegible]-00 హైదరాబాద్ ఎ వలె 9-00 ప్రసారసమాప్తి.

42.02 మీ (7140 కిలో సై)

(హైదరాబాద్ మాత్రమే)

మ: 12-30 హైదరాబాద్ ఎ వలె 1-00 వి. జయమణి 1-30 హైదరాబాద్ ఎవలె 2-00 వాతావరణసూచన. వి. జయమణి 2-30 ప్రసార సమాప్తి.

60.12 మీ (4990 కిలో సై)

సా: 6-00 హైదరాబాద్ ఎ వలె 6-20 గ్రామస్థుల కార్యక్రమము 7-00 తెలుగులో వార్తలు 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-30 వ్యవసాయ ఉత్పత్తి అభివృద్ధి 7-40 విరామ సంగీతం 7-45 హైదరాబాద్ ఎ వలె 8-45 ఈ మానవు పాట విమలా పద్మనాభన్ 8-50 విరామ సంగీతం 8-55 హైదరాబాద్ ఎ వలె 9-25 విరామ సంగీతం 9-30 హైదరాబాద్ ఎ వలె 10-35 వాతావరణసూచన, ప్రసార సమాప్తి, జనగణమన.

విజయవాడ

357.1 మీ (840 కిలో సై)

ఉ: 6-30 శుభోదయం 6-40 ఆంగ్లములో వార్తలు 6-45 భక్తిరంజని 6-55 సూక్తిముక్తావళి 7-00 తెలుగులో వార్తలు 7-15 ప్రసార విశేషాలు 7-20 చతురంగము కదంబ కార్యక్రమం 7-30 అల్లంరాజు సోమేశ్వరరావు 8-00 ఆంగ్లములో వార్తలు 8-15 ప్రాంజలి 8-30 మహమ్మద్ ఖాసింసాహెబ్ 9-00 ప్రసార సమాప్తి.

మ: 12-30 కార్మికుల కార్యక్రమం (హైదరాబాద్ నుండిరిలే) 1-00 అల్లంరాజు సోమేశ్వరరావు 1-30 వాద్య సంగీతం 1-40 హిందీలో వార్తలు 1-50 తెలుగులోవార్తలు 2-00 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి

సా: 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు 6-15 నేటి విశేషం 6-20 గ్రామస్థుల కార్యక్రమం 7-00 తెలుగులోవార్తలు 7-15 గ్రామస్థుల కార్యక్రమం 7-30 ప్రసంగం (హైదరాబాద్ నుండి రిలే) 7-45 రాగం, తానం, పల్లవి (మద్రాస్‌నుండి రిలే) 8-40 ఫిల్మ్‌సంగీతం 9-00 ఆంగ్లంలో వార్తలు 9-25 లలితసంగీతం 9-30 అఖిలభారత నాటక కార్యక్రమం "గోరా" (తెలుగు) (మద్రాస్ నుండి రిలే) 10-30 ఆంగ్లములో వార్తలు 10-35 వాతావరణసూచన, ప్రసారసమాప్తి, జనగణమన.

డాంగే లేఖల ప్రతులు రాజ్యసభకు సమర్పణ

మంత్రి శ్రీ హాథీ ప్రకటన

న్యూఢిల్లీ, మే 4

నేషనల్ ఆర్కివ్స్‌లోని డాంగే లేఖల ప్రతులను, ప్రభుత్వం సభవారి ముందు ఉంచగలదని దేశీయ వ్యవహారాల స్టేట్‌మంత్రి శ్రీ జైసుక్‌లాల్ హాథీ శ్రీ లోక్‌నాథ్‌మిశ్రాకు రాజ్యసభలో వ్రాతమూలకంగా యిచ్చిన సమాధానంలో తెలియ జేశారు.

1924-25 సంవత్సరాలలో అప్పటి భారతప్రభుత్వానికి శ్రీ డాంగే వ్రాశారని చెప్పబడే కొన్ని లేఖలు నేషనల్ ఆర్కివ్స్ లో భద్రపరచబడ్డాయని ఆయన చెప్పారు.

'చచ్చేవరకు స్వయం నిర్ణయాధికారాన్ని కోరుతూనేఉంటాను'

వినోబాతో చర్చల తర్వాత షేక్ అబ్దుల్లా ప్రకటన

వార్ధా, మే 4

కాశ్మీర్ ప్రజలకు స్వయం నిర్ణయాధికార హక్కు వినియోగించుకొనే అవకాశం లభించాలని మరోసారి కోరుతూ షేక్ అబ్దుల్లా "నా బొందిలో ప్రాణమున్నంతవరకు స్వయంనిర్ణయాధికార హక్కు కాశ్మీర్ ప్రజలకు లభించాలనే కోరికను విడనాడను" అని అన్నారు.

ఆచార్య వినోబాభావేతో చర్చలు జరిపిన అనంతరం పత్రికా విలేకరులతో మాటాడుతూ ఆయన అలా అన్నారు. ఆచార్య భావేతో తమ చర్చలు ఫలప్రదంగాను, సంతృప్తికరంగాను ఉన్నాయని ఆయన అన్నారు.

కాశ్మీర్ సమస్యకు నిర్దిష్టమైన పరిష్కారమేదైనా మీవద్ద ఉన్నదాఅని ప్రశ్నించగా ఆయన సమాధానమివ్వ నిరాకరించారు ఏ పరిష్కారమైనా ఇండియా సెక్యులర్ విధానాన్ని బలహీన పరిచేదిగా ఉండరాదన్నారు భారత పాకిస్తాన్‌లు కలహించుకుంటున్నంతకాలం కాశ్మీర్ ప్రజలు తమ స్వాతంత్ర్యాన్ని అనుభవింప జాలరన్నారు

Printed by K. R. Pattabhiram B.A for the Proprietors at the Deccan Chronicle Press 36 Sarojini Devi Road, Secunderabad Managing Editor & Publisher: K R Nandagopal. Editor: Gora Sastry.

పునర్విభజన తర్వాత ఉండే బ్లాకుల జాబితా

హైదరాబాద్, మే 6

పునర్విభజన తర్వాత రాష్ట్రంలో ఉండే బ్లాకుల జిల్లావారి వివరాలు ఈ విధగా ఉన్నాయి

హైదరాబాద్

1. హయాత్‌నగర్, 2 ఇబ్రాహీంపట్నం, 3. మేడిచల్, 4 రాజేంద్రనగర్ 5. చేవెళ్ళ 6 వికారాబాద్, 7 తాండూరు, 8 పర్గి.

నిజామాబాద్

1. డిచ్‌పల్లి, 2 ఆర్మూర్ 3 భీమగల్లు 4. యెడపల్లి, 5 బాన్స్‌వాడ 6 మద్నూరు. 7, కామారెడ్డి 8 దోమకొండ, 9 యెల్లారెడ్డి

మహబూబ్‌నగర్

1 మహబూబ్‌నగర్, 2 జెడ్‌చర్ల 3 షాద్‌నగర్, 4 ఆత్మకూర్ 5 అమనగల్లు, 6 బిజ్నాపల్లి 7 నాగర్‌కర్నూల్, 8 అచ్చంపేట, 9, కొల్లాపురం, 10. గద్వాల 11. మనోపాడు 12 వనపర్తి, 13 మక్తల్ 14 దేవరకద్ర 15. కోడంగల్, 16 కోసిగి

మెదక్

1. మెదక్, 2 జోగిపేట 3 అల్లాదుర్గ్ 4 నర్సాపూర్, 5 పటన్‌చెరువు 6 జహీరాబాద్, 7. నారాయణఖేడ్ 8 సిద్దిపేట 9 దుబ్బాక, 10 గజ్వేల్,

ఆదిలాబాద్

1 ఆదిలాబాద్ 2 ఉట్నూరు 3. బోథ్, 4 నిర్మల్, 5. ఖానాపూర్, 6 ముధోల్, 7 లక్సెట్టిపేట, 8 ఆసిఫాబాద్, 9 వంకిడి, 10. చెన్నూరు. 11. సిర్పూరు.

కరీంనగర్

1. కరీంనగర్, 2 హుస్నాబాద్. 3 గంగాధర. 4. హుజూరాబాద్. 5. భీమదేవరపల్లి (సుల్తానాబాద్ మంథెన తాలూకాలలో రెండేసి బ్లాకుల చొప్పున పేర్లు తర్వాత ప్రకటిస్తారు). 10. జగిత్యాల 11. మల్యాల, 12 సిరిసిల్లా, 13. వేములవాడ, 14 మెట్టుపల్లి,

వరంగల్

1. ఘనపురం. 2. వర్ధన్నపేట. 3. హనుమకొండ (సింగారంలో కేంద్ర కార్యాలయం ఉంటుంది). 4 కోడకొండ్ల, 5. జనగామ, 6. చేర్యాల, 7. పరకాల, 8.కమలాపురం, 9 మహబూబాద్. 10 మరిపెడ, 11. నర్సంపేట, 12, కొత్తగూడెం (నర్సంపేట తాలూకా), 13. ములుగు, 14 ఏటూరు నాగారం.

ఖమ్మం

1. ఖమ్మం, 2. తిరుమలాయపాలెం 3 మధిర. 4. కల్లూరు, 5. కొత్తగూడెం, 6.అశ్వారావుపేట, 7.బూర్గంపాడు, 8. యెల్లందు. 9. సుద్దిమళ్లం 10. వెంకటాపురం. 11. భద్రాచలం. 12. కూనవరం, 13. వరరామచంద్రపురం.

నల్లగొండ

1. నల్లగొండ, 2, మునుగోడు, 3. నకిరేకల్లు, 4. సూర్యాపేట. 5. నాగారం, 6. భువనగిరి, 7. ఆలేరు, 8. రామన్నపేట, 9. మోతుకూరు. 10, మిర్యాలగూడెం. 11. పెద్దవూర, 12. దేవరకొండ, 13 చింతపల్లి, 14. హుజూర్ నగరం, 15. కోదాడు.

శ్రీకాకుళం

1. గార, 2. సరిబుజ్జిలి, 3. పరసన్నపేట. 4. కోటబొమ్మాళి. 5. చీపురుపల్లి 6. రణస్థలం, 7. షేర్ మహమ్మద్‌పురం, 8. టెక్కలి, 9. కాశిబుగ్గ, 10. ఇచ్ఛాపురం, 11. మండస, 12. కొత్తూరు, 13. పాతపట్నం, 14. పార్వతీపురం. 15 కురుప్పం, 16. భద్రగిరి, 17. సాలూరు, 18. పచ్చిపెంట, 19. సీతంపేట, 20. పాలకొండ, 21. రాజాం, 22. వీరఘట్టం, 23. బొబ్బిలి, 24. బాడంగి.

విశాఖపట్నం

1. పెందుర్తి, 2. పచ్చివరం. 3. కసింకోట, 4. భీమునిపట్నం. 5. భోగాపురం,6. నెల్లిమర్ల, 7.గంట్యాడ 8. శృంగవరపుకోట, 9. వియ్యంపేట, 10. పాడేరు, 11. అరకు, 12. గంగరాజుమాడుగోలు, 13. గంవరాయి, 14. కిలగూడ, 15. అనంతగిరి, 16. రావికమటం, 17. కోటపాడు, 18. మాడుగుల, 19. నర్సీపట్నం, 20. కోటవురట్ల, 21. చింతపల్లి, 22. కొయ్యూరు, 23. ఎలమంచిలి. 24. నక్కపల్లి.

తూర్పు గోదావరి

1. పిఠాపురం, 2. అమలాపురం. 3. ముమ్మిడివరం, 4. కొత్తపేట, 5, గన్నవరం, 6. రాజోలు. 7, రాయవరం. 8. కపిలేశ్వరపురం. 9.రాజానగరం, 10. కోరుకొండ 11 రంగంపేట, 12. పెద్దాపురం. 13. శంఖవరం.

కాకినాడ, రంపచోడవరం, యల్లవరం తాలూకాలలో రెండేసిబ్లాకులను తుని తాలూకాలో ఒక బ్లాకును ఏర్పాటు చేశారు. ఈ పేర్లను తరువాత ప్రకటిస్తారు.

పశ్చిమ గోదావరి

1. భీమడోలు, 2. పెదపాడు. 3. చింతలపూడి, 4. వల్లకెర్ల, 5. గణపవరం. 6. నిడదవోలు. 7. గోపాలపురం, 8. పోలవరం. 9. బుట్టాయగూడెం, 10. కొయ్యలగూడెం 11 పెరవలి, 12. పెనుమంట్ర, 13 మొగల్తుర్రు, 14 పోడూరు, 15. ఆకివీడు, 16. విస్సాకోడేరు.

కృష్ణా

1. బందరు, 2. బంటుమిల్లి, 3 అవనిగడ్డ, 4. మొవ్వ, 5. నూజివీడు, 6. తిరువూరు, 7 విస్సన్నపేట, 8. గన్నవరం, 9 ఉయ్యూరు, 10. గుడివాడ (ఈ బ్లాకు ప్రధానకేంద్రం మోటూరులో ఉంటుంది) 11. కైకలూరు, 12 మండవల్లి, 13 మైలవరం, 14 కంకిపాడు, 15 నందిగామ 16. కంచికచెర్ల, 17. జగ్గయ్యపేట.

గుంటూరు

1 తాడికొండ 2 మంగళగిరి 3 ప్రత్తిపాడు, 4 ఈమని 5 తెనాలి. 6 అమృతలూరు, 7. రేపల్లె, 8 వల్లపట్ల 9. ఒంగోలు, 10 కోరిసెపాడు 11. మద్దిపాడు 12. బాపట్ల, 13 వేటపాలెం. 14 పొన్నూరు. 15. నరసరావుపేట, 16 నాదెండ్ల, 17. సంతమాగులూరు, 18. గురజాల. 19. మాచెర్ల, 20 పిడుగురాళ్ల, 21 వినుకొండ 22 ఈపూరు.

సత్తెనపల్లి తాలూకాలోని మూడు బ్లాకుల ప్రధాన కేంద్రాలను తరువాత ప్రకటిస్తారు.

నెల్లూరు

1. వెంకటాచలం. 2 ఇందుకూరుపేట, 3 రాపూరు. 4 పొదలకూరు. 5. ఆత్మకూరు 6. వెంకటగిరి. 7. కోట, 8. సూళ్ళూరుపేట 9 గూడూరు, 10. కొండాపి. 11. ఉలవపాడు. 12. కనిగిరి. 13 వలిగండ్ల 14 తార్లపాడు, 15. పొదిలి, 16 తాళ్ళూరు, 17. కావలి, 18. వింజమూరు. 19 ఉదయగిరి, 20. కోవూరు. 21 బుచ్చిరెడ్డిపాలెం.

చిత్తూరు

1. చిత్తూరు, 2 గంగాధరనెల్లూరు, 3. బంగారుపాలెం, 4. వట్టూరు, 5. కార్వేటినగరం, 6. చంద్రగిరి, 7. పులిచర్ల, 8. కాళహస్తి, 9 తోటమేడు, 10. సత్యవేడు, 11. పేనతూరు, 12. మండపల్లి, 13. తంబళ్ళపల్లి. 14. వాయల్పాడు, 15. చిన్నగొట్టిగల్లు 16. పుంగనూరు, 17. చౌడెపల్లి, 18. పల్మనేరు, 19. కుప్పం.

కడప

1. రాయచోటి, 2. లక్కిరెడ్డిపల్లి, 3. కమలాపురం, 4. కడప. 5. జమ్మలమడుగు, 6. మద్దనూరు, 7, ప్రొద్దుటూరు, 8. పులివెందల, 9. రాజంపేట, 10. కోడూరు, 11. పోరుమామిళ్ళ, 12. సిద్దవటం.

అనంతపూర్

1. సింగనామల, 2. కుదేరు, 3. తాడిపత్రి. 4. గుత్తి. 5 ఉరవకొండ, 6. ధర్మవరం, 7. చిన్నకొత్తపల్లి, 8. కల్యాణదుర్గం, 9. కంబదూరు, 10. రాయదుర్గం, 11. కనేకల్, 12. పెనుగొండ, 13. మడకసిర, 14. కొడిజనహల్లి, 15. కదిరి (తూర్పు), 16. కదిరి (పశ్చిమ)

కర్నూలు

1. ఆదోని, 2. ఎమ్మిగనూరు, 3. ఆలూరు, 4. పత్తికొండ, 5. కర్నూలు 6. కోడుమూరు, 7. ద్రోణాచలం, 8. నందికొట్కూరు, 9. ఆత్మకూరు, 10. మార్కాపూర్, 11. యర్రగొండపాలెం, 12. గిద్దలూరు, 13. బెస్తవారిపేట, 14. నంద్యాల, 15. కోయిలకుంట్ల, 16. బంగనపల్లి, 17. అల్లగడ్డ.

పార్లమెంట్ ప్రత్యేక సమావేశ తేదీలు

న్యూఢిల్లీ, మే 4

లోక్‌సభ వచ్చే సమావేశం తాత్కాలిక కార్యక్రమం ప్రకారం మే27నాడు ప్రారంభమై జూన్ 5తో ముగుస్తుంది.

అలాగే రాజ్యసభసమావేశం జూన్ ఒకటవ తేదీనాడు ప్రారంభమై ఐదవ తేదీతో ముగుస్తుందని తెలుస్తున్నది.

రాజ్యాంగం 17వ సవరణ బిల్లును ఆమోదించడానికిగాను ఉభయసభలను వేసవి మధ్యలో ప్రత్యేకంగా సమావేశపరచడం జరుగుతున్నది.

తృతీయ ప్రణాళికకు ఇప్పటివరకు అందిన రుణం 2055 కోట్లు

న్యూఢిల్లీ,మే 4

మూడవ ప్రణాళికకుగాను విదేశ సహాయం క్రింద భారత ప్రభుత్వం గత ఫిబ్రవరి ఒకటవ తేదీవరకు మొత్తం 2055.55 కోట్ల రూపాయలు పొందినట్టు లోక్‌సభలో నేడు తెలియజేశారు.

"నెహ్రూల నగరం"

అలహాబాద్, మే 4 (పి టి ఐ)

అలహాబాద్‌ను "నెహ్రూల నగరం"మని కేంద్ర మంత్రి శ్రీ సి సుబ్రహ్మణ్యం నిన్న ఇక్కడ అభివర్ణించారు.

పవిత్రమైన త్రివేణీ సంగమ సందర్శన ద్వారా ఆధ్యాత్మిక భావసంపత్తిని పటిష్టం చేసుకోవడానికి పూర్వపు రోజులలో ఈ నగరాన్ని ప్రజలు సందర్శిస్తే, నెహ్రూల నగరం కాబట్టి ప్రస్తుత తరంవారు ఈ నగరాన్ని సందర్శిస్తున్నారని నిన్న ఇక్కడ ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ శ్రీ సుబ్రహ్మణ్యం అన్నారు.

నగరంలో గాస్‌ఫ్యాక్టరీ ఏర్పాటుకు సహాయ షరతులపై పరిశీలన

(ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి)

న్యూఢిల్లీ మే 3

హైదరాబాద్ వద్ద మిశ్రమ గాజు ఫ్యాక్టరీ నెలకొల్పడానికి హంగరీనుండి సహాయం పొందడానికి గల షరతులపై పరిశీలన జరుగుతున్నదని కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ నిత్యానంద కనుంగో గత బుధవారంనాడు రాజ్యసభలో తెలిపారు

ఈ ఫ్యాక్టరీకి కావలసిన స్థలాన్ని స్వాధీనం చేసుకొంటున్నట్టు తెలిసినదని శ్రీ పి.కె కుమారన్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ మంత్రి తెలిపారు.

ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి 200 లక్షల రూపాయలు వ్యయం కాగలదని సమాచారం లభించినట్టు ఆయన తెలిపారు దీనిలో సుమారు 164లక్షల మేరకు విదేశ రక ద్రవ్యం ఉంటుంది.

నష్టపరిహారానికై పాకిస్తాన్‌కు ఇండియా లేఖ

న్యూఢిల్లీ, మే 4

గత జనవరిలో మతకలహాలు జరిగినప్పుడు ఢాకాలోని భారత హైకమిషన్ సిబ్బంది సభ్యుల ఆస్తులను పాకిస్తానీయులు లూటీ చేసినందుకు నష్టపరిహారం చెల్లించాలని భారత ప్రభుత్వం పాకిస్తాన్‌ను కోరినది.

ఆ అల్లర్లలో ఢాకాలోని భారత సిబ్బంది 28 మందికి ఆస్తినష్టం సంభవించినది.

భద్రతా మండలిలో చర్చపై అబ్దుల్లా విడుదల ప్రభావం

న్యూయార్కు విమానాశ్రయంలో చాగ్లా వివరణ

న్యూయార్క్, మే 4

కాశ్మీర్ సమస్యపై భద్రతామండలి చర్చలో షేక్ అబ్దుల్లాను విడుదల చేసినందువల్ల కలిగిన పరిణామాల "ప్రభావం" ఉండక తప్పదని భారత ప్రతినిధి వర్గ నాయకుడు శ్రీ ఎం.సి. చాగ్లా నిన్న సాయంత్రం యిక్కడ అన్నారు.

బొంబాయి నుండి విమానంలో యిక్కడకు వచ్చిన శ్రీ చాగ్లా విమానాశ్రయంలో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ పైవిధంగా అన్నారు.

భారతదేశం, స్వేచ్ఛా ప్రజాస్వామ్యాలు కల దేశమని షేక్ అబ్దుల్లా విడుదల ద్వారా రుజువైనదని, ప్రభుత్వానికి ఇష్టంలేకపోయినా ప్రతిఒక్కరూ తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చునని శ్రీ చాగ్లా అన్నారు.

కాశ్మీర్ సమస్యపై ఇప్పుడు పరిశీలన జరపాలని భద్రతామండలిని కోరటానికి, పాకిస్తాన్ విదేశాంగమంత్రి శ్రీ జడ్. ఎ. భుట్టో ఒక సాధనంగా వినియోగిస్తున్నట్టుగా కాశ్మీర్‌లో తిరుగుబాటు ఏదీజరగలేదని ఆయన అన్నారు కాశ్మీర్‌లో పూర్తిగా శాంతియుత పరిస్థితులు నెలకొని ఉన్నాయని అబ్దుల్లా విడుదలద్వారా రుజువవుతోంది అక్కడ పరిస్థితి శాంతియుతంగా లేనిపక్షంలో ఏ ప్రభుత్వమూ ఆయనను విడుదలచేసి ఉండేదికాదు అని శ్రీ చాగ్లా అన్నారు

భారతదేశంలో కాశ్మీర్ అంతర్భాగమేననీ, భద్రతామండలి సమావేశం ఇప్పుడు అనవసరమనీ, దానికి ఇది సరియైన సమయంకాదనీ. భారత దేశ మౌలిక విధానంలో ఎట్టి మార్పులేదని ఆయన చెప్పారు.

ఈసారి భద్రతామండలి సమావేశానికై భారతదేశం కోరలేదు. పాకిస్తానే భారతదేశాన్ని సమావేశానికి ఈడ్చుకు వచ్చింది.

భద్రతామండలిని "ఈ పని చేయమని భారతదేశం కోరలేదు". "మా స్వంత వ్యవహారాలను మేమే పరిష్కరించుకునేందుకు వీలుగా మమ్మల్ని వదిలిపెట్టమని మాత్రమే కోరుతున్నాం" అని శ్రీ చాగ్లా అన్నారు.

కాశ్మీర్ రాష్ట్రంపై పాకిస్తాన్ దురాక్రమణ జరిపిందనేదే భద్రతామండలి ముందున్న ప్రధానమైనసమస్య కాశ్మీర్‌లో తమసైన్యాలు ఉన్నాయని అక్కడ తాను దురాక్రమణ జరిపిన విషయం యదార్థమేనని పాకిస్తాన్ కూడ అంగీకరించింది కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం కానిపక్షంలో, పాకిస్తాన్ దురాక్రమణనుభారతదేశం ఎదుర్కొనేదికాదు. అసలు పాకిస్తాన్ దురాక్రమణ జరిపిందనే ప్రసక్తే రాదు. అని శ్రీ చాగ్లా అన్నారు.

కాశ్మీర్ వ్యవహారాన్ని తిరగతోడటం ప్రమాదమని హెచ్చరిక

జమ్మూ మే 4 (పి.టి.ఐ)

భారతదేశంలో కాశ్మీర్ విలీనీకరణ రాజ్యాంగ రీత్యానూ, చట్టరీత్యానూ కూడా పూర్తి అయినదనీ. దానిని మళ్ళీ తిరగతోడడమంటే దేశంలో వేర్పాటుధోరణులకు అవకాశంకల్పించడమేనని పార్లమెంటు సభ్యుడు (స్వ) శ్రీ పి. కె. దేవ్ నిన్న ఇక్కడ బహిరంగసభలో మాట్లాడుతూ అన్నారు.

దేశవిభజనవల్ల ఉపఖండంలో శాంతియుత పరిస్థితి నెలకొంటుందని లోగడ ఆశించినవారికి వివిధంగా నిరాశకలిగినదో కాశ్మీర్‌ను వదులుకోవడంద్వారా భారత్, పాకిస్తాన్‌ల మధ్య మిత్రత్వాన్ని సాధించవచ్చనే వారికికూడా అదేవిధంగా నిరాశ కలుగుతుందని ఆయన అన్నారు. కాశ్మీర్‌లో జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.

కాశ్మీర్‌పై జయప్రకాశ్ ప్రకటనలు విచారకరం

శ్రీ యన్. సి. ఛటర్జీ విమర్శ

చండీగఢ్, మే 4 (పి.టి.ఐ)

భారత వ్యతిరేక శక్తులకు లేక విచ్ఛిన్నకర శక్తులకు ప్రోద్బలంచేకూర్చడానికి, పశ్చిమరాజ్యాల ఆశయంసిద్ధించడానికి మాత్రమే ఉపకరించేటటువంటి అభిప్రాయాలను శ్రీ జయప్రకాశ్ నారాయణ్‌వంటి ఆదర్శ నాయకులే ప్రకటించడం శోచనీయమని పార్లమెంటు సభ్యుడు శ్రీ ఎన్. సి. ఛటర్జీ నిన్నఇక్కడ ఒక ప్రకటన చేసారు.

అల్పసంఖ్యాక వర్గాలను అణచివేయడంలో పాకిస్తాన్‌తో ఇండియానుకూడా జమకట్టడం ఘోరమని ఆయనఅన్నారు.

ముందు కర్తవ్యంతో చిక్క పశ్చిమదేశాల తికమక

భద్రతా మండలిలో కాశ్మీర్ సమస్య

ఐక్యరాజ్యసమితి, మే 4

కాశ్మీర్ సమస్యపై మంగళవారం నాడు భద్రతామండలిలోతిరిగి ప్రారంభం కానున్న చర్చలో తాము ఏవైఖరి అనుసరించాలనే విషయమై పాకిస్తాన్ మిత్రదేశాలైన పశ్చిమ రాజ్యాలు సందిగ్ధావస్థలో పడినట్టుతోస్తున్నదనిపి.టి ఐ. ప్రత్యేకవిలేకరి సి. రాఘవన్ తెలుపుతున్నారు.

ఇండియా అభ్యర్థనపై భద్రతా మండలి గత మార్చి 20వతేదీనకాశ్మీర్ సమస్య చర్చను ఈనెల 5వ తేదీకి వాయిదా వేసిన విషయం పాఠకులకు విదితమే. పాకిస్తాన్ కోరినప్పుడల్లా కాశ్మీర్ సమస్యపై చర్చసాగడానికి తాను వ్యతిరేకమనీ, చర్చను మేనెల మొదటివారం వరకు వాయిదావేయని పక్షంలో ఇండియా నుండి తగిన ప్రతినిధులు హాజరుకాజాలరని ఇండియా అప్పుడు స్పష్టపరిచింది. సంఖ్యాబలం ఉన్న పశ్చిమరాజ్యాలు, అయిష్టంగానే వాయిదాప్రతిపాదనకుఅంగీకరించాయి

షేక్ అబ్దుల్లా విడుదల కాగలరని ఆనాడు ఎవ్వరూ భావించలేదు.

విడుదల అనంతరం షేక్ అబ్దుల్లా చేసిన ప్రసంగాలను సమర్థించడం భారత ప్రతినిధివర్గానికి కొంత కష్టంగా తోచినప్పటికీ, షేక్ అబ్దుల్లా విడుదలతో పాకిస్తాన్‌వాదం 50 శాతం బలహీనపడింది. అంతేకాకుండా, పరిస్థితి చాలా అస్థిరంగా రూపొందిన కారణంగా పాకిస్తాన్ కాని పాక్ మిత్రదేశాలుకానీఒక నిర్దిష్ట విధానం నిర్ణయించుకోలేనిచిక్కులో పడినట్టు కనుపిస్తున్నది.

అబ్దుల్లా ప్రసంగాలలో తమకు అనుకూలంగా వున్న భాగాలను పాక్ విదేశాంగ మంత్రి భుట్టో ప్రచారం చేస్తున్నారుఅయితే షేక్ అబ్దుల్లావిషయంలో పాకిస్తాన్ వైఖరి ఏమిటో స్పష్టంగా పేర్కొనడానికి ఆయన వెనకాడుతున్నారు. అబ్దుల్లా ఇండియాను వ్యతిరేకించినప్పటికీ, పాకిస్తాన్‌ను సమర్థించగలరన్న హామీ లేకపోవడమే ఇందుకు కారణం.

దారితప్పిన సభ్యుడు

న్యూఢిల్లీ, మే 4

రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన అబ్దుల్ ఖాన్ అనే సభ్యుడు నేడు దారి తప్పి లోక్‌సభలోకి వచ్చి కూర్చున్నాడు. కొంచెం సేపు కూర్చున్న తర్వాత ఆయనకు తను చేసిన పొరపాటు తెలిసి మెల్లగాలేచి వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళిపోయిన తర్వాత గౌరీశంకర కక్కర్ అనే ఇండిపెండెంట్ సభ్యుడు బయటి వ్యక్తి ఇలా సభలో జొరబడ్డ సంగతిని స్పీకర్ దృష్టికి తెచ్చారు.

శ్రీ ప్రకాశవీర్ శాస్త్రి తాను కూడా కొత్త ముఖాన్ని సభలో చూచామని, ఆయన ఇటీవల మద్రాసునుండి ఎన్నికైన సభ్యుడై ఉంటాడని భావించామని, తర్వాత ఆచూకీ తీయగా ఆయన రాజ్యసభకు ఎన్నికైన కాంగ్రెస్‌సభ్యుడని తెలిసినదని అన్నారు.

వృత్తిశిక్షణకై యెమెనీ విద్యార్థుల ఢిల్లీ రాక

న్యూఢిల్లీ, మే 4

50మందితో కూడుకొనిన యెమెనీ విద్యార్థుల బృందాలు రెండు దేశంలో వివిధ వృత్తులలో పనులలో శిక్షణ పొందడానికి నేడిక్కడికివచ్చారు. వారు రెండేండ్లు శిక్షణపొందుతారు.

శరణార్థులపై కాల్పులు

కలకత్తా, మే 4

శరణార్థుల గుంపు ఒకటి 24 పరగణాల జిల్లాలోని జాదవ్‌పూర్ వద్ద ఒక సబర్బన్ రైలుపై ఇటుక బెడ్డలు టపాకాయలతో దాడి జరపగా వారిని చెదరగొట్టడానికి పోలీసులు నేటి సాయంకాలం ఐదుసార్లు కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో ఇద్దరుగాయపడ్డారు.

'ఆనందనిలయం' గ్రంథావిష్కరణ

ఖమ్మం, మే 4

కావ్యానికి అనాది సిద్ధమైన శాశ్వత విలువలువున్నవి. వచన రచన సాగించే వ్యక్తిని రచయితగాను,పద్యాన్నివ్రాసే వానిని కవిగాను పేర్కొనడం కద్దు. వాస్తవానికి ఈ రెంటికొరకు చేసే కృషి ఒకటిగానే వుంటుంది. ఈ రెండు ప్రక్రియలను కావ్యంగానే చెప్పవచ్చునని రసపుష్టి కలిగి అంతర్లీనమైన ఆత్మతేజస్సును ప్రస్ఫుటం చేసి ఆనందాన్ని అందిస్తూ కర్తవ్యోపదేష్టమైన ఉత్తేజాన్ని కలిగించే ప్రతి రచన కావ్యమనిపించుకొంటుందన్న అభిప్రాయాన్ని శ్రీ రాచకొండ నరసింహమూర్తి (ఆలిండియా రేడియో విజయవాడ) ఇక్కడవ్యక్తం చేసారు.

ఖమ్మం జిల్లా రచయితల సంఘ ఆధ్వర్యాన స్థానిక వర్తక సంఘ భవనంలో గత నెల 28న జరిగిన సాహిత్య సభను శ్రీ నరసింహమూర్తి ప్రారంభిస్తూపై విధంగా ప్రసంగించారు.

ఖమ్మం కలెక్టర్ శ్రీ అసదుల్లా సయాద్ సభకు అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి, రచయిత శ్రీ వింజమూరి శివరామారావు, శ్రీ యర్రంచంద్రశేఖరం చైనా దురాక్రమణ ఇతివృత్తంగా రచించినఆనంద నిలయంఅను తెలుగు సాంఘిక నవలను సభలో ఆవిష్కరించారు. సభా ప్రారంభం కావడానికి ముందు రచయితల సంఘకార్యదర్శి శ్రీ కె. అప్పారావు అతిథులకు, సభికులకు స్వాగతం చెప్పారు.

శ్రీ కొలిపాక మధుసూదనరావు రచయితను సభికులకు పరిచయం చేసి సంఘం తరపున ఆయనకు శాలువను బహూకరించారు.

శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు ఆనంద నిలయం నవలను సభికులకు పరిచయం చేస్తూ దానిలోని విశేషాలను ప్రస్తావించారు.

ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యుడు శ్రీ హీరాలాల్ మోరియా, శ్రీ కె. వెయిల్. నరసింహారావు డాక్టర్ వై. రాధాకృష్ణమూర్తి, రచయిత కృషిని ప్రస్తుతిస్తు ప్రసంగించారు. నవలా రచయిత శ్రీ చంద్రశేఖరం మాట్లాడుతూ ఈ నవలా రచన తమ తొలి ప్రయత్నమన్నారు జిల్లా రచయితల సంఘ కార్యదర్శి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.